

epaper.vaartha.com
WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

fb.com/vaartha Digital

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

14-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 163 పేజీలు: 12 వెల: 6.50



బీహార్ ఓటర్లలో అత్యధికులు బంగ్లా, నేపాల్ పౌరులు

రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు 5లో


## విలక్షణ నటుడు, 'పద్మశ్రీ' కోట శ్రీనివాసరావు ఇక లేరు



**దీర్ఘ అస్వస్థతతో హైదరాబాద్‌లో కన్నుమూత**

**నాలుగు దశాబ్దాలు పైగా సినిమా రంగంలో విశేష ఖ్యాతి**

**9 సార్లు నంది అవార్డులు సాధించిన అసాధారణ నటుడు**

**తమిళం, కన్నడం, హిందీ రంగాల్లోనూ గుర్తింపు**

**ప్రధాని మోడీ, తెలుగు సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డి.సిఎం పవన్ సహా పలువురు ప్రముఖుల నివాళులు**

**అభిమానుల అశ్రుతర్పణం మధ్య ముగిసిన అంత్యక్రియలు**



హైదరాబాద్‌లో కోట శ్రీనివాసరావు భౌతికకాయంవద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

**హైదరాబాద్ (పంజగుట్ట), జులై 13 (ప్రభాతవార్త):** విలక్షణ నటుడు, మాజీ శాసనసభ్యుడు కోట శ్రీనివాసరావు(83) ఆదివారం తెల్లవారుజామున ఫిలింనగర్ లోని తన నివాసంలో మృతిచెందారు. దీర్ఘ కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న కోట రెండు రోజుల క్రితమే 83వ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కంకిపాడులో జన్మించిన కోట శ్రీనివాస రావు 1978లో ప్రాణంఖరీదు సినిమాతో తన సినీప్రయాణాన్ని ప్రారంభించారు. నాలుగు దశాబ్ధాలకు పైగా సాగిన సినిమా కెరియర్‌లో ఆయన 750కి పైగా చిత్రాలలో నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో >>2

# ఎపి అభివృద్ధిని ఆపలేరు


**2027కు అమరావతి నిర్మాణం పూర్తి**

**ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు**

**పోలవరం ప్రాజెక్టు 2027కి పూర్తి**

**హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: సిఎం చంద్రబాబు**

**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధికి ఎవ్వరెన్ని అడ్డంకులు పెట్టేందుకు ప్రయత్నించిన వారు భంగపడాల్సిందేనని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఎవ్వరు అడ్డుకోలేరన్నారు. సామాజిక మాధ్యమాలు వేదికగా ఆయన ప్రజలకు పలు అంశాలను వెల్లడించారు.ప్రజల సహకా రంతో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.



అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు, రాజధాని రైతుల పోరాటానికి ఫలితం లభించిందన్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పామని గుర్తు చేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకెళ్తున్నందున ఆర్థిక కష్టాలున్నా ఏడాది పరిపాలనలో వ్యవస్థలన్నింటిని దారిలో పెట్టామన్నారు.పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు. తల్లికి వందనం అనుకున్నట్లుగానే ఎంత చదువుకునే పిల్లలు ఒక కుటుంబంలో చదువుకుంటుంటే వారికి ఇస్తున్నారు.ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తున్నామన్నారు.వచ్చే జనవరి నాటికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ప్రారంభవుతుందన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం డయాఫ్రం వాల్ పూర్తవుతుందన్నారు. ఇక ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. ప్రపంచం మెచ్చే నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. దశాబ్దం క్రితం ప్రధాని మోడీ చేతుల మీదుగా అమరావతికి శంకుస్థాపన జరిగిందన్న ఆయన గత ఐదేళ్ల విధ్వంస పాలనలో నలిగిపోయిందన్నారు.

వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆక్సిజన్ అందించారని కొనియాడారు. మరికొన్ని రోజులు సహకారం అందిస్తే బలమైన ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీయే విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతామని ముఖ్యమంత్రి వివరించారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతామని >>2

## అమరావతిలో భూ కేటాయింపులు

**కొత్తగా ఏడు సంస్థలకు 32.40 ఎకరాలు పంపిణి**

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో పలు సంస్థలకు భూ కేటాయింపులు, గతంలో చేసిన మరికొన్ని సంస్థల కేటాయింపులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సిఫార్సుల మేరకు పలు సంస్థలకు ప్రభుత్వం భూ కేటాయింపులు చేసింది. గతంలో భూములు కేటాయించిన ఆరు సంస్థలకు పలు సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాజధానిలో కొత్తగా ఏడు సంస్థలకు 32. 40 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ క్రమంలో బిజెపి రాష్ట్ర కార్యాలయానికి 2 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. 60 ఏళ్ల లీజు ప్రాతిపదికన పలు సంస్థలకు ఈ భూములు కేటాయించింది.

ఇక గెయిల్‌కు 0.40, అంబికాకు ఎకరా భూమి కేటాయింపులను రద్దు చేసింది. అందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని సిఆర్‌డిఎ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే వివిధ సంస్థలకు ఎపిసిఆర్డీఎ భూములు కేటాయింపుపై 18వ మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయాలకు పరిపాలన అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిఒఎంఎస్ నెంబర్ 122 జారీని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ జారీ చేశారు. జూన్ 23వ తేదీన జరిగిన మంత్రి వర్గ ఉప సంఘం భూములు కేటాయింపు.. పున: పరిశీలన, కొత్తగా కేటాయింపు చేస్తూ పలు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రతిపాదనలను జులై 5వ తేదీన జరిగిన 50 సిఆర్‌డిఎ అథారిటీ ముందు కమిషనర్ ఉంచారు. దీంతో సదరు ప్రతిపాదనలు ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## 26 నుంచి ముఖ్యమంత్రి సింగపూర్ పర్యటన

**రాష్ట్రానికి పెట్టుబడుల సమీకరణకై మంత్రులతో కలిసి పయనం**

**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఎపి రాజధాని అమరావతితోపాటు వివిధ జిల్లాలు, తీర ప్రాంత అభివృద్ధి కోసం పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రులతోపాటు ఉన్నతాధికారుల బృందం జులై 26 నుంచి 30 వరకూ సింగపూర్‌లో పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టిజి భరత్‌తోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. సింగపూర్‌లోని రాజకీయ, వ్యాపార వర్గాలతో ఈ బృందం సమావేశం కానుంది. నగర ప్రణాళిక, నగర సుందరీకరణ, ఉద్యానవనాలు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనతోపాటు భవిష్యత్ సాంకేతికతను అంది పుచ్చుకోవడం తదితర అంశాలపై చంద్రబాబు సారథ్యంలోని ఈ బృందం.. సింగపూర్‌లోని వివిధ రంగాల ప్రముఖలతో చర్చించనుంది.

## ఒక జిల్లా - ఒక ఉత్పత్తిలో ఎపికి 10 అవార్డులు

**ఏడు చేనేత, హస్తకళలు, రెండు వ్యవసాయ ఉత్పత్తులకు పురస్కారాలు**

**అంతర్రాష్ట్ర విభాగంలో మరో అవార్డుకు ఎంపిక**

**ఆగస్టు 7 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్**

**చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా**



చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** ఒక జిల్లా ఒక ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ ఒడిఒపి) కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు పది ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు లభించాయని రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా తెలిపారు. వీటిలో ఏడు అవార్డులు చేనేత మరియు హస్తకళా ఉత్పత్తులకు, రెండు వ్యవసాయ ఉత్పత్తులకు లభించాయి. మరో అవార్డు అంతరరాష్ట్ర విభాగంలో రాష్ట్రానికి దక్కింది. ఈ అవార్డులను సోమవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించే కార్యక్రమంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్ అధికారికంగా ప్రకటించి, ప్రదానం చేయనున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వ ప్రోత్సాహం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత చేస్తున్న కృషికి ఈ అవార్డులు నిదర్శనమని సిసోడియా పేర్కొన్నారు. అవార్డు పొందిన చేనేత, హస్త కళా ఉత్పత్తుల్లో విజయనగరం జిల్లా బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, కాకినాడజిల్లా పెద్దాపురం శారీస్, బాపట్ల జిల్లాలోని చీరాల శారీస్, తిరుపతి వెంకటగిరి శారీస్, పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం అల్లికలు, శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టు చీరలు ఉన్నట్లు తెలిపారు. వ్యవసాయ విభాగంలో గుంటూరు మిర్చి, శ్రీకాకుళం జీడిపప్పు అవార్డులు గెలుచుకున్నాయని చెప్పారు.ఇతర రాష్ట్రాలతో జరిగిన పోటీలో ఎపికి దక్కిన మరో అవార్డు వివరాలు సోమవారం నాటి కార్యక్రమంలోనే అధికారికంగా వెల్లడించనున్నట్లు చెప్పారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, కళాకారులు ఇప్పటికే న్యూఢిల్లీకి చేరుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సరం లోపే పది అవార్డులు రావడం రాష్ట్రానికి గౌరవంగా భావిస్తు >>2

## అమరావతిలో బిట్స్ పిలాని క్యాంపస్

**రూ. 1000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు: కుమారమంగళం బిర్లా**

**విజయవాడ, జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో బిర్లా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), పిలానీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నది.రూ.1,000 కోట్ల పెట్టుబడితో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ విశ్వవిద్యాలయ ఛాన్సలర్, బిర్లా గ్రూప్ చైర్‌పర్సన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. ఆ మేరకు ఓ ప్రకటన విడుదల చేసారు. కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లస్ (ఎఐ+) క్యాంపస్ రెండు దశల్లో దాదాపు 7,000 మంది విద్యార్థులను >>2

## అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

**లారీ బోల్తా: ఏడుగురు కార్మికులు మృతి**

**కడప, జులై 13:** అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. రెడ్డిపల్లె చెరువుకట్టపై లారీ బోల్తాపడి ఏడుగురు మృతిచెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనను గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కొందరుకూలీలు మామిడికాయలు కోసేందుకు వచ్చి పనిపూర్తి చేసుకుని కోసిన కాయలను మొత్తం లారీకి లోడ్‌చేసారు. ఇక వాటిని రైల్వే >>2


## వేదవర్సిటీలో అక్రమాలపై టిటిడి విజిలెన్స్ నివేదికలు!

**వ్యవస్థాపక దినోత్సవం నిర్వహణతో వెలుగులోకి**



**తిరుపతి, జులై 13ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం వేదాల పరిరక్షణలో భాగంగా రెండు దశాబ్ధకాలం క్రిందట తిరుపతిలో శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం స్థాపించింది. టిటిడి మానసపుత్రికగా నెలకొల్పిన ఈ వేదవిశ్వవిద్యాలయంలో పలు అక్రమాలపై ఇటీవల టిటిడి విజిలెన్స్ విభాగం విచారణచేసి నివేదికలు సిద్ధంచేసింది. గత ఐదేళ్లలో విశ్వవిద్యాలయంలో జరిగిన నియామకాలు, పాలనతీరుపై పలువురు ఆచార్యులు, అధ్యాపకుల నుండి ఆరోపణలు రావడంతో విజిలెన్స్ జోక్యం తప్పనిసరైంది. లోతుగా అధ్యయనం చేసిన విజిలెన్స్ విభాగం అక్రమాలను నివేదిక రూపంలో టిటిడి అధికారులకు అందజేసింది. రానున్న పాలకమండలి సమావేశంలో వేద విశ్వవిద్యాలయం పై చర్చించి మార్పులుచేర్పులు తీసుకునే దిశగా ఆలోచన చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో అప్పటి పాలకమండలి పెద్దల జోక్యంతో ఓ ఉన్నతాధికారి తీసుకున్న నిర్ణయాలతో జాతీయ విశ్వవిద్యాలయం (యూజిసి) నిబంధనలకు విరుద్ధంగా నోటిఫికేషన్ లేకుండా ఉపకులపతి పదవిని భర్తీచేయడం అప్పట్లోనే పెద్ద దుమారంరేగింది. అయితే అప్పటి టిటిడి పెద్దలు, ఓ అధికారి పెద్దగా పట్టించుకోకుండా వారికి అనుకూలమైన వ్యక్తిని నియమించారనేది ఇప్పుడు >>2

## బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు



**నేడు ఢిల్లీలో అవార్డును అందుకోనున్న కలెక్టర్**

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), జులై 13 ప్రభాతవార్త:** ఇప్పటికే దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన బొబ్బిలి వీణకు మరో అరుదైన గుర్తింపు లభించింది. ఒన్ డిస్ట్రిక్ట్... ఒన్ ప్రొడక్ట్ (ఒడిఒపి) బహుమతిక్రింద బొబ్బిలివీణ ఎంపికయ్యింది. ఒడిఒపి అవార్డుకు >>2

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షల సాయం

**బిసి, మైనార్టీలకు రూ.20 లక్షలు**

**ఇబిసి, కాపులకు రూ.15 లక్షలు**

**విజయవాడ, జులై13,ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లో ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్‌ను అమలులోకి తీసుకుని వస్తుంది. విదేశీ విద్యాపథకాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ,ఈబిసి,కాపు వర్గాల్లోని ప్రతిభావంతులైన పేదల పిల్లలకు విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనే కలను నెరవేర్చేలా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ విద్య పథకాన్ని పునరుద్దరించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులు పథకం అమలుకు కసరత్తు ప్రారంభించారు. ముసాయిదా మార్గదర్శకాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షలు,బీసీ,మైనార్టీలకు రూ.20 లక్షలు,ఈబీసీ,కాపు విద్యార్థులకు రూ.15 లక్షల చొప్పున అదించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు అదనంగా నిర్వహణ ఖర్చుల క్రింద రూ.5 లక్షలు ఇవ్వాలని సూచించారు. ఈ పథకానికి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిగా పేరు పెట్టనున్నారు. పిజి,పిహెచ్‌డీ,ఎంబీబీఎస్ కోర్సులకు ఈ పథకాన్ని అమలు చేసేలా ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది.2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం అంబేద్కర్,ఎన్టీఆర్ పేర్ల మీద ఈ పథకాన్ని అమలుచేసింది. వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకంపై పలు ఆరోపణలు వచ్చాయి. పథకానికి ఉన్న అంబేద్కర్,ఎన్టీఆర్ పేర్లను తొలగించి జగనన్న అనే పేరును పెట్టినట్లు విమర్శలున్నాయి. ఆర్థికసాయం పెంచినట్లు చూపించి విద్యార్థుల సంఖ్య పెరగకుండా నిబంధనలు పెట్టి ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకు పథక లబ్ధి అందకుండా చేసింది. సబ్జెక్టుల వారీగా క్యూఎస్ ర్యాకింగ్ ప్రకారం టాప్-50 వర్సిటీల్లో ప్రవేశాలు పొందే వారికే సాయం అందేలా నిబంధన తెచ్చింది.

## పేర్ని నానిపై మరో కేసు నమోదు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ కీలక నేత ,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పై విజయవాడలో ఆదివారం మరో కేసు నమోదైంది. విజయవాడ-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు ఫతావుల్లా, ఆషాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పేర్ని నానిపై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాలని మైనార్టీ నేతలు కోరారు. నాని తమ పార్టీ కార్యకర్తలపైన,నాయకులపైన అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదు దారులు అభిమోగించారు.దీని వలన శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసారు.



కోట శ్రీనివాసరావు భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న చిరంజీవి



కోట శ్రీనివాసరావు భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

# కోట శ్రీనివాసరావు ఇక లేరు

>> విలన్,కామెడీ, క్యారక్టర్ ఆర్టిస్ట్‌గా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి. అహనాపెళ్ళంట,ప్రతిఘటన,ఖైదీనంబర్ 786,శివ,యమలీల,గబ్బర్‌సింగ్ లాంటి చిత్రాలలో ఆయన తన నటనతో ఆయా సినిమాలకే హైలెట్‌గా నిలిచారు.2015 సంవత్సరంలో భారత ప్రభుత్వం కోట ప్రతిభను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రధానం చేసింది. అలాగే 9 నంది అవార్డులను ఆయన పొందారు.కోట నటనలో చూపిన నైపుణ్యం, పాత్రలలో సజీవత అభిమానులను ఎంతగానో ప్రభావితం చేసింది.రాజకీయ రంగంలో కూడా ఆయన తన విశిష్ట ముద్రను వేశారు.1999 నుంచి 2004 వరకు విజయవాడ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి బిజెపి ఎమ్మెల్యేగా సేవలందించారు.

**టాలీవుడ్‌లో ఆయనో బ్రాండ్...**

కోట శ్రీనివాసరావు టాలీవుడ్‌లో నటనకు ఓ బ్రాండ్ అని చెప్పవచ్చు. నటించేవారు ఎంతమంది ఉన్నా నటనలో జీవించేవారిలో కోట కూడా ఒకరని చెప్పాలి. ఆయన తనకు ఇచ్చిన పాత్రలో నటించడమే కాకుండా జీవించేవారని పలువురు దర్శకులు వ్యాఖ్యానించారు. కెమరామెన్ గంగతో రాంబాబు సినిమాలో కోట శ్రీనివాసరావు పక్షవాతం వచ్చిన వాడిలా నటించిన విధానం చూసిన వారు ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. ఎందుకంటే ఆయన ఆ పాత్రలో కనిపించిన విధానం అంత వాస్తవికంగా ఉంటుంది. నటించడంతో పాటు పాత్రలను బట్టి డైలాగ్ చెప్పే విధానం కోటకు ప్రత్యేక శైలి కలిగి ఉంటుంది. ఇవన్నీ కలిపే ఆయనను టాలీవుడ్‌లో ఒక విలక్షణ నటుడిగా నిలబెట్టాయి. తెలుగులో ఆయన చివరిగా 2023లో విడుదలైన సువర్ణ సుందరి అనే చిత్రంలో కనిపించారు. కోట శ్రీనివాసరావు తమిళంలో 30కి పైగాచిత్రాలలో నటించగా, హిందీలో 10, కన్నడంలో 8,మలయాళం,డక్కన్ భాషలో ఒక్కో చిత్రంలో నటించారు. అంతేకాదు కొన్ని చిత్రాలలో పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు....

**ప్రముఖుల సంతాపం..**

కోట శ్రీనివాసరావు ఆకస్మిక మృతి పట్ల తెలుగు రాష్ట్రాలలోని పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఎపి,తెలంగాణ సిఎంలు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఇరు రాష్ట్రాలకు చెందిన కేబినెట్ మంత్రులతో పాటు సినీ ప్రముఖులు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్‌తో పాటు సినీ రంగంయావత్తూ కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని ఆయనతో తాము నటించిన సందర్భాలను గుర్తుకు చేసుకున్నారు. ప్రముఖ కమెడియన్ బ్రహ్మానందం అయితే కోట భౌతిక కాయాన్ని దర్శించుకుని తీవ్ర దుఖంలో మునిగిపోయారు. అక్కడే విలపిస్తూ చాలాసేపు మౌనంగా నిల్చుండిపోయారు.

**ఎపి సిఎం చంద్రబాబు ఘన నివాళి..**

కోట శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ఎపి సిఎం చంద్రబాబునాయుడు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోట చిత్ర పరిశ్రమకు చేసిన సేవలను కొనియాడారు.కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

**పవన్ కల్యాణ్ ఘన నివాళి..**

ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కోట తన అన్న సినిమా ప్రాణం ఖరీదు సినిమాతో అరంగేట్రం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

**అభిమానులు, సన్నిహితులతో నిండిపోయిన ఫిలింనగర్..**

కోట శ్రీనివాసరావు మరణ వార్త ఆదివారం ఉదయం తెలియగానే ఆయన అభిమానులు, సన్నిహితులు, పరిశ్రమకులు చెందిన వారు ఉదయం నుంచే తండోపతండాలుగా ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. లెజండరీ యాక్టర్ అంటూ సినీ ప్రముఖులు కీర్తిస్తూ ఆయన చేసిన మరుపురాని పాత్రలను గుర్తుకు చేసుకున్నారు. ముఖ్యంగా సినీ,రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు చాలామంది స్వయంగా కోట భౌతిక కాయాన్ని సందర్శించుకుని చివరిసారిగా తమ అభిమాన నటుడుకి ఘన నివాళి అర్పించుకున్నారు. అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య ఆదివారం సాయంత్రం కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు మహాప్రస్థానంలో ముగిశాయి.

**విలక్షణ వ్యక్తిత్వం..సరదా మనిషి..వర్క్‌లో సిన్సియర్..**

కోట శ్రీనివాసరావుది విలక్షణ వ్యక్తిత్వంగా ఆయన మనసెరిగిన వారు చెబుతుంటారు.పనిలో ప్రత్యేక ధ్యాస, పనితర్వాతే ఏదైనా అనే మనిషి.సమయ పాలన, తోటి వారి పట్ల వాత్సల్యం..కాస్తంత సరదా మనిషి కూడా అని ఆయన సహచరులు చెబుతుంటారు. సెట్‌లో వచ్చాడంటే పాత్ర గురించి క్షుణ్ణంగా ఆకలింపు చేసుకుని తనదైన శైలిలో పాత్రను పండించడం ఆయనప్రత్యేకత. ఒకోసారి డైరక్టర్‌లు కూడా ఆయన నటనా చాతుర్యానికి అబ్బురపడేవారు. పాత్ర డిమాండ్‌ను బట్టి డైలాగ్ డెలివరీలో మేనరిజంను ఆయనే సెట్ చేసుకునేవారు. గత నాలుగు దశాబ్ధాలుగా విలనిజంలో కానీ, కామెడిని పండించడంలోకానీ, క్యారక్టర్ పరంగా ఆయనకు ఆయనే సాటిగా సినీ జీవితంలలో విరాజిల్లారు. ముఖ్యంగా కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ కాంబినేషన్ తెలుగునాట ఇప్పటికీ ఆయాపాత్రలు చక్కర్లు కొడుతూనేఉన్నాయి. మామగారు సినిమాలో కోట, బాబూ మోహన్ జంట చేసిన కామెడీ ఎప్పటికీ మరుపురానిదృశ్యాలే. అతడు సినిమాలో హీరో మహేష్‌బాబుతో పొలిటికల్ కన్సషన్ లేదా అని చెప్పే డైలాగ్ అందరి మెదళ్లలో నానుతూ ఉంటుంది. అహనాపెళ్లంటలో ఆయన చేసిన పిసినారి పాత్ర ఎప్పటికీ అజరామరమే. అత్తకు యముడు అమ్మాయికి మొగుడు సినిమాలో అలనాటి నటి వాణిశ్రీతో కాంబినేషన్ అబ్బురపరిచే విధంగా ఉంటుంది. సీనియర్ హీరోలకు పోటీగా విలనిజాన్ని పండించి అందరిచేత శహభాష్ అనిపించుకున్నారు.సీనియర్‌ల పట్ల గౌరవం, తోటి నటుల పట్ల వాత్సల్యం ఆయనను మేటి నటుడిగానే కాకుండా అందరి వాడిగా నిలబెట్టిందని చెప్పవచ్చు.

**రాజకీయాల్లో రాణింపు...**

సినీ నటుడిగా విజయవంతంగా కెరీర్ సాగుతున్న సమయంలోనే రాజకీయాల్లో కూడా రాణించారు. పోటీచేసిన మొదటి ఎన్నికల్లోనే విజయవాడ నగరంలో పోటీచేసి విజయం సాధించారు. అయితే తర్వాత రాజకీయాలలో కొనసాగడం ఇష్టం లేక తనకిష్టమయిన సినీ రంగంలోనే కెరీర్‌ను కంటిన్యూ చేశారు. సినిమాలలో విలన్ పాత్రలు ఎక్కువగా చేసినా నిజ జీవితంలో మాత్రం విలువలకు కట్టుబడి ఉండేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. కొత్తవవారిని ప్రోత్సహించడంలో కానీ, పేద కళాకారులను ఆదుకోవడంలో కానీ ఆయన ఎపుడూ ముందుండేవారు. గుప్త దానాలకు ఆయన ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. కొత్తగా సినిమాలు నిర్మించే నిర్మాతలకు సరైన సలహాలు ఇస్తూ నష్టపోకుండా సూచనలు ఇచ్చేవారని ఆయనను కడసారి చూడడానికి వచ్చిన పలువురు ప్రముఖులు చర్చించుకున్నారు. ఏది ఏమైనా కళామతల్లికి ఇష్టమైన మరో అధ్భుత నటుడు సంపూర్ణ నటుడు కనుమరుగు కావడం తెలుగు తెలరకు తీరని లోటు అని చెప్పాలి.

# బొబ్బిలి వీణకు అరుదైన గుర్తింపు

>> రాష్ట్రం నుంచి 7 జిల్లాలకు చెందిన ఉత్పత్తులు ఎంపిక కాగా, బొబ్బిలికి చెందిన నమూనా వీణ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని అందుకునేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఢిల్లీ వెళ్లారు. కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో సోమవారం జరిగే కార్యక్రమంలో ఒడిఒపి అవార్డును కలెక్టర్ అందుకోనున్నారు.

**బొబ్బిలి వీణకు అంతర్జాతీయ గుర్తింపు:**

బొబ్బిలి వీణకు దేశవిదేశాల్లో ఎనలేని ఖ్యాతి ఉంది. బొబ్బిలి వీణ అని విస్తృతంగా పిలువబడే బొబ్బిలి నుండి వచ్చిన సాంప్రదాయ 'సరస్వతి వీణ' విలక్షణమైన స్వరాలకు ప్రసిద్ధి చెందింది. అలాగే సర్వస్వతి వీణను పోలి ఉండే చిన్నపాటి వీణను బహుమతిగా, జ్ఞాపికగా ఇవ్వడం ఏళ్ల తరబడి సంప్రదాయంగా వస్తోంది. దేశంలోనే కాకుండా అంతర్జాతీయ సమావేశాలు, సదస్సుల్లో సైతం బొబ్బిలి నమూనా వీణలను జ్ఞాపికలుగా ఇవ్వడం జరుగుతోంది. బొబ్బిలి వీణ బొమ్మలతో పోస్టల్ స్టాంపులు, నాణేలు కూడా ముద్రితమయ్యాయి. ఇతర రాష్ట్రాలకు సైతం బొబ్బిలి వీణలు ఎగుమతి అవుతున్నాయి. ఢిల్లీలో జరిగిన జి 20 సదస్సులో, విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో సైతం బొబ్బిలి వీణ ప్రదర్శనలు జరిగాయి. అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్ ఈ వీణను చూసి ముచ్చట పడ్డారు. బొబ్బిలి వీణకు ఇప్పటికే మన కేంద్ర ప్రభుత్వం నుంచి భౌగోళిక గుర్తింపు కూడా లభించింది. బొబ్బిలి పట్టణానికి సమీపంలోని గొల్లపల్లి వీణల తయారీకి ప్రసిద్ధి చెందింది. వీణల తయారీ ఒక అరుదైన హస్త కళగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలోని దాదాపు 300 కుటుంబాలు గత 100 సంవత్సరాలకు పైగానే తమ జీవనోపాధి కోసం వీణల తయారీలో నిమగ్నమై ఉన్నాయి. బాడంగి మండలం వాడాడలో కూడా ప్రస్తుతం వీణలు తయారవుతున్నప్పటికీ, వాటికి కూడా బొబ్బిలి వీణలుగానే పరిగణిస్తున్నారు. వీటి తయారీకి పనస మరియు సంపంగి కలప చెక్కను ఉపయోగిస్తారు. వీణల తయారీకి కలప కొరతను నివారించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో విస్తృతంగా పనస చెట్లను పెంచాలని ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది. ఒడిఒపి క్రింద బొబ్బిలి వీణకు గుర్తింపు లభించడంతో, వీటి ఖ్యాతి మరింత ఇనుమడిస్తుందనడంలో సందేహం లేదు.

# అన్నమయ్య జిల్లాలో ఘోర ప్రమాదం

>> కోడూరుకు తీసుకెళ్లేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో వారువెళుతున్న లారీ రెడ్డిపల్లె చెరువుకట్టపైకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. దీనితోడ్రైవర్ నియంత్రణ కోల్పోయి లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ఏడుగురుకూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 8 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అయితేప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని అంబులెన్స్ సాయంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. తర్వాతపోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్నారు. ప్రమాదానికిగల కారణాలపైదర్యాప్తుచేస్తున్నారు.

# అన్ని రైలు బోగీల్లో ఇక సిసి కెమెరాలు

## అరాచకాలకు చెక్

**న్యూఢిల్లీ,జూలై 13:** రైళ్లలో తరచూ జరుగుతున్న దొంగతనాలు, దోపిడీలు, అరాచకాలు, హింసాత్మక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని రైళ్లలో ఏర్పాటు చేసి పరీక్షించింది. ఆ ప్రయోగం విజయవంతం కావడంతో రైల్వే అన్ని కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించాలని నిర్ణయించింది. ఈ చర్య ప్రయాణికుల భద్రతను గణనీయంగా మెరుగుపరుస్తుందని రైల్వే శాఖ భావిస్తోంది. దోపిడీ దొంగలు, క్రిమినల్ గ్యాంగ్స్ అమాయక ప్రయాణికులను లక్ష ్యంగా చేసుకుని తరచుగా దోపిడీలకు పాల్పడుతున్న నేప థ్యంలో కెమెరాల ఏర్పాటు ఈ తరహా నేరాలను అదుపు చేస్తాయని భావిస్తోంది. ప్రయాణికుల గోప్యతను కాపాడేందుకు, సీసీటీవీ కెమెరాలను కోచ్‌లలోని సాధారణ కదలిక ప్రాంతాలైన ద్వారాల సమీపంలో ఏర్పాటు చేయనున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, ఆ శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు, లోకోమోటివ్‌లు, కోచ్‌లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో రైల్వే బోర్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 360డిగ్రీ కవరేజ్ నార్తర్న్ రైల్వే లోకో ఇంజన్లు, కోచ్‌లలో నిర్వహించిన ప్రయోగాలు విజయవంతమైనట్లు రైల్వే అధికారులు తెలిపారు. దీంతో కేంద్ర రైల్వేమంత్రి 74,000 కోచ్‌లు, 15,000 లోకోమోటివ్ (ఇంజన్) లలో సీసీటీవీ కెమెరాలను స్థాపించేందుకు ఆమోదం తెలిపారు. ప్రతి రైల్వే కోచ్‌లో 4 డోమ్ రకం సీసీటీవీ కెమెరాలు – ప్రతి ద్వారం వద్ద 2 కెమెరాలు , ప్రతి లోకోమోటివ్‌లో 6 కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో లోకోమోటివ్ ముందు, వెనుక రెండు వైపులా ఒక్కో కెమెరా, అలాగే ప్రతి క్యాబ్ ముందు వెనుక ఒక డోమ్ సిసిటీవీ కెమెరా, రెండు డెస్క్ మోంటెడ్ మైక్రోఫోన్‌లు ఉంటాయి.

# ఆగస్టు మొదటి వారంలో నీట్ స్టేట్ కౌన్సెలింగ్

## ఇప్పటికే 43,400 మంది స్టేట్ ర్యాంక్‌లను ప్రకటించిన తెలంగాణ హెల్త్ వర్సిటీ

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. ఈ నెల 21 నుంచి ఆలిండియా కోటా, డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలకు మొదటి విడత కౌన్సెలింగ్‌ను ప్రారంభించనున్నట్టు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసిసి) ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో.. ఆగస్టు మొదటి వారంలో స్టేట్ నీట్ కౌన్సెలింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. అయితే రాష్ట్రాలకు చెందిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు పూర్తి చేయాలని ఎంసిసి సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని మెడిలక్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెలాఖరులో ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నీట్ యూజీ–2025 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఎంసిసి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 21 నుంచి 30 వరకు ఆలిండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీలు, రాష్ట్రం పరిధిలోని సీట్లలో చేరికకు సంబంధించిన మొదటి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. మొత్తం మూడు రౌండ్లలో జరిగే నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ సెప్టెంబర్ 10వరకు కొనసాగనుంది. మొదటి విడత నీట్ స్టేట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 30 నుంచి ఆగస్టు 6 వరకు నిర్వ హిస్తారని ఎంపిసి ప్రకటించింది. మూడు రౌండ్ల నీట్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 18 వరకు కొనసాగనున్నట్టు ఎంసిపి షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబర్ 1వ నుంచి ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభంకానున్నట్టు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి నీట్ యూజీ–2025 పరీక్షకి 70,258 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 43,400 మంది అర్హత సాధించినట్లు ఇప్పటికే కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెల 10న ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు డీమ్డ్ యూనివర్సిటీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కలిపి మొత్తం 64 మెడికల్ కాలేజీలున్నాయి. వాటిలో 34 రాష్ట్ర ప్రభుత్వ కాలేజీలు కాగా.. 28 ప్రైవేటు కాలేజీలు, మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ పేరిట 2 కాలేజీలు ఉండగా, ఈఎస్‌ఐ, బీబీనగర్ ఎయిమ్స్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి నవి ఉన్నాయి. ఈ కాలేజీలు అన్నింటిలో కలిపి 9,065 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 4,080 సీట్లు ఉండగా.. వాటిలో 15 శాతం నేషనల్ పూల్ కోటా..అంటే 613 సీట్లు ఆలిండియా కోటా సీట్లుగా భర్తీ అవుతాయి. మిగిలిన 3,477 సీట్లు పూర్తిగా తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయి. 26 ప్రైవేట్ కాలేజీల్లో 4,850 సీట్లు ఉన్నాయి. మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన రెండు మెడికల్ కాలేజీలు అందులో ఒకటి మహిళా కాలేజ్‌గా కొనసాగుతోంది..రెండు కూడా డీమ్డ్‌యూనివర్సిటీ కేటగిరీలో కొనసాగుతున్నాయి. ఈ రెండుకళాశాలల్లో కలిపి 400సీట్లు ఉండగా, డీమ్డ్ యూనివర్సిటీ విభాగంలో కౌన్సెలింగ్ జరుగనుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని 4,850 సీట్లలో 50శాతం కన్వీనర్ కోటా తెలంగాణ విద్యార్థులకే దక్కుతాయి. మరో 50 శాతం సీట్లలో 35 శాతం సీట్లు బి కేటగిరి సీట్లు కాగా.. మరో 15 శాతం సీట్లు సి కేటగిరీలో ఎన్‌ఆర్‌ఐ కోటాలో భర్తీ చేస్తారు.

# పిలాని క్యాంపస్

>>చేర్చుకుంటుంద న్నారు. 2027 నాటికి ఇది పనిచేయడం ప్రారంభించే అవకాశం ఉందని బిర్లా చెప్పారు. 35 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ కొత్త క్యాంపస్, ఎఐ మెషిన్ లెర్నింగ్, ఇన్నోవేషన్ మరియు స్ట్రాటజీలో అండర్ గ్రాడ్యుయేట్, మాస్టర్స్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. దీనితో పాటు, బిట్స్ పిలానీ మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడానికి, విశ్వవిద్యాలయం దీర్ఘకాలిక పరిశోధన, అభివృద్ధి సామర్థ్యాలను పెంచడానికి ..1,219 కోట్లు పెట్టుబడి పెట్టనుందని వైస్ ఛాన్సలర్ వి.రాంగోపాల్ రావు తెలిపారు.

## వారం - వర్జ్యం

14-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
చవితి రా.11.58
ధనిష్ఠ ఉ.6.58
వర్జ్యం : మ.1.53-3.28
దు.మ.12.40-1.32, 2) మ.3.16-4.08
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి ఏర్పడిన వివాదాలు వరిష్కరించుకుంటారు. ఉద్యోగాలకు స్వల్పధనలాభం పొందుతారు.

**వృషభం :** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. మంచికి వెళితే చెడు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

**మిథునం:** సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందు కొంటారు.

**కర్కాటకం:** అనవసర వివాదాలు పోతాయి. శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణబాధలు ఎక్కువై చికాకుపెడతాయి.

**కన్య :** దూరపు బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుదతారు.

**తుల :** మాటకు విలువ పెరుగుతుంది. కొత్త విద్యలపట్ల ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**ధనుస్సు:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**మకరం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన ఆత్మస్థైర్యంతో అధిగమిస్తారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు యత్నాలు నిదానంగా సాగుతాయి.

**కుంభం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వాహనసౌఖ్యం.

**మీనం :** కొన్ని అపవాదులు భరించాల్సి వుంటుంది. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఏపి ప్రభుత్వం న్యాబ్సిడ్‌తో ఎంఒయు

**అమరావతి, జులై 13, ప్రభాతవార్త :** ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపి రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఎపిసిఆర్డీఎ) ట్రాన్సాక్షన్ అడ్వైజరీ సర్వీసుల (టిఎఎస్) కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలెప్‌మెంట్ (న్యాబ్సిడ్)తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. స్ట్రాటజిక్ అడ్వైజర్‌గా పనిచేసే ఈ బ్యాంకు అమరావతి నగరాభివృద్ధి కోసం కీలకమైన విత్తన ప్రణాళిక రూపకల్పనలో ఏపిసిఆర్‌డికి మార్గనిర్దేశనం చేస్తుంది. విభిన్న మోడల్స్‌లో (ప్రైవేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్పులు, పిపిపి సహా) అమలు చేయదగ్గ విధానాలను అంచనా వేసి పలు మౌలిక సదుపాయాల ప్రాజక్టులకు విత్తీయ వ్యూహాలను రూపొందించేందుకు సహాయం చేయనుంది.

# కాకాణికి ముగిసిన పోలీస్ కస్టడీ

**నెల్లూరు క్రైమ్, జూలై 13, ప్రభాతవార్త :** వరుస పోలీస్ కేసులు, కస్టడీలతో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాలెం సమీపంలో మద్యం డంపును పట్టుకున్న కేసులో ముద్దాయిగా ఉన్న కాకాణిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. దీంతో శని ఆదివారాలలో ఎక్సైజ్ పోలీసులు కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుండి కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఆదివారం పోలీస్ శిక్షణా కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస నాయుడు కాకాణిని విచారించారు. అన్ని ప్రశ్నలకు తనకేమీ సంబంధం లేదంటూ మాజీ మంత్రి సమాధానం దాటవేసినట్లు తెలిసింది. పోలీసులు ఆధారాలు చూపించి ప్రశ్నించినప్పటికీ కాకాణి దానికి ఏమీ సంబంధం లేదని చెప్పారు.

# ఎపికి 10 అవార్డులు

>> న్నట్లు ఆయన అన్నారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒడిఒపి క్రింద గుర్తింపు పొందేలా సిఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కడప అరటి, చిత్తూరు టమాటా, అనంతపురం వేరుశెనగ వంటి ఉత్పత్తుల ఎంపిక కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. జిల్లా ఉత్పత్తులకు గుర్తింపు లభిస్తే స్థానిక పరిశ్రమలు అభివృద్ధి చెంది రైతులు, కార్మికులకు మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ అవార్డుల వలన చేనేత, హస్తకళా ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు విస్తరించనున్నాయని సిసోడియా తెలిపారు. కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించే అవకాశం ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహమే ఈ విజయాల వెనుక ఉందన్నారు.

ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సవిత మార్గనిర్దేశకత్వంలో హ్యాండ్‌లూమ్ మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్నామని తెలిపారు. అదే రోజు థ్రిఫ్ట్ ఫండ్ నిధులు కూడా విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఇది ఎన్నికల సమయంలో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని సగౌరవంగా నెరవేర్చడమే అవుతుందన్నారు. చేనేత ఉత్పత్తుల విక్రయాలను మెరుగుపరచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 ఆప్కో షోరూమ్‌ల సంఖ్యను పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా వస్త్రాల అమ్మకాలను చేపట్టామని, ఈ కార్యక్రమాల వల్ల నేతన్నలకు ఆర్థిక భద్రత లభించి, రాష్ట్రంలో చేనేత రంగం మరింత బలపడుతుందని సిసోడియా ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎపి అభివృద్ధిని ఆపలేరు

>> తెలిపారు. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో, ఎరైన్‌కో రామాయపట్నంలో పెట్టుబడులు పెడుతున్నాయని అన్నారు. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంఛింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి సీఎం అయ్యాను. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్ ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రధాన నగరాలను అమరావతికి అనుసంధానం చేస్తాం. 5లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచి విద్యాసంస్థలను ఏర్పాటు చేసి భావి తరాలను తీర్చిదిద్దండని సూచన చేశారు. దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఇప్పటికే చాలా విద్యాసంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగా తీసుకుని రాజధానిని పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం.

**రాష్ట్రమంతా సస్యశ్యామలం కావాలనే లక్ష్యంతో పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్ నిర్మాణం**

రాయలసీమతో సహా రాష్ట్రమంతా సస్యశ్యామలం కావాలంటే పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును అనుకున్న లక్ష్యాలకు పూర్తి చేసుకోవాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలరీలో ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టు కోసం జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పోలవరం కుడి ప్రధాన కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వి నీరు పంపగలిగితే రాయలసీమకు ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. అది పోలవరంబనకచర్ల అనుసంధానంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే ఎపిలోని అత్యధిక ప్రాంతాలకు సమృద్ధిగా నీళ్లు అందుతాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును అనుకున్న లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేస్తామన్నారు.ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. 9 నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు. కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగం పనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిపిస్తోంది. గతంలో చంద్రబాబు రూ.430 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే జగన్ విధ్వంసం చేశాడు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు మొదలుపెట్టాం. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాపర్ డ్యామ్‌ను బలోపేతం చేయడానికి బట్రస్ డ్యామ్ మే నెలకల్లా పూర్తి చేస్తాం. డయాఫ్రమ్ వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా సమాంతరంగా గ్యాప్1 వద్ద ఇసిఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని ఏప్రిల్‌లో మొదలుపెట్టారు. ఇక పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టును చేపట్టేందుకు జలహారతి కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంపెనీల చట్టం కింద వంద శాతం ప్రత్యేక వాహక సంస్థగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఛైర్మన్‌గా జల హారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. వైస్ ఛైర్మన్‌గా మంత్రి నిమ్మల రామానాయుడు, సంస్థ సిఇఒగా జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇతర అధికారులు ఉండనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.80,112 కోట్ల వరకువెల్లడించారు. రూ.81,500 కోట్ల వ్యయమయ్యే ఈ ప్రాజెక్టుతో ఏపీ భవిష్యత్తే మారిపోతుందని చెప్పారు. మంత్రివర్గ సమావేశంలో దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తుంది.

**రాయలసీమకు నీరందించేలా చర్యలు:**

గోదావరి బేసిన్‌లో వృథాగా పోతున్న వరద జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు తరలించేలా లింకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు.

# విజిలెన్స్ నివేదికలు!

>> గుప్పుమంది. వేదవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియామకానికి వేదాధ్యయనం, ఆచార్యులుగా దశాబ్ధకాలం అనుభవం ఉండాలి. అలాంటిది ఇవేమీ లేకుండానే ప్రస్తుతం ఆ పోస్టులో కొనసాగుతున్న ఆచార్యులు తనదైన రీతిలో ఇష్టానుసారంగా నియమాకలు చేపట్టారనేది వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. అంతా గత వైసిపి మయంగా మార్చేశారనేది ప్రధాన ఆరోపణ, దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన విజిలెన్స్ విభాగం కూడా అందుకు సంబంధించి నివేదికలు రూపొందించింది. వైదిక విద్యల విషయంలో ఎన్ఇపి -2020 అమలుచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నివేదిక. దీని ఫలితంగా వేదవిద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత ఏడాది ఎన్నికల సమయంలో అప్పటి వైసిపి మద్దతుదారులతో వేదవిశ్వవిద్యాలయం అకడమిక్ కౌన్సిల్‌ను నియమించి వారంతా వైసిపికి మద్దతుపలికేలా విశ్వవిద్యాలయంలో ఓ ఉన్నతాధికారి మార్గం సుగమం చేశారనేది నిఘా విభాగం నిగ్గుతేల్చింది. అధ్యాపకుల పదోన్నతుల్లోనూ రాజకీయజోక్యం సిఫార్సులతో చేపట్టారనేది ప్రధాన ఆరోపణ. కొందరు వేదపండితులకు వ్యక్తిగత గురుకులాలకు టిటిడి నిధులను కేటాయించిన అంశాన్ని కూడా విజిలెన్స్ గుర్తించింది. శనివారం రోజు జరిగిన వేదవిశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవానికి వర్సిటీ ఉన్నతాధికారి గైర్హాజరవ దంతో ఇప్పుడు ఈ ఆరోపణలకు బలంచేకూర్చేలా మారింది.

14-7Pg3exHMNWJQE.qxd:14-7Pg3exHMNWJQE.qxd 1/1/02 7:39 AM Page 1



# అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల బృందం

## ప్రభుత్వ అనుమతితో త్వరలో పునర్నిర్మాణం

**రాజంపేట, జూలై 13, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలోని అన్నమయ్య ప్రాజెక్టును నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. గత రెండు రోజులుగా అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలను నిపుణుల కమిటీ పరిశీలించింది. ఒక్క రోజంతా ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్‌లు, సాంకేతిక వివరాలు, భూ గర్భంలో నేల స్వభావం, ప్రాజెక్టు గేట్ డిజైన్‌లు ఇప్పటివరకు అన్నమయ్య ప్రాజెక్టుకు వచ్చిన వరద నీటి పరిస్థితి ఈ సంధర్భంగా చోటు చేసుకున్న పరిణామాలను ప్రాజెక్టు అధికారులను అడిగి తీసుకోవడమే కాకుండా దానికి సంబంధించిన పత్రాలను, వివరాలను పరిశీలించింది. ప్రభుత్వం నియమించిన డిజైన్ ఎక్స్‌పర్ట్, పోలవరం చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్ కె.సత్యనారాయణ జీయాలజిస్ట్ ఎం.రాజు, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీఓ) చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, కడప జిల్లా జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించడం జరిగింది. ఎర్త్ డ్యాం కొట్టుకుపోయిన ప్రాంతాన్ని వారు పరిశీలించారు. అనంతరం స్పిల్‌వే ని పరిశీలించారు. స్పిల్ వే ప్రక్కన ప్రారంభమైన మట్టికట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే ప్రాజెక్టు కుడివైపున కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎర్త్ డ్యాం కొట్టుకు పోయిన నదీ మధ్యలో ప్రాంతాన్ని పరిశీలించారు. అంతే కాకుండా రాక్ ఫిల్ డ్యాం నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను చేపడితే ఎలా ఉంటుందో పరిశీలించారు. అనంతరం చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి మీడియాతో మాట్లాడుతూ నిపుణుల కమిటీ ప్రాజెక్టును క్షుణ్ణంగా పరిశీలించిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తీసుకుందన్నారు. జియోలాజికల్ హైడ్రాలిక్ రాక్‌సాయల్‌తో పాటు వివిధ అంశాలను చర్చించడం జరిగిందన్నారు. నిపుణుల కమిటీ నివేదిక సిద్ధం చేసిన తర్వాత ప్రభుత్వానికి పంపుతుందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిపుణుల బృందాన్ని అన్నమయ్య జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ వెంటనే ప్రాజెక్టును పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. సీఎం ఆదేశాల మేరకు అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయనిఅన్నారు. అందులో భాగంగానే నిపణుల బృందం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ అబ్దు సమీ, ఈఈలు జయచంద్రా రెడ్డి, రవికిరణ్, ఏఈలు గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టు స్పిల్‌వే ను పరిశీలిస్తున్న నిపుణుల బృందం, మీడియాతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి

## చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం: సజ్జల

**విజయవాడ జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం నడుస్తోందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి ఇప్పటి వరకూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదు. జగన్ పర్యటనకు వచ్చినప్పుడల్లా వందల్లో కేసులు నమోదు చేస్తున్నారు. మామిడి యార్డు మూసివేశారు. చంద్రబాబు ఆధ్వర్యంలో పోలీసు రాజ్యం నడుస్తుందని ఆరోపించారు. ఎన్నికల్లో తీర్పు ఇవ్వాల్సింది ప్రజలే అందుకే ప్రజలకు చెబుతున్నాం చంద్రబాబు దుర్మార్గంగా అణచి వేసే ప్రయత్నం చేస్తున్నారు. మానసికంగా వేదిస్తున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తే జగన్ ఎందుకు బయటకొస్తారని సజ్జల ప్రశ్నించారు. తమపార్టీకి చెందిన సర్పంచ్ నాగమల్లేశ్వరావుపై దాడి చేసారన్నారు. ఆయన కోలుకుంటారని ఆశిస్తున్నాను అని తెలిపారు. ఇది రాజకీయపరమైన హత్యాయత్నం సీసీ కెమెరా విజువల్స్ భయానకరంగా ఉన్నాయి. అంబటి మురళిపైనే కేసు నమోదు చేశారు. రెచ్చగొట్టిన ధూళిపాళ్లపై కేసు పెట్టలేదు అని మండిపడ్డారు.

# తిరుమలేశుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లు షురూ

**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల శ్రీవేంకటేశ్వరస్వామికి సెప్టెంబర్ 23 నుండి మొదలుకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలలో ఏర్పాట్లు మొదలయ్యాయి. తొమ్మిదిరోజులుపాటు జరిగే దేవుని ఉత్సవాలకు దేశవిదేశాల ఉండి అశేషంగా భక్తులు తరలివస్తారనే ముందుచూపుతో అన్ని విధాలా అవసరమైన ఏర్పాట్లు, సౌకర్యాలు, గ్యాలరీలు నిర్మాణం, మాఢవీధుల్లో ఎండకు. వానకు రక్షణగా చలువపందిళ్ళు, జర్మన్‌షెడ్లు వేసేందుకు ఇంజనీరింగ్ పనులు ఆదివారం మొదలయ్యాయి. తొలుత ఉత్తరమాఢవీధినుండి ఈ పనులు శ్రీకారంచుట్టారు. ఈ ఏడాది సాలకట్ల బ్రహ్మోత్సవాలుమాత్రమే జరగను న్నాయి. ఈ వాహనసేవలను భక్తుల మధ్య జరిపించేందుకు తిరుమలతిరుపతి దేవస్థానం సిద్ధమవుతోంది. ఆలయం పరిసరాలు ,మాఢవీ ధుల్లో గ్యాలరీలు, ఇనుప పైపులతో నింపేస్తు న్నారు. ఈ పనులు మెల్లగా నెలన్నరరోజులు పటిష్టంగా సాగనున్నాయి.బ్రహ్మోత్సవాలకు ముందే ఆణివార ఆస్థానంకూడా వస్తుండటంతో తిరుమల భద్రత పరంగా సిద్ధమైంది. తిరుమలకొండపై ప్రతిరోజూ ఉత్సవాలు, సేవలే.బ్రహ్మోత్సవాలకు కొండను సర్వాం గసుందరంగా ముస్తాబుచేసే పనులు ఆరంభమ య్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 24నుండి తొమ్మిదిరోజులు ఆలయమాఢ వీధుల్లో వివిధ రకాల వాహనసేవల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మాఢవీధుల్లో గ్యాలరీలు ఏర్పాటుచేసే పనులు ఇంజనీరింగ్ చేపడుతోంది.




ఫ్లోర్‌పెయిటింగ్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ, పెయింటింగ్ వేస్తున్న కలెక్టర్

# కృష్ణమ్మ తీరాన కుంచెతో కోటి భావాలు

## ఉత్సాహంగా ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు: స్వయంగా పాల్గొన్న కలెక్టర్

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక అంశాలపై ఆయా రంగాల్లో ప్రతిభావంతులైన కళాకారులకు అవగాహన ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వ్యాఖ్యానించారు. యువత సైతం కళరంగంలో రాణించాలన్నారు. ప్రతి మనిషిలో సృజనాత్మకత ఉంటుందన్నారు. అది బయటకు రావాలంటే ఆయా అంశాలపై పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హరిత బెరం పార్కు కృష్ణా తీరంలో జరిగిన ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల్లో 300 మందికి పైగా యువత, చిన్నారులు పాల్గొని తమ కళా ప్రతిభను ప్రదర్శించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజా భాగస్వామ్యం) విధానం, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, స్వచ్ఛంధ్ర, సేవ్ వాటర్, రెడ్యూస్‌రీయూజ్‌రీసైకిల్, హరితాంధ్ర అంశాల్లో వేసిన వర్ణ చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొత్త శోభను సంతరించుకున్న కృష్ణా తీరం స్ఫూర్తి వైబ్రెంట్ విజయవాడకు తొలి అడుగు అని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కేంద్రం ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్2024 పురస్కారాల్లో విజయవాడ నగరం సూపర్ స్వచ్ఛతా లీగ్ అవార్డును గెలుచుకున్నందుకు నగర ప్రజలకు, నగరపాలక సంస్థ అధికారులు సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ చిన్నారులు, యువత పర్యావరణం, జల వనరులు, కాలుష్య దుష్పరిణామాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ కమిషనర్ ధ్యానచంద్ర బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఫ్లోర్ పెయింటింగ్ విభాగంలో స్వర్ణాంధ్ర విజన్ సేవ్ వాటర్ పెయింటింగ్‌తో జి.తనూజ మొదటిస్థానంలో నిలిచి రూ. 10వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశం సాపత్రాన్ని అందుకుంది. ద్వితీయ బహుమతి (రూ.7,500)ని పి.యామినీ విశాల, తృతీయ బహుమతి (రూ. 5,000)ను వి.జశ్వంతి, నాలుగో బహుమతి (రూ. 3,000)ని ఎం.సురేష్ పొందారు. ఫ్లోర్ పెయింటింగ్‌లో ఎల్.శ్వేత, పి.రచన, వి.అనురాధ, కె.హావీలా జెస్నీ, బి.రోహితలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో ఎంఎస్ వైష్ణవ్య తొలి బహుమతి అందుకోగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో రాహిల్ జయాన్, జి.భాష్యశ్రీ , లక్ష్మీ జైన్ నిలిచారు. టి.క్రిష్, జి.ఇషికా కృష్ణన్, జి.ఆధ్వి, సాక్షం సుతార్, రామిరెడ్డి జశ్వితలు ప్రోత్సాహక బహుతులు అందుకున్నారు. పోటీలకు కళానిపుణులు పి.చిదంబరేశ్వరరావు, కళాసాగర్, పి.రమేష్, సంతోష్ కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ పి.కృష్ణచైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఆయుష్ అధికారి డా. రత్నప్రియదర్శిని తదితం ులు పాల్గొన్నారు.



## కుట్రలు,కుతంత్రాలు తప్ప జగన్‌కు మరో పనిలేదు: మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం కుట్రలు కుతంత్రాలు తప్ప జగన్,ఆయన అనుచరులకు మరో పనిలేదని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు.రాష్ట్రంలో శాంతి భద్రత విఘాతం కలిగించేదిశలో వారి ఆలోచనలు సాగుతున్నాయన్నారు.రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలనే దుర్మార్గపు ఆలోచనలు వైసీపీ పార్టీవన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి కొల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ మహిళను అడ్డం పెట్టుకుని ఆ ప్రాంతంలో కుట్రకు పేర్నినాని పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారిక కారును వదిలేశామని తెలిపారు. తర్వాత ఆమె కావాలని వెనక్కి వచ్చి పోలీసులపై, తెలుగుదేశం నాయకుల గురించి అభ్యంతరకరంగా మాట్లాడారని స్థానికులే చెబుతున్నారని అన్నారు. జగన్, పేర్ని నాని లాంటి నెత్తుటి రాజకీయాలు చేసే వ్యక్తులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

## సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలి

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్ఆర్ఎస్ఎ) సికింద్రాబాద్ డివిజన్ విజయవాడ బ్రాంచ్ 6వ ద్వైవార్షిక మహాసభ విజయవాడలో జరిగింది. విజయవాడ బ్రాంచ్ అధ్యక్షులుగా అధ్యక్షులుగా కె రమేష్, కార్యదర్శిగా కె రాజేష్‌కుమార్‌తోపాటు మరో 40 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో నర్సింగరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైల్వేలతో సహా అన్ని ప్రభుత్వరంగసంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ సంస్థలకు అధిక లాభాలు గడించడానికి తోడ్పడుతోందన్నారు. ప్రస్తుతం రైల్వేలో ఖాళీగా ఉన్న 3 లక్షల పోస్టులు భర్తీ చేయకుండా, ఉన్నవారిపై పని భారం, ముఖ్యంగా లోకో రన్నింగ్‌లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. ఎఐఎల్ఆర్ఎస్ఎ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ గురుమూర్తి, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు, జివిలూ, ఎల్ఆర్ఎస్ఎ నాయకులు కె. రామకృష్ణ, ఎం వెంకటేషన్, సుధీర్ మాట్లాడారు.

# ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ మార్గదర్శకాలు

**విజయవాడ,జూలై13,ప్రభాతవార్తప్రతినిధి:** 4.2 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఉద్దేశంగా ఏపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ రూపకల్పన చేశారు.ఇప్పటికే అమలులోకి వచ్చిన ఈ పాలసీకి సంబంధించి ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యు ఫ్యాక్చరింగ్ పాలసీ 4.0,2024-29 మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని వచ్చింది. ఈ రంగంలో 10 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన పెట్టుబ డులు ఆకర్షించాలని నిర్ణయించారు.అన్ని కేట గిరీల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూని ట్లకు వందశాతం స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇచ్చారు. కల్పించిన ఉద్యోగాల ఆధారంగా ఒక్కో ఉద్యోగికి నెలకు 4 వేల నుంచి 6 వేల వరకూ ఐదేళ్ల పాటు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. అన్ని కేటగిరీల్లోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌ను రూ.1కే సరఫరా చేయాలని నిర్ణయించారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రా నిక్స్ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌ను కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైఎస్ఆర్ ఈఎంసీగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 380.5కోట్ల రూపాయలను బుధవా రం మంజూరుచేసింది. ఈ క్లస్టర్ ఏర్పాటు కోసం కేంద్ర ఐటీశాఖ ఇప్పటికే అనుమతులు మం జూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సం యుక్తంగా ఈ క్లస్టర్‌ను ఏర్పాటు చేయను న్నాయి. అలాగే కొప్పర్తిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యు ఫాక్చరింగ్ క్లస్టర్‌కు పెట్టుబడులు ఆహ్వానించేలా ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రీన్ కేటగిరీలోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తనిఖీలు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆరెంజ్, రెడ్ కేటగిరీకి ఇది వర్తించదని పరిశ్రమల శాఖ వెల్లడించింది. భూమి లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పొడిగించుకునే అవకాశం కల్పించటంతో పాటు అవసరమైతే భూమిని కొనుగోలు చేసేందుకూ వీలుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో వైపు వందశాతం స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం తెలిపింది. 20 శాతం మేర పెట్టుబడి రాయితీ కూడా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ లో ఉంటుందని స్పష్టం చేసింది. 250 కోట్లకు మించి పెట్టుబడులు పెట్టే మొబైల్ ఉత్పత్తి పరిశ్రమలకు మెగా స్టేటస్ ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలువిశాఖ, తిరుపతి , నెల్లూరు, కడప, అనంతపురంలలో ఎలక్ట్రానిక్ మాన్యు ఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఉత్పత్తికి అనువుగా ఉన్నట్టు అధికారులు స్పష్టం చేశారు. నైపుణ్యమున్న మానవ వనరులు, అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ఈ రంగంలో పెట్టుబడులకు అనుకూలమని వెల్లడించారు. ఏపీలోని లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో పాటు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉన్నట్టు తెలిపారు.

ఈ రంగంలో వచ్చే పెట్టుబడులు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను ఆకర్షించ నున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కేటగిరీల వారీగా ఈ రంగంలో పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

## హత్యాయత్నానికి ప్రయత్నించిన వారే సైకోలు: పేర్ని నాని

**విజయవాడ. జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆడవాళ్ళ మీద దాడి చేయడం అంటే సైకో పరిపాలన కాదా అని మాజీమంత్రి పేర్నినాని ప్రశ్నించారు.కృష్ణా జిల్లా గుడివాడలో టీడీపీ-వైసీపీ పోటా పోటీ సభలు పెట్టడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నానిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పేర్నినాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక మీద జరిగిన దాడిని ఖండిస్తున్నాం. వినలేని విధంగా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పల హారికను పచ్చి బూతులు తిట్టారని పేర్కొన్నారు. హారికకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు కారు దిగమని ఒత్తిడి చేశారు. కారు నుంచి కిందకు దింపి చంపేయాలి అనుకున్నారా అని ప్రశ్నించారు. గుడివాడలో పోలీసులు ఘోరంగా పని చేస్తున్నారు. పోలీసులు అంటే ధైర్యం ఇవ్వాలి కానీ చంపేయడానికి రౌడీ మూకలకు అండగా ఉంటే ఎవరికి చెప్పుకోవాలని పేర్నినాని అడిగారు. ఉప్పల హారిక మీద దాడి చేసి, గాయపర్చిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

## కోట శ్రీనివాసరావుకు రాయలసీమ రంగస్థలి నివాళి

**తిరుపతి,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** విలక్షణనటుడు కోటా శ్రీనివాసరావు మృతి తెలుగుసినీపరిశ్రమకు తీరని లోటని బిజెపి మాజీకార్యవర్గ సభ్యుడు, రాయలసీమరంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి అన్నారు. కోటా చిత్రపటానికి రాయల సీమ రంగస్థలి కార్యాలయంలో పుష్పాంజలి ఘటించారు. కోటా గతంలో బిజెపి ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు.తొలితరం సినీనాయకుల దగ్గర నుండి నేటితరం



యువనటుల వరకు అందరితో పనిచేసిన కోట శ్రీనివాసరావు తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని అన్నారు. రాయలసీమ రంగస్థలి కళాకారులు ఎన్‌రాజా, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కస్పా పద్మనాభం,చంగల్‌రాయలు, జేజిరెడ్డి నివాళులర్పించారు.

# తిరుమల సమాచారం

## రేపు కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం


### ఎల్లుండి ఆణివార ఆస్థానం, నేడు, రేపు విఐపి దర్శనాల సిఫార్సులకు బ్రేక్

**తిరుమల,జులై 13 ప్రభాతవార్తప్రతినిధి:** ఆపద మొక్కులవాడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం (ఎల్లుండి) ఆణివార ఆస్థానం జరగనుండటంతో రేపు మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు.మంగళవారం ఉదయం 6గంటల నుంచి 11గంటల వరకు పరమపవిత్రంగా, ఒక యజ్ఞంలా నిర్వహిస్తారు. ఆలయంలోపల ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహాద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూల విరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. ఏడాదిలో నాలుగుదఫాలుగా కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం చేపడతారు. ఆణివార



ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, ఉగాది ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు మంగళవారాలు ఆలయ శుద్ధి జరుగుతుంది. బుధవారం ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. మంగళవారం అష్టదళపాదపద్మారాధన సేవరద్దుచేశారు.కాగా 15వ తేదీ, 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దయ్యాయి.

## తిరుమలలో వరుస సెలవుల రద్దీ



**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో వారాంతంతో తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయానికి భక్తుల క్యూలైన్లు ఆక్టోపస్ భవనం వద్దకు చేరాయి. సాధారణ సర్వదర్శనం కోసం భక్తులు భారీగా చేరుకొంటుడటంతో వెలుపల క్యూలైన్లలోనే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.ఆదివారం ఉదయానికి భక్తులతో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఉదయం 5గంటలకు వైకుంఠం-1,2లో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నిండాయి. సర్వదర్శనానికి భక్తులు 24గంటలు నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి మరింతగా భక్తుల రద్దీ పెరగడంతో 26,27గంటలు పట్టేసమయం మారింది. తిరుమల క్యూలైన్లలో ఉన్న భక్తులకు వైకుంఠం కంపార్టుమెంట్లలోని భక్తులకు శ్రీవారిసేవకులు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ,మజ్జిగ ,పాలు ,తాగునీరు పంపిణీచేస్తున్నారు. ఆలయంలో త్వరగా క్యూలైన్లు కదిలేలా టిటిడి అడిషనల్ ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రంవరకు 50వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.



మఠంలో చాతుర్మాసదీక్షపూజలు చేస్తున్న జీయంగార్లు, ఆలయంలోనికి ఆహ్వానం

## శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస్య దీక్ష

**తిరుమల,జులై 13పభాతవార్తప్రతినిధి:** వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందని టిటిడి పెద్దజీయంగార్లు తెలిపారు. ఆషాడ శుద్ధ ఏకాదశిన శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారన్నారు. చాతుర్మాస్యదీక్షలో భాగంగా ఆదివారం ఉదయం తిరుమలలోని పెద్దజీయర్‌స్వామి మఠంలో కలశస్థాపన, కలశపూజ, విశ్వక్సే నారాధన, మేధినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత పుట్టమన్ను సేకరించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అక్కడ నుండి పెద్దజీయర్‌స్వామి మఠం వద్దనుండి చిన్నజీయంగారు,శిష్యబృందంతో కలసి మంగళ వాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామి బాలాలయాన్ని సందర్శించారు. అక్కడనుండి దేవదేవుని ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు దంపతులు,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్‌కు మేల్‌ఛాట్‌వస్త్రాన్ని,చిన్నజీయర్‌కు నూలువస్త్రాన్ని బహుకరించారు. అనంతరం టిటిడి ఛైర్మన్, ఇఒ,అదనపు ఇఒలను జీయంగార్లు శాలువతో సన్మానించారు. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ ,కార్తీక పవిత్ర మాసాలలో ఆచార్య పురుషులు స్నాన,జప,హోమ,వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, జీయంగార్లు పాల్గొన్నారు.

## స్వామి ఆశీస్సులతో శుభాలు కలగాలి: మంత్రి గొట్టిపాటి

**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని దేవుని ప్రార్ధించినట్లు రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం అనుచరులు,కుటుంబంతో కలసి తిరుమలకు చేరుకున్నారు.ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకు న్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరుమల,జూలై13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఏవి శేషాద్రి దంపతులు, హైకోర్టు రిజిస్ట్రార్ జస్టిస్ కమలాకర్‌రెడ్డి కటుంబం,గుజరాత్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఎస్ఎన్ సంజయ్‌గౌడ, జ్యోతిషపండితుడు మాచిరాజు వేణుగోపాల్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేదపం డితులు వేదాశీర్వచనంచేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు సకల సౌకర్యాలతో పిఎసి-5

### చివరిదశ పనులు తనిఖీచేసిన టిటిడి ఇఒ,అదనపు ఇఒ

**తిరుమల,జూలై 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రెట్టింపవుతున్న సమయంలో వసతి సదుపాయం కల్పించే విషయంలో యాత్రికుల వసతి సముదాయం(పిఎసి-5) నిర్మాణపనులను మరింత వేగంగా పూర్తిచేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. పిఎసి 5 వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఈ పనులు చివరిదశలో ఉండటంతో వాటన్నిటినీ ఇఒ,అదనపు ఇఒ పరిశీలించారు. భక్తులకు మరింత సులభంగా వసతి కల్పించేందుకు పిఎసి5 అందుబాటులోకి రానుంది. దార్మి



టరీలు, లాకర్లు, అన్నప్రసాదం డైనింగ్ హాళ్ళు, టాయిలెట్లు,డిస్పెన్సరీ, పెద్దకళ్యాణకట్ట,వేడినీళ్ళ సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు.

వార్త

తమ పూర్వీకులందరూ సాధించిన ఘన విజయాలను గురించి గర్వపడని వారు, ముందు తరాల వారు తమని గుర్తించగల ఏ కార్యాన్నీ సాధించలేరు.

-మెకాలే

# ప్రపంచశాంతికి పరిష్కారం ఉందా?

**ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడి గానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచర ణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టిం చరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లి స్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవి స్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్త వ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే.**



రావులపాటి సీతారాం రావు

ప్రపంచ రాజకీయ రంగంలో నైతికత కొరవడిందా? ఆ విషయాన్ని హెచ్చరించడానికి నైతిక నాయకత్వ పటిమ కలిగినవారే కరువయ్యారా? ప్రపంచంలోని దేశ నాయకులు అందరూ క్షణకాలం తమ తమ బరువు బాధ్యతలను పక్కన పెట్టాల్సిన అవసరం లేకుండానే, నెమరువేసుకోవాల్సిన అత్యంత ప్రాముఖ్యత కలిగిన విషయాన్ని ఎందుకు దాటేస్తున్నారు? భారతదేశం మాటకొస్తే మన నాయకులు ముఖ్యంగా అధికారంలో ఉన్న వారు, తమ దేశానికి వున్న నేపథ్యంలో తప్పక గాఢంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందన్న మాట విజ్ఞులు గమనంలోకి తీసుకోక తప్పటం లేదు. మహాత్మాగాంధీ దేశ స్వాతంత్య్రానికి పునాదులు వేసినప్పుడు కూడా బ్రిటిష్ ప్రభుత్వం పట్ల మాట మీరలేదు! హక్కుల కోసం పోరాడుతూ సత్యాగ్రహం చేసారు కానీ, ఆగ్రహంతో దూషణ పద జాలాన్ని కూడా వాడలేదు! ఎవరైనా హద్దులు మీరినప్పుడు నైతికంగా నాయకత్వం వహిస్తూ పరిధులు దాటనివ్వలేదు. జవహార్‌లాల్‌నెహ్రూ, వల్లభాయ్ పటేల్ లాంటి వారు బ్రిటిష్ వారు పాలన వదులుకొని స్వాతంత్య్రం ఇచ్చి వెళ్లిన తర్వాత ప్రభుత్వంలో ఉన్నవాళ్లు,ప్రపంచానికి నైతిక నాయకత్వాన్ని ఇవ్వగలిగారు. అలీన విధానంతో ఏది మంచో ఏది చెడో స్పష్టంగా చెప్పగలిగారు. కాశ్మీర్ విషయంలో దేశానికి కొంత ఇబ్బంది కలిగినా పాకిస్థాన్‌ను సాటివారిగానే చూశారు కానీ పదిమందిలో ఆదేశ పరువును తీయలేదు. అంతటి మహోన్నత వారసత్వానికి ప్రతినిధిగా ఉన్న భారత్ ఇప్పుడున్న సంకట పరిస్థితులలో నైతిక నాయకత్వం వహిస్తూ మార్గదర్శకత్వం వహించాల్సిన అవసరం ఏర్పడిందేమో అన్న విషయాన్ని ఆలోచించటం బాధ్యత అని అనుకోవటంలో తప్పులేదేమో! భారతదేశం ఆర్థికంగా అగ్రగాముల్లో ఒకటిగా ఎదిగింది. అణు సంపద కలిగిన దేశంగా గుర్తింపబడుతున్నది. జన సంపదలో అంటే జనాభా విషయంలో అగ్రస్థానంలో ఉన్నది. దక్షిణ ఆసియా దేశాల్లో ప్రముఖ దేశంగా ప్రవర్తిల్లుతున్నది. ఇండియన్ సబ్‌కాంటినెంట్‌గా కూడా వర్థిల్లుతున్నది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలను దారి తప్పనివ్వకుండా చూసే కనీస బాధ్యతను భుజాల మీద ఎత్తుకోలేదా? భారత్ కాకపోతే మరే దేశం ఆ బరువును ప్రపంచ శ్రేయస్సు దృష్ట్యా మోయాలి? ఆలోచించాల్సిన విషయంగా విజ్ఞులు దౌత్య నిపుణులు, అంతర్జాతీయంగా ప్రముఖంగా ఆలోచించగల నేర్పరులు, దృష్టి పెట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందేమో? భారత్ స్నేహదేశాలను వదులుకోకుండానే నేర్పుగా ప్రముఖ దేశాలలో విస్తరిల్లుతున్న మితిమీరిన అనైతికతనూ, బాధ్యతారాహిత్యాన్ని కట్టడి చేయడానికి సాహించటం తప్పేమీలేదేమో? స్పష్టంగా ఆలోచనా పరిధిని పెంచుకుంటే ప్రస్తుత పరిస్థితులలో అమెరికా అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్, ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక కాబడి, నియంతృత్వ ధోరణిలో ప్రపంచాన్నంతటినీ



శాసించే ప్రయత్నానికి పూనుకున్నారు. దానిని నిలువరించటానికి కొన్ని దేశాలు యుద్ధపరంగా కాకుండా, నైతిక పరివర్తనను తెచ్చే విధంగా కొంతలో కొంత బాధ్యత తీసుకోవాల్సిన అవసరం, ప్రపంచశాంతి దృష్ట్యా ఏర్పడిందని ఒప్పుకోకతప్పదు. గ్లోబల్ సంఘర్షణలు పెరుగుతూ ప్రజాస్వామ్యం సన్నగిల్లుతున్న ఈ తరుణంలో రాజకీయ నాయకత్వం ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఏర్పడింది. ప్రపంచ దేశాల నాయకులు వారి ఖ్యాతిని అనైతికంగానైనా సరే పెంచుకోటానికి శృతి మించి వ్యవహరిస్తున్నారు. అగ్ర దేశాలుగా ప్రపంచ శాంతిని దెబ్బతీస్తూ హిట్లర్, ముస్సోలినీలను జ్ఞప్తికి తెచ్చే విధంగా యుద్ధ ప్రణాళికలను స్వలాభం కోసం ముందుకు తేవడం అత్యంత హేయంగా కొన్ని దేశాలైనా భావించకతప్పదు. పహల్గాం సంఘటనను యు.యన్ సెక్యూరిటీ కౌన్సిల్ ఎందుకు ఖండించలేకపోతున్నది? పాకిస్థాన్ నైతిక బాధ్యతను చైనా తప్పుడు మార్గాన్ని ఎందుకు తప్పుపట్టలేకపోతున్నది. బంగ్లాదేశ్‌లోని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్న సంగతిని అగ్రదేశాలు ఎందుకు గుర్తించలేకపోతున్నాయి. తగు చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నాయి. రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య గొడవలనుఅమెరికా కేవలం గనుల సంపాదన కోసం కాకుండా న్యాయపరిధిలో తప్పుచేసిన వారిని మాటవరసకైనా ఎందుకు హెచ్చరించలేకపోతున్నది? ట్రంప్ హెచ్చరికలు విలువలేని మాటలుగా ప్రపంచ దేశాలు రాజకీయంగా తీసిపారేసే స్థితి దాపురించటం ఎంత విషాదకరం? అధినాయకత్వం కోసం డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చుతగ్గుల విధానాన్ని పావుగా వాడటం ఇంతకుమునుపు ప్రజాస్వామ్యం పాటించే ఏ దేశమైనా, ఏ రాజకీయ నాయకుడైనా పాటించడం జరిగిందా? ఉక్రెయిన్, గాజా, ఇజ్రాయిల్, ఇరాన్ సంఘర్షణలు పెచ్చరిల్లటానికి కారణం ప్రపంచ దేశాలలోని మానవత్వం కనుమరుగు కావటంవల్లనే అన్న కనీస నైతికాలోచన ప్రపంచ దేశాల నాయకులుగా చెప్పుకొనేవారు ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రపంచ చరిత్రను అవలోకనం చేసుకొని కొన్ని పాఠాలు నేర్చుకొని తదనుగుణంగా ఆచరించే చర్యలను కొందరు రాజకీయ నాయకులైనా తలపెట్టకతప్పదు. అంతర్జాతీయ న్యాయపరిధిలోనే, సమిష్టి ఆలోచనలతో ఈ సమస్యలకు పరిష్కారం కనుక్కోవటానికి కొందరు అగ్రదేశాల నాయకులైనా ముందుకు రాకతప్పదు. ప్రజాస్వామ్యాన్ని గట్టిగా ఆచరించే ఏదేశ నాయకుడైనా నమ్మిన సిద్ధాంతం కోసం మొదట్లో ఒక్కడి గానే నడవాల్సిన పరిస్థితిని అవగాహన చేసుకొని ఆచరణలో దిగకతప్పదు. అలాంటి నాయకత్వం ఇతరులలో ఇతర దేశాలలో స్ఫూర్తిని కలుగచేస్తుందన్న నగ్నసత్యాన్ని చరిత్ర చెబుతున్నది. కారల్‌మార్క్స్ చెప్పినట్లు నాయకత్వం 'వాక్యూమ్'లో ఏర్పడదు. నాయకులు మనుషులుగానే చరిత్రను సృష్టిస్తారు. అయితే వారిష్టంవొచ్చినట్లు సృష్టించరు. పూర్వాపరాలు పరిగణనలోకి తీసుకొని నాయకులను తయారు చేస్తూ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారాలు కనుక్కొంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఏ దేశం ఇందుకు అనుగుణంగా మూడవ ప్రపంచయుద్ధం అంచుల్లో ఉన్న మానవత్వాన్ని రక్షిస్తూ ప్రపంచాన్ని శాంతిమార్గానికి మళ్లిస్తుందో అలాంటి రాజకీయ నాయకులు ఏవిధంగా ఉద్భవిస్తారో చెప్పటం నడుస్తున్న చరిత్రకే సాధ్యం.తక్షణ కర్త వ్యం ప్రపంచ శాంతికి పునరుద్ధరణ ప్రయత్నాలు చేయటమే. •

# యుక్తాయుక్త విచక్షణే సత్తా!

ఒంట్లో సత్తువ, జవసత్వాలు ఉడిగి ఆలోచనానుభవాలు పుష్కలంగా ఉంటే వయసుతో పనేముంది అనే ధోరణి ఇప్పుడున్న పెద్దతరానిది. సామాజికంగా ఇలాంటి కారణాలను పెద్దపీటవేసినా, రాజకీయంగా చూస్తే 75 యేళ్ళొచ్చినవారిని రాజకీయాలు వదిలేసినా వదిలేయకపోయినా తమ వారసులకు పోటీవ్వాలనే ఉద్దేశ్యం ఒకటి బలంగా వెల్లువెత్తుతుంటోంది. అందుకేనేమో ఎన్టీఆర్ పిలుపుతో 1983లో అనుకోకుండా 'సేవాదృక్పథంతో' రాజకీయాల్లోకి వచ్చి 7.8 సార్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారు, రాజకీయ పదవులు అనుభవించిన వారు సైతం దీపమందగానే ఇల్లుచక్కదిద్దుకోవాలన్న యోచనతో 2019,2024 ఎన్నికల్లో తమ వారసులకు రంగ ప్రవేశం చేయించారు. యువతకు పట్టం కట్టాలనే ధోరణితో తమ కుటుంబ వారసుల్నే రాజకీయ వారసులుగా నిలబెట్టి కనీసం సగంమంది రిటైరయ్యారు. ఇందులో వారి స్వార్థం లేదని చెప్పలేం. కొంత మందికి మదిమి మీద కొర్చిన ప్రజాదరణను బట్టి రాజకీయ పదవుల్లో కొనసాగుతున్నారు. వారికొన్ని వోట్ల వృద్ధతర అధికారం చెలాయిస్తే వారి వారసులు సమాంతరంగా రాజకీయాల్లో ఓనమాలు దిద్దుకుంటున్నారు. ఏమైతేనేమి యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో భాగస్వాములు కావడం స్వాగతించదగినదే. కాగా రాజకీయాల్లో ఎంతకాలం ఉండాలనే దానిపై వయసు అడ్డురాదన్నది చరిత్ర చెబుతోంది. అదే ఇన్నాళ్లు చూస్తున్నాము. కుటుంబ వ్యవహారాల్లో సాధారణంగా పిల్లలు పెరిగి పెద్దవాళ్లై యోగ్యులుగా ఉన్నప్పుడే కుటుంబ వ్యవహారాల్లో నుంచి రిటైర్డ్ బాధ్యతలను వాటిక్కప్పగించడం మనం చూస్తూనే ఉన్నాం. రాజకీయాల్లో వయో అర్హత గురించి పెద్దగా పట్టింపు లేమీ లేవు. కానీ తాజాగా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ నాగపూర్‌లో జరిగిన ఓ సామాజిక కార్యక్రమంలో 75 యేళ్లు అయ్యాక రాజకీయాలను వదిలిపెట్టాల్సిన ఆవశ్యకతను ప్రతిపాదించారు. ఆయన భారతీయజనతా పార్టీని వెనకుండి నడిపించే ఆర్. ఎస్. ఎస్ అధినేత కనుక ఆయన మాట ఇప్పుడు చెల్లుబాటయ్యే పరిస్థితి కనబడుతోంది. ఆయనకెలాగో త్వరలో 75 ఏళ్లు నిండుతోంది. కనుక తన రిటైర్మెంట్ గురించే మాట్లాడారా! లేక బీజేపీకి చెందిన భారత ప్రధాని నరేంద్రమోదీని ఉద్దేశించి మాట్లాడారా? తెలియక బీజేపి తలపట్టుకు కూర్చొంది. అంటే భారతీయ జనతాపార్టీలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే లేవనెత్తాయి. అవే ఆర్ఎస్ఎస్ నిర్దేశకత్వం అయితే నరేంద్రమోడీ సెప్టెంబరు నెలలో రాజకీయాల నుంచి తప్పుకోవాల్సి ఉంటుందనే సంకేతాలు పంపినట్లుగానే భావించాలి. ప్రస్తుత భారత రాజకీయాల్లో కానీ, పాలక వర్గంలో కానీ, నరేంద్రమోడీకి మించిన చరిస్మా ఉన్న నాయకులెవరూ లేరు. అయితే భారతీయ జనతా పార్టీ రాజ్యాంగంలో పదవి విరమణ వయోపరిమితి నిబంధన ఏదీ లేనందున 2029వరకు నరేంద్రమోడీయే ప్రధానిగా కొనసాగుతారని కార్యకర్తలు ఘంటాపథంగా చెబుతున్నారు. అయినా ఏదో ఒక ప్రయత్నం చావలేదని నిరూపించ జరిగే తీరుతుంది. ప్రస్తుత వ్యాఖ్యలు ఎంత దూరం తీసుకెళ్తాయో తెలియదుకానీ రాజకీయాలను ఒక్క కుదుపు కుదుపుతాయి. ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ రంగంలో 75 ఏళ్ళు దాటిన తర్వాత కూడా ఎన్నికైనవారు లేదా నియమిత పదవుల్లో కొనసాగడం సర్వసాధారణం. ఏ రాజకీయ పార్టీలోనూ, పదవులు నిర్వహించే విషయంలో గరిష్ట వయో పరిమితి అంటూ ఏమీలేదు. ప్రపంచ వ్యాప్త, రాజకీయధోరణుల్లో వృద్ధనేతలకు మినహాయింపు లభించిన సందర్భాలు లేవు. వారికి సుదీర్ఘ అనుభవం, ప్రజల్లో ఆదరణ ఉన్న రీత్యా వారిని పక్కకు తప్పించలేని పరిస్థితి. వృద్ధాప్యంలోనూ వారు మరుపైన నాయకత్వ పటిమను కనబరిచారు. జాతీయస్థాయిలో ఎన్సీపీ నాయకత్వం వహిస్తున్న శరద్‌పవర్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా పార్టీని విజయపథంలో నడిపి రెండు టర్మ్‌లు పార్టీని అధికారంలోకి తెచ్చిన సోనియాగాంధీ, కేంద్ర మంత్రిగా పనిచేసిన ఎం.వి రాజశేఖరమూర్తి వంటివారు ఎందరో జాతీయ రాజకీయాల్ని ప్రభావితం చేసినవారే. ప్రాశ్చాత్య దేశాల్లోనూ రాజకీయాలకు వయసుతో పని లేకుండాపోయింది. నిన్నగాక మొన్న అమెరికాను ఏలిన జోబైడెన్ 80వ ఏటవరకు పదవిలోనే ఉన్నారు.అమెరికా సామ్రాజ్యవిస్తరణ మంచి నిర్ణయాలు తీసుకున్నారనే పేరుంది. ప్రపంచంలో అత్యధిక వయస్సులో పదవిలో ఉన్నవాయకుడిగా రికార్డు సృష్టించిన మలేషియా ప్రధాని 80 యేళ్ల వయసులో తొలిసారి ప్రధాని అయ్యారు.మరోసారి కూడా ఆయన పదవిని దక్కించుకున్నారు. ఇలాంటి సందర్భాలను బట్టి పరిపాలనా సత్తా, ప్రజాదరణ ఘనంతతాలను ఎవరైనా పదవిలో కొనసాగవచ్చుననే దృష్టాంతాలు చరిత్రలో కనపడుతున్నాయి. కాగా దేశ కాలమాన పరిస్థితులకు తోడుగా యువతరాన్ని ఆకాంక్షలకు వీలుగా వృద్ధ రాజకీయ నాయకులు 75 తొలగి యువతకు తోవివ్వాలనే తలంపులను ఎవరైనా ఓటెయ్యాల్సిందే. ఇప్పుడ ఆలోచనలు రాజకీయ నేతల మెదళ్లను తొలచివేస్తున్న ఆహ్వానించాల్సిందే. రాజకీయ వైకుంఠపాళిలో చిన్న వయసులో రాజకీయాల్లోకి వచ్చిన యువత సైతం పరిపాలనానుభవం కలిగిన సీనియర్ల దగ్గర పని చేయడంవల్ల వారిలో రాజకీయకాంక్షతోపాటు రాజ్యకాంక్ష కూడా ఇనుమడిస్తుంది. ఇందువల్ల ప్రజాపాలన సౌభాగ్యక రంగా, అభివృద్ధి పథంలో నడిపించే అనుభవం సాధించగలుగుతారు.తాజాగా సీనియర్ రాజకీయ నేతలే యువతను రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నారు. దేశ సంక్షేమానికి శుభప్రదం కాగలదు.

జీవితంలో ప్రతి నిముషాన్నీ వ్యర్థం చేయక ఉపయోగించుకో. లేకుంటే నీవు వృథా చేసిన కాలం నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

ఒక పనిని ఎందుకు తప్పుగా చేశారో తెలియచేయడానికి పట్టే కాలం కంటే ఆ పనిని తిరిగి సరిగ్గా చేయడానికి తక్కువ సమయం పడుతుంది.



లాంగ్‌ఫెలో

# ప్రజావాక్కు



### ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గత నెలరోజులుగా అనేక బోధనేతర పనులతో ఒత్తిడికి గురవుతున్నారు.యోగాంధ్ర కార్యక్రమం, విద్యాకిట్ల పంపిణీ, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ తదితర పనులలో నిమగ్నం కావడంతో బోధనకుకుంటుపడుతున్నది. ప్రస్తుతం ఉపాధ్యాయులు విద్యార్థులకు ఇవ్వబడిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లవివరాలను యాప్‌లో పొందుపరిచి విద్యార్థులు లేదా వారితల్లిదండ్రులచే బయోమెట్రిక్ వేయవలసిందిగా విద్యాశాఖ సూచిస్తోంది. కానీ పాఠశాలలో బయోమెట్రిక్ డివైస్ లేకపోవడం వాటి వినియోగం గురించి ఎటువంటి అవగాహనఉపాధ్యాయులకు లేకపోవడంతో మరింత ఆలస్యం అయ్యే అవకాశంఉంది. ఉపాధ్యాయులకు ఈ బోధనేతర పనులు వద్దని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఆధిపత్య ధోరణి వీలుపడదు

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంలో ఆధిపత్య కోణం ఉందనేది కాదనలేని వాస్తవం. ఐతే ఇరాన్‌ను న్యూక్లియర్ బాంబ్ తయారు చేయకుండా ఆపాలి అని అమెరికా నాయకత్వం మార్పుచేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకోవ్వాని ఇజ్రాయెల్ ప్రయత్నించి విఫలం అయింది. ఇప్పుడు కనపడుతున్న వాస్తవం ఏమిటి ఇరాన్ తన న్యూక్లియర్ ప్రయోగాన్ని ఆపలేదు సరికదా అది అలాగే కొనసాగిస్తోంది అంటే ఆధిపత్యధోరణి ఇక ఎంతమాత్రం వీలు పడదు అనే కదా అర్థం. ఇక అమెరికా ఒక విఫల నాయకత్వం అయ్యాక చైనా ఆ స్థానం ఆక్రమించాలి అని చూసినా అది సాధ్యపడలేదు.అసలు ఎందుకు ఈరావణ కాష్టం అంటే అమెరికా ఆయు ధాలను అమ్ముకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### నూతన విద్యాసంస్కరణలు అవసరం

ప్రతి విద్యాసంస్థలలో ప్రార్థన సమయంలో ఒక లెక్చరర్, ఒక టీచర్ రోజురోజుకు ఒక అంశంపై అవగాహన కల్పించాలి. జనరల్ నాలెడ్జ్ క్విజ్ ముఖ్య విషయం చెప్పాలి. విద్యార్థులవిద్యాభివృద్ధికి విజ్ఞానంఅభివృద్ధి చెందుతుంది. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తరఫున అమలుచేయాలి. నూతన విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలి.

- రాపాక రవీందర్, జనగాం

### భద్రత కల్పించాలి

నేడు మన దేశంలో మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో ఇళ్లను, పేదలకు ఉచితంగా ఇళ్లను అందించాల్సిన అవసరం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం 100కుటుంబాలకు సురక్షిత నివాసం కల్పించడంలో ముందడుగు వేయాలి. ప్రస్తుతం మధ్యతరగతి ప్రజలు తమ ఆదాయానికి అనుగుణంగా ఇళ్లను కొనుగోలు చేయడం చాలా కష్టంగా మారింది.రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతుండటంతో, తక్కువ వడ్డీ రుణాలు, సబ్సిడీలు, ప్రభుత్వ భూములపై అపార్ట్‌మెంట్లు నిర్మించడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ప్రత్యేకంగా మధ్యతరగతి ప్రజల కోసం సబ్సిడీ హౌసింగ్‌స్కీమ్‌లు ప్రవేశపెట్టాలి.ఇక బడుగు, బలహీన వర్గాలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత, భద్రత కల్పించవచ్చు.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### అవినీతి రాజకీయాలు

రాజకీయం అంటే ఒక పవిత్ర వ్యాసాగం. కానీ నేడు రాజకీయం అంటే ఛీ అనే కాడికి వచ్చింది.నేడు రాజకీయం ప్రక్షాళన చేయాలంటే ఉన్నత విద్యావంతులైన యువతకే సాధ్యం! ముఖ్యంగా నేటి రాజకీయాలలో నీతి, నైతిక విలువలు అనేవి పూర్తిగా అడుగంటిపోయాయి. ఒకవేళ చదువుకున్న యువతకు నేటి రాజకీయాలలో అవకాశం వస్తున్న అది బహు స్వల్పమే అంటే నూటికి కేవలం30శాతం మాత్రమే.అదేమీ దురదృష్టమో గాని ఎక్కువగా నేటిదేశ, రాష్ట్ర రాజకీయాలను అవినీతి మకిలి అంటినవారు, దౌర్జన్యకారులు, ప్రజల ఆస్తులను కొల్లగొట్టే దుర్మార్గపు వ్యవహార్శైలి వున్నవారే శాసిస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత బాధాకరమైన,ఆందోళన కలిగించే విషయం.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### భయాన్ని పోగొట్టాలి

ఈ మధ్య కాలంలోజాతీయ, అంతర్జాతీయంగా విమాన ప్రమాదాలుభయాన్ని, ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నవి. యాంత్రిక, సాంకేతిక వ్యవస్థ ఎంత గొప్పగా ఉన్నప్పటికీ సిబ్బందిలో ఏ వ్యక్తి అయినా వారి తనిఖీ అనివార్యం. కేవలం ఉన్నత సాంకేతికత ఒక్కటే ప్రమాదాలను ఆపలేదు. ప్రతి చిన్న విషయం కాస్త నిర్లక్ష్యం లేకపొరపాటు జరిగితే కోట్ల ధనం, ప్రాణాలు, పోతాయి. నడిపే పైలెట్ మన ప్రాణాలకు అత్యవసర వైద్యుడు.

-బొల్లోజు మేఘనాధం, విశాఖపట్నం

# రైతులకు శాపంగా మారుతున్న నకిలీ విత్తనాలు

జి. అజయ్ కుమార్

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకుంటూ, నాణ్యమైన విత్తనాల కోసం ఫెర్టిలైజర్ షాపులు, విత్తన విక్రయ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. కానీ రైతులు నమ్మి కొనుగోలు చేస్తున్న విత్తనాలన్నీ నాణ్యమైనవేనా? వ్యవసాయంలో విత్తనం పాత్ర అమూల్యమైనది. ఒక రైతు వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే, మొదటి మెట్టు నాణ్యమైన విత్తనం ఎంపికే. విత్తన నాణ్యతపైనే పంట దిగుబడి, రైతు ఆదాయం అన్నీ ఆధారపడతాయి. కానీ ఇటీవల కాలంలో నకిలీ విత్తనాల మాఫియా వ్యవసాయాన్ని భూతంగా మింగేస్తోంది. కొందరు వ్యాపార లాభాల కోసం రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట, వరంగల్, షాద్‌నగర్, ఆత్మకూర్‌లలో వ్యవసాయ అధికారులు, పోలీసులు జరిపిన సోదాల్లో లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు దొరికాయి, ప్రతి సంవత్సర ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఎటువంటి ప్రమాణాలు లేకుండా సరఫరా అవుతున్న ఈ విత్తనాలు నాటిన తర్వాత మొలకే రావడం లేదు.మొలక వచ్చినా సరైన దిగుబడి రావడం లేదు.చివరికి రైతులకు దిగుబడి నష్టం,అప్పులభారంతోపాటు మానసిక ఆందోళనతో చివరికి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నాడు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఈ నకిలీ దందా యధాతథంగా కొనసాగుతూనే ఉంది. నకిలీ విత్తనం అనగా నిజమైన రకం కాని విత్తనం, లేదా ఉద్దేశించిన విత్తన రకానికి సరిపోలని విత్తనం, లేదా ధ్రువీకరణ పొందని విత్తనం. ఇవి సాధారణంగా ప్రభుత్వం గుర్తించిన విత్తన ధ్రువీకరణ సంస్థల ధ్రువీకరణ లేకుండా ఉత్పత్తి చేయబడతాయి. నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించవచ్చు ఒకటి పంట వేయకముందు రెండోది పంట వేసిన తర్వాత. ఒకవేళ పంటవేయకముందు రైతు నకిలీ విత్తనాలను గుర్తించి అవగాహన కలిగి ఉన్నట్లయితే ఆర్థికంగా నష్టపోకుండా ఉండవచ్చు. అదేవిధంగా పంట వేసిన తర్వాత గుర్తిస్తే ఆర్థికంగా అధికంగా నష్టపోవాల్సి ఉంటుంది. కాబట్టి రైతులు విత్తనం వేసే ముందే ఈ విత్తనాలు నకిలీవా లేదా నిజమైన విత్తనాల అని తేడా




లు గుర్తించి పరీక్షించుకొని విత్తనం నాటు కోవాలి. వ్యవసాయ ఉత్పత్తిలో విత్తనాల పాత్ర ఎంతో కీలకం. కానీ మార్కెట్లో నకిలీ విత్తనాల చెలామణి రైతుల నమ్మకాన్ని నాశనం చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి రైతు తన భూమిలో విత్తనం వేయక ముందు కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలించడం అవసరం.అనుమతులు కలిగిన డీలర్ల నుంచే విత్తనాలు కొనండి, ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన లేదా లైసెన్స్ కలిగిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి. ధృవీకరించబడిన కంపెనీల విత్తనాలకే మొగ్గు చూపాలి. విత్తన ధృవీకరణ సంస్థల నుండి లైసెన్సు పొందిన కంపెనీల విత్తనాలనే కొనాలి. ప్యాకెట్‌పై "హోలోగ్రామ్" ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. మొత్తం పెట్టుబడి ఆదా చేస్తుందని తక్కువ ధరలో అమ్మే ముఠాలను నమ్మి మోసపోవద్దు. సాధారణంగా నకిలీ విత్తనాలు చాలా తక్కువ ధరకే అమ్ముతారు. విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తీసుకోవాలి. సమస్య ఏర్పడితే ఇది న్యాయంగా నిదర్శనంగా ఉపయోగపడుతుంది.ప్యాకెట్ వెనక ట్యాగ్ లేదా స్టిక్కర్‌ను చూసి గుర్తించాలి. ప్రైవేట్ కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో ఉండే పచ్చ రంగు ట్యాగ్ (ట్రూత్ ఫుల్ లేబుల్డ్ ) లేదా నీలిట్యాగ్ (సర్టిఫైడ్ సీడ్) ఆధారంగా విత్తనాన్ని గుర్తించాలి. మిరప, ప్రత్తి విత్తనాలపై ముఖ్యంగా పచ్చట్యాగ్ ఉండేలా చూస్తారు. ట్యాగ్‌పై లైసెన్స్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్ వుంటేనే నమ్మకం విత్తన ట్యాగ్ పై కంపెనీ లైసెన్స్ నెంబర్, లాట్ నెంబర్, క్యూ ర్ కోడ్, ప్యాకింగ్ తేదీ మరియు చెల్లుబాటు గల తేదీలు ముద్రించబడి ఉండాలి. ఇవి లేనివాటిని కొనొద్దు. మొలక శాతం, జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక చూడాలి.ప్రతి విత్తన సంచిలో మొలక శాతం 80 కంటే ఎక్కువ, జన్యు శాతం 98 కంటే ఎక్కువ, ఇతర పదార్థాలు 2 కన్నా తక్కువగా ఉండాలి. ప్యాకెట్‌పై ఇవి ముద్రించి ఉండాలి. బీటీ విత్తనాల గుర్తింపు – జి ఈ ఏ సి నంబర్ తప్పనిసరి. ప్రత్తి విత్తనాల విషయంలో జి ఈ ఏసి (జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైసల్ కమిటీ) ద్వారా మంజూరైన నంబర్ ఉన్న విత్తనాలకే మొగ్గు చూపాలి. ఇది బీటీ విత్తనం అని గుర్తించేందుకు ప్రధాన ఆధారం. ఈ సూచనలు పాటిస్తే రైతులు నకిలీ విత్తనాల వలలో పడకుండా, నమ్మకమైన విత్తనాలతో మంచి దిగుబడులు సాధించవచ్చు. ఎప్పుడూ మోసపోతే ముద్రా పత్రాలద్వారాన్యాయపరంగా ఫిర్యాదు చేయడాన్ని రైతులు మర్చిపోకూడదు. •

# దేశాన్ని మింగుతున్న మానవ విపత్తు 'మత్తు'

రామ కిష్టయ్య సంగన భట్ల

గంజాయి అనే మత్తు పదార్థం ఈ కాలంలో దేశాన్ని మానవీయ విపత్తుగా ముప్పతిప్పలు పెడుతోంది. గ్రామీణం గానీ, పట్టణం గానీ, పాఠశాలలైనా, కళాశాలలైనా, యువతీ యువకులైనా తేడా లేకుండా ఈ మత్తు మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఇది కేవలం ఒక మానసిక వ్యసనం కాదు. శారీరక ఆరోగ్యాన్ని, కుటుంబ పరిమితిని, సామాజిక సమతుల్యతను, ఆర్థిక స్థిరత్వాన్ని నాశనం చేసే భయంకరమైన వ్యాధిగా రూపుదిద్దుకుంది. గంజాయి అనేది గంజి మొక్క నుండి వచ్చే మత్తు పదార్థం. దీనిలో ప్రధానంగా ఉండే క్రియాశీల పదార్థం టెట్రా హైడ్రో. కానబినాల్, ఇది మెదడులోని స్వభావాన్ని ప్రభావితం చేస్తూ తాత్కాలిక ఆనందానుభూతిని కలిగించగలదు. అయితే దీర్ఘ కాల వాడకం వల్ల మానసిక అస్థిరత, భ్రమలు, నిస్పృహ, బహుళ వ్యక్తిత్వ లక్షణాలు, ఆందోళన, విపరీత భావోద్వేగాలు తలెత్తుతాయి. ఆరోగ్యపరంగా ఊపిరితిత్తుల సమస్యలు, గుండె వేగం పెరగడం, జీర్ణక్రియ మందగించడం వంటి శారీరక దుష్ప్రభావాలు కలుగుతాయి. 2021లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ రూపొందించిన డ్రగ్ వినియోగంపై జాతీయ సర్వే ప్రకారం దేశంలో సుమారు 3.1 కోట్ల మంది కనీసం ఒక్కసారి గంజాయి వాడినట్లు తేలింది. ఇందులో దాదాపు 70 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారిన వారే. పట్టణాల్లో మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా గంజాయి వినియోగం వేగంగా పెరుగుతోంది. ముఖ్యంగా 15 నుండి 35ఏళ్ల మధ్య వయస్సు కల యువత దీనికి బలవుతున్నారు. గంజాయి వినియోగానికి ప్రధాన కారణాలలో ఒకటి – సులభ లభ్యత. దేశంలోని ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్‌ల ఏజెన్సీ ప్రాంతాలలో విస్తృతంగా సాగవుతోంది. అక్కడి నుండి ఇది దేశవ్యాప్తంగా అక్రమంగా రవాణా అవుతోంది. ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కళాశాలలు, పబ్‌లు, పార్టీలు గంజాయి విక్రయాలకు కేంద్రాలుగా మారిపోయాయి. యువతలో స్నేహితుల ఒత్తిడి, సరదా ప్రయోగం అనే పేరుతో మొదలై, వ్యసనంగా మారుతోంది. నిరుద్యోగం, కుటుంబ కలహాలు, ప్రేమ విఫలాలు వంటి మానసిక ఒత్తిళ్లు కూడా గంజాయి వైపు నెట్టేస్తున్నాయి. అంతేకాదు గంజాయి హానికరం కాదు, ఇది ఆయుర్వేద మందు" అనే తప్పుడు ప్రచారాలు కూడా యువతను ఈ మత్తులోకి తొక్కిస్తున్నారు. ఈ మత్తు పదార్థం ప్రభావం కేవలం వ్యక్తిగత స్థాయిలో కాకుండా కుటుంబానికి, సమాజానికి తీవ్రంగా విస్తరిస్తోంది. గంజాయి వాడకం వల్ల పాఠశాల విద్యార్థులలో చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. తరచుగా గైర్హాజరు అవుతూ చివరికి చదువు మానేస్తున్నారు. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, మానసిక స్థిరత్వం కోల్పోవడం వలన ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రభావం



పడుతోంది. నేరాల శాతం పెరుగుతోంది. గంజాయి కొనుగోలుకు డబ్బుల కోసం దొంగతనాలు, దాడులు వంటి నేరాలకు పాల్పడే అవకాశాలు కూడా పెరిగాయి. డ్రగ్ ఆధారిత నేరాల శాతం గత ఐదేళ్లలో 32 శాతం మేర పెరిగిందన్నది ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న నిజం. ఇటు తెలంగాణలో 2023లో మాత్రమే గంజాయి అక్రమ రవాణా కేసులు 850కి పైగా నమోదయ్యాయి. హైదరాబాదు, రంగారెడ్డి ప్రాంతాల్లోనే దాదాపు 220 కేసులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, అల్లూరి సీతారామరాజు, పాడేరు, ముంపు ప్రాంతాల్లో గంజాయి సాగు కొనసాగుతూనే ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 1,500 ఎకరాల గంజాయి సాగు గుర్తించబడి నాశనం చేయబడినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్ని ఎదుర్కొనటానికి కేంద్ర ప్రభుత్వం 1985లో మాదక ద్రవ్యాలు మానసిక ప్రభావ పదార్థాల చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం గంజాయి సాగు, నిల్వ,రవాణా, విక్రయం, వినియోగం నేరంగా పరిగణించబడుతుంది. కేంద్ర స్థాయిలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల్లో పోలీసు శాఖలు, ఎక్సైజ్ శాఖలు గంజాయి వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేస్తున్నాయి. డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షణ, సరిహద్దుల్లో తనిఖీలు, రహస్య సమాచార మాధ్యమాల ద్వారా గంజాయి వాణిజ్యాన్ని గుర్తించి నిర్వీర్యం చేస్తున్నారు. పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సులు, కళాశాలల వద్ద డ్రగ్ నిరోధక శిబిరాలు నిర్వహించడం మొదలు పెట్టారు. 2025 నాటికి మత్తు పదార్థాల వినియోగాన్ని 50 శాతం తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్రం 'దేశీయ మత్తు నియంత్రణ చర్యల కార్యాచరణ పథకం'ను చేపట్టింది. ఇందులో అవగాహన కార్యక్రమాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, మానసిక చికిత్సలు, కుటుంబాల సహకారం వంటి అంశాలను మేళవించారు. కొన్ని రాష్ట్రాలు పాఠశాలల పాఠ్యాంశాలలో డ్రగ్స్‌హానిపై ప్రత్యేక అధ్యాయాలు ప్రవేశపెట్టాయి. అయితే ఈ చర్యలు సరిపోవు.సమాజం మొత్తం దీన్ని ఒక జాతీయ సంక్షోభంగా గుర్తించాలి. ప్రతీ పాఠశాల, కళాశాల, కుటుంబంలో ఈ విషయంపై చర్చ, చైతన్యం అవసరం. యువత మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఉండేందుకు వారికి మానసిక ఆరోగ్య మార్గదర్శకత అవసరం. ఉపాధి అవకాశాలు పెంచాలి. సినిమా, టెలివిజన్, సోషల్ మీడియా వంటి వేదికల్లో గంజాయివాడకాన్ని ప్రోత్సహించే దృశ్యాలను నియంత్రించాలి. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం ఉండాలి. గంజాయి మహమ్మారి మన దేశ యువతను బలి తీసుకుంటోంది. అది కేవలం ఒక మత్తు పదార్థం కాదు – అది ఒక భవిష్యత్ హంతక మార్గం. ఈ మత్తు మాయను అంత మొందించాలి. ప్రభుత్వాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మానసిక నిపుణులు, సమాజ సేవా సంస్థలు,యువతీ, యువకులు – అందరూ చేతులు కలిపి పని చేయాలి. అంతేకాదు, మానవతా దృష్టితో ఈ వ్యసనాన్ని ఔషధ చికిత్స, పునరావాసం, బోధన, శిక్షణ, క్రమశిక్షణ అనే అంశాలుగా అర్థం చేసుకుని ముందుకెళ్లాలి. మన దేశం ఆరోగ్యంగా ఉండాలంటే మన యువత ఆరోగ్యంగా ఉండాలి. యువత చేతులు సృష్టి కర్తలుగా ఎదగాలి. మత్తు పదార్థాలకు బానిసలుగా కాక యువతను గంజాయి సంకెళ్ల నుండి విముక్తి చేయాలంటే – చైతన్యంతో, శక్తితో, స్ఫూర్తితో ప్రతి ఒక్క రూ ఒక అడుగు ముందుకు వేయాలి. అప్పుడు గంజాయి రహిత భారతం సాధ్యమే. అప్పుడు మన దేశ భవిష్యత్తు వెలుగులవైపు ప్రయాణిస్తుంది. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# బీహార్ ఓటర్లలో అత్యధికులు
# బంగ్లా, నేపాలీ, మయన్మార్ పౌరులు

## పరిశీలన తర్వాత తొలగిస్తామని ఇసి వెల్లడి



**పాట్నా, జులై 13:** బీహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సమగ్ర సవరణను చేపట్టడం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విపక్షాల ఆందోళనలను తోసిపుచ్చుతూ బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో అనేక విషయాలు తెలుస్తున్నాయి. బీహార్‌లో ఇంటింటినీ తనిఖీ చేస్తున్న ఇసి సిబ్బందికి భారీగా బంగ్లాదేశీయులు, నేపాలీలు, మయన్మార్ పౌరులు కనిపించారు. వారి వద్ద ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయి. అంతేకాదు వారిలో చాలా మంది ఓటర్ లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి భావిస్తోంది. అందుకే ఆగస్టు తర్వాత వారిని విచారించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో విడుదల చేసే తుది ఓటర్ జాబితాలో విదేశీయుల పేర్లు ఉండవని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలకు వచ్చే ఓట్లను తొలగించడానికే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లో ఇసి ఈ ప్రక్రియ చేపట్టిందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్ కార్డును పౌరసత్వ గుర్తింపుగా పరిగణించకపోతే పేదలు, వృద్ధులు ఇప్పటికిప్పుడు కుల, నివాస, జనన ధ్రువపత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించాయి. పిటిషన్లను విచారించిన సుప్రీం ఓటర్ జాబితా సమగ్ర సవరణ రాజ్యాంగ బద్ధమేనని స్పష్టంచేసింది. అయితే ఎస్ఐఆర్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఇసికి సూచించింది. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు బీహార్‌లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ చేపట్టారు. ఇంటింటి తనిఖీల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తులు భారీగా బీహార్‌లో ఉన్నారని గుర్తించారు. వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయా లేదా అన్నది వెల్లడించలేదు. ఆగస్ట్ 1 తర్వాత క్షుణ్ణంగా విచారణ జరుపుతామనీ భారత పౌరులు కానివారి పేర్లేవీ సెప్టెంబర్ 30న విడుదల చేసే జాబితాలో ఉండబోవని అధికారులు తెలిపారు. బీహార్‌లో ప్రస్తుతం 77 వేలమంది బూత్ లెవల్ ఆఫీసర్లు, ప్రభుత్వ సిబ్బంది, రాజకీయపార్టీల కార్యర్తలు పాల్గొంటున్నారు. 7.8 కోట్ల మంది ఓటర్లను వీరు తనిఖీ చేయనున్నారు.

దేశవ్యాప్తంగా సర్వేను నిర్వహించాలని నిర్ణయించింది. చాలారాష్ట్రాల్లో భారీగా అక్రమ విదేశీ వలసదారులు ఉంటున్నారు. వారిలో చాలా మంది ఓటర్‌లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి తెలిపింది. విదేశీయులను ఓటర్‌లిస్ట్ నుంచి తొలగించేందుకే పక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. పశ్చిమ బంగాల్, అసోం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో ప్రభుత్వాల పదవీకాలం వచ్చే ఏడాది మే కల్లా ముగియనుంది. దీంతో బీహార్ తర్వాత ఆ రాష్ట్రాల్లోనే ఓటర్ జాబితా సమగ్ర సవరణ చేపడతామని ఇసి స్పష్టం చేసింది.



# రాజ్యసభకు మరో నలుగురు ప్రముఖులు

## నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### సీనియర్ న్యాయవాది ఉజ్వల్‌నికం, చరిత్రకారిణి మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్, మాజీ దౌత్యవేత్త హర్షవర్ధన్ సింగ్లా నియామకం

**న్యూఢిల్లీ, జులై 13:** రాష్ట్రపతి ద్రౌపదిముర్ము మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ శ్రింగ్లా, ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికంతో సహా నలుగురిని రాజ్యసభకు నామినేట్ చేశారు. ఈ మేరకు కేంద్రహోంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముంబయి ఉగ్రదాడుల కేసులో ఉగ్రవాది కసబ్‌కు ఉరిశిక్షపడేలా ప్రభుత్వం తరఫున ఉజ్వల్ నికం వాదనలు వినిపించారు. రాష్ట్రపతి నామినేట్ చేసిన మిగిలిన ఇద్దరిలో ప్రముఖ చరిత్రకారిణి మీనాక్షిజైన్, కేరళ ఉపాధ్యాయుడు సదానందన్‌లు ఉన్నారు. ఆయా రంగాల్లో వారి సేవలను గుర్తించి రాష్ట్రపతి ఆ నలుగురిని పెద్దల సభలకు నామినేట్ చేశారు. కళలు, సాహిత్యం, ప్రజాసేవ సహా వివిధరంగాలకు చెందిన 12మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. వారిలో నలుగురి పదవీకాలం ముగియటం వల్ల రాష్ట్రపతి ఆ స్థానాలను భర్తీ చేశారు. రాజ్యసభకు నామినేట్ అయిన నలుగురికీ మోదీ అభినందనలు తెలిపారు. "న్యాయ రంగం, రాజ్యాంగం పట్ల ఉజ్వల్ నికంకు ఉన్న అంకితభావం ఆదర్శప్రాయమైనది. ఆయన గొప్ప న్యాయవాది మాత్రమే కాదు, ముఖ్యమైన కేసులను వాదించడంలో ఆయన ముందు వరుసలో ఉంటారని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తన న్యాయ వృత్తిలో నికం ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడానికి విశేష కృషి చేశారన్నారు. రాష్ట్రపతి ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. శ్రింగ్లా సహకారాన్ని మోదీ ప్రశంసించారు. ఆయన దౌత్యవేత్తగా, మేధావిగా వ్యూహాత్మక ఆలోచనాపరుడిగా రాణించారని మోదీ అన్నారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన భారతదేశ విదేశాంగ విధానానికి విశేష కృషి చేశారు. జీ20 అధ్యక్ష పదవికి కూడా దోహదపడ్డారు. ఆయన్ని రాజ్యసభకు నామినేట్ చేయడం ఆనందంగా ఉందని మోదీ మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా, సామాజిక కార్యకర్తగా ఆయన ప్రయత్నాలు ప్రశంసనీయం అని మోదీ అన్నారు. యువత సాధికారత పట్ల ఆయనకు చాలా మక్కువ ఉందన్నారు. మీనాక్షి జైన్‌ను రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేయడం చాలా సంతోషకరమైన విషయం అని మోదీ అన్నారు. ఆమె ఒక పండితురాలిగా, పరిశోధకురాలిగా, చరిత్రకారిణిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. విద్య, సాహిత్యం, చరిత్ర, రాజకీయ శాస్త్ర రంగాలలో ఆమె విశేష కృషి చేశారన్నారు. విద్యా రంగంలో ఆమె చేసిన కృషికి గానూ 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారన్నారు. భారత రాష్ట్రపతి రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే అధికారం ఉంటుంది. కళలు, సాహిత్యం, సామాజిక సేవ వంటి రంగాలలో కృషి చేసిన వారిని ఈ స్థానాలకు నామినేట్ చేస్తారు.



## భార్యతో విడాకులను వేడుకగా జరుపుకున్న భర్త

**గువాహతి,జులై 13:** భార్య నుంచి విడాకుల మంజూరు అయ్యాయని అసోంకు చెందిన ఓ వ్యక్తి వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. 40 లీటర్ల పాలతో స్నానంచేసి సంబరాలను జరుపుకున్నాడు. తాను ఇకనుంచి స్వేచ్ఛగా ఉంటానని అంటున్నాడు. విముక్తికి ప్రతీకగా అసోంలోని నల్బరి జిల్లాలోని ముకల్మువా పోలీస్ స్టేషన్ పరిధిలోని బరలియాపర్ గ్రామానికి చెందిన మాణిక్ అలీకి తన భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు మంజూరైంది. ఈ విడాకుల ద్వారా తనకు విముక్తి కలిగిందని భావించాడు. 40 లీటర్ల పాలతో స్నానం చేశాడు. భార్య నుంచి విముక్తి లభించడం వల్లే ఇలా చేశానని చెబుతున్నాడు మాణిక్ అలీ. ప్రస్తుతం ఈ పాల స్నానం ఎపిసోడ్ అసోంతో పాటు దేశవ్యాప్తంగా వైరల్‌అయ్యింది. తాను పాలస్నానం చేయడానికి గల కారణాలను మాణిక్ అలీ వివరించాడు. తన భార్య ఆమె ప్రియుడితో రెండుసార్లు పారిపోయిందన్నాడు. తన కూతురి భవిష్యత్తు కోసం ఆలోచించి భార్యను రెండు సార్లు క్షమించానని తెలిపాడు. కానీ తన భార్య పదేపదే తన ప్రియుడి పారిపోతోందని, తప్పును మళ్లీ పునరావృతం చేస్తోందని పేర్కొన్నాడు. తాను ఇక భరించలేక భార్య నుంచి చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నానని వెల్లడించాడు.

## 17 యేళ్ల బాలుడితో లేచిపోయిన సవతితల్లి!

**చండీగఢ్, జులై 13:** హరియాణాలోని నుహ్ జిల్లాలో వావివరసలు మరిచి 17 ఏళ్ల బాలుడ్ని తీసుకుని సవతితల్లిపారిపోవడమే కాకుండా ఆతడిని వివాహం చేసుకుంది. ఈ ఘటన పై బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హరియాణాలోని నుహ్ జిల్లాలో షాకింగ్ ఘటన జరిగింది. 17 ఏళ్ల బాలుడు 40 ఏళ్ల సవతి తల్లి మోనికతో ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్నారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి రామ్ కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితుడు రామ్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం రామ్ కిషన్ మొదటి భార్య చనిపోయింది. అయితే గురుగ్రామ్‌లోని సోహ్నా ప్రాంతానికి చెందిన మోనిక అనే మహిళను పెళ్లిచేసుకున్నాడు.గత కొద్ది కాలంగా రామ్ కిషన్ మొదటి భార్య కుమారుడు వీరితో కలిసి ఆ ఇంట్లో ఉంటున్నాడు. రామ్ కిషన్ ముందు మోనికను తల్లి అని పిలిచేవాడని కాళ్లు కూడా పట్టుకునే వాడని కానీ వాళ్లిద్దరి మధ్య సీక్రెట్ ఎఫైర్ నడుస్తోందని తాను గ్రహించలేదని రామ్ కిషన్ పేర్కొన్నాడు. తాజాగా మోనికతో బాలుడు పారిపోయాడు. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. అయితే వారి పెళ్లి చెల్లదని బాలుడికి 17 ఏళ్లేనని తండ్రి రామ్ కిషన్ తెలిపాడు. అయితే పోలీసులు మాత్రం వీళ్లిద్దరూ కోర్టు మ్యారేజ్ చేసుకున్నారని.. తాము ఏమీ చేయలేమని చెప్పడం గమనార్హం.

## చైనా-భారత్‌కు సమస్యగా దలైలామా వారసత్వ సమస్య!

**న్యూఢిల్లీ, జులై 13:** టిబెట్‌బౌద్ధమతగురువు దలైలామా వారసుడిఎంపిక అంశం ఇపుడు చైనా భారత్ సంబంధాల్లో ఒక సమస్యగా మారిందని భారత్‌లోని చైనా రాయబారకార్యాలయం వెల్లడించింది. భారత విదేశాంగ నిపుణులు టిబెట్‌కు సంబంధించిన సమస్యల సున్నితత్వంపరిగణనలోనికి తీసుకోవాలన్నారు. దలైలామా పునర్జన్మ, వారసత్వం పూర్తిగా మాదేశ అంతర్గత వ్యవహారమని, భారత్ కల్పించుకుంటే సమస్యలు తలెత్తుతాయని ఆయన అన్నారు. 2020లో గల్వాన్‌ఘటనతో ఇరుదేశాలమధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తినతర్వాత భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనాలో తొలిసారి పర్యటించనున్నట్లు తేలింది.

# బీహార్ అసెంబ్లీ ఎన్నికలకోసం నితీశ్ వరాలు

## తాజాగా 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్

## 50 లక్షలమంది యువతకు ఉద్యోగ కల్పన



**పాట్నా, జులై 13:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్ననేపథ్యంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉచిత పథకాలు, ప్రజలకు సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించారు. ఇప్పటికే మహిళా రిజర్వేషన్లు, పెన్షన్ పెంపు వంటి నిర్ణయాల తర్వాత ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడానికి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. అలాగే రాష్ట్రంలో 50 లక్షలమంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. లక్ష్యం పూర్తికావడానికి అత్యంత చేరువలో ఉన్నామని, ఇప్పటివరకూ పదిలక్షలమందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, మరో 39 లక్షల మంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి పొందారన్నారు. 2030 కల్లా కోటి మందికి ఉద్యోగకల్పన చేస్తామన్నారు. అలాగే వలసజీవులకోసం మొత్తం 300 అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రవేశపెడతామన్నారు. తాజాగా ఉచిత విద్యుత్ ప్రతిపాదనకు ఆర్థిక శాఖ ఆమోదం లభించింది. అయితే కేబినెట్ ఆమోదం లభించాల్సి ఉంది. కేబినెట్ ఆమోదం తర్వాతే వినియోగదారులు ఈ పథకం ప్రయోజనాన్ని ఎలా పొందవచ్చో తెలుస్తుంది.

ఈ పథకం ముందుగా ఆర్థిక శాఖ ఆమోదం పొందడానికి కారణం దీని ఆర్థిక భారం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. సామాజిక భద్రత పెన్షన్ పెంపు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సామాజిక భద్రత పెన్షన్ పథకంలో పెంపును ప్రకటించారు. దీని ప్రకారం పింఛను ఇప్పుడు ఇస్తున్న 400 రూపాయలకు బదులుగా రూ.1100 లభిస్తుంది. పెంచిన పెన్షన్ మొత్తం జులై నుంచి ప్రారంభమవుతుందని సిఎం తెలిపారు. మహిళలకు 35 శాతం రిజర్వేషన్ ప్రకటన రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగాలలోని ప్రతి విభాగంలో 35 శాతం పోస్టులు మహిళలకోసం రిజర్వ్ చేయబడతాయని సిఎం నితీష్ కుమార్ ప్రకటించారు.

# ఆరోజు కాక్‌పిట్‌లో ఏంజరిగింది?

- ఎయిరిండియా విచారణ నివేదికలపై నిపుణుల సందేహాలు
- అసమగ్రంగా ఉన్న ఎఐబి నివేదిక
- రెండు ఇంజిన్ల వైఫల్యంపై ఇంకా అనుమానాలు

**న్యూఢిల్లీ, జులై 13:** అహ్మదాబాద్‌లో గత నెలలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై అనేక ప్రశ్నలు ఇంకా సమాధానం దొరకడం లేదు. తాజాగా ఈ ప్రమాదానికి సంబంధించిన నివేదిక రాగా, విమానయాన నిపుణులు దానిని ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు కాక్‌పిట్‌లో ఏం జరిగిందన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. భారత వైమానిక దళ (ఐఎఎఫ్) మాజీ డైరెక్టర్ సంజీవ్ కపూర్ మాట్లాడుతూ ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎఎఐబి) ప్రారంభ 15పేజీల నివేదికను తీవ్రంగా విమర్శించారు. దాని ముగింపు కూడా అసంపూర్ణంగా ఉందని, కాలక్రమం కూడా అనుమానాస్పదంగా ఉందని పేర్కొన్నారు. పైలట్ మేడే కాల్‌ను ఎప్పుడూ తేలిగ్గా జారీచేయడని, మేడే అంటే ఏదోఘోరంజరిగిందనే అర్థమని చెప్పారు. రెండు ఇంజిన్లు విఫలమయ్యాయని చెప్పడంలో సందేహం లేదన్నారు. అయితే, వాటి విఫలం వెనక కారణం మాత్రం ప్రాథమిక నివేదికలో వివరించలేదన్నారు. విమానం కూలడానికి ముందు పైలట్లలో ఒకరు వరుసగా మూడుసార్లు డిస్ట్రెస్ కాల్ చేశారన్న ఏఏఐబీ నివేదికపై సంజీవ్ కపూర్ స్పందిస్తూ ఇంధన సరఫరా ఎందుకు నిలిచిపోయిందని పైలట్లలో ఒకరు ప్రశ్నించడం కాక్‌పిట్ వాయిస్ రికార్డయిందన్నారు. దీని కారణంగానే టేకాఫ్ అయిన తర్వాత ఇంజిన్లు రెండు సెకన్ల వ్యవధిలోనే శక్తిని కోల్పోయాయని తెలిపారు. టేకాఫ్ అయిన వెంటనే పైలట్ ఉద్దేశపూర్వకంగా ఇంధన కట్ ఆఫ్ స్విచ్‌లను ఆపరేట్ చేస్తాడని చెప్పడం వింతగా ఉందని సంజీవ్ కపూర్ చెప్పారు. విమానాన్ని పైలట్ మాన్యువల్‌గా ఎందుకు లిఫ్టాఫ్ చేస్తాడని ప్రశ్నించారు.

# నస్రల్లాను హతమార్చినట్లే.. ఖమేనీ అంతానికి యత్నం

## ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఆరోపణలు



**టెహ్రాన్, జులై 13:** ఇటీవల ఇరాన్‌లోని అణ్వాయుధ స్థావరాలు, ముఖ్య నేతల నివాసాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిన సంగతి విదితమే. అయితే బీరుట్‌లో హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేసిన విధంగానే ఇరాన్‌పై దాడుల సమయంలో ఇజ్రాయెల్.. తమ దేశాధ్యక్షుడిని హతమార్చడానికి ప్రయత్నించిందని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జిసి)కు సంబంధించిన వార్తా సంస్థ పేర్కొంది. జూన్ 16న టెహ్రాన్‌లోని ఓ భవనంలో నిర్వహించిన ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశానికి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాగర్ గాలిబాఫ్, న్యాయ వ్యవస్థ చీఫ్ మోహ్సేని ఏజీ, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారని వార్తా సంస్థ తెలిపింది. ఉన్నతాధికారుల సమావేశంలో ఉన్న సమయంలో ఆ భవనంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని వార్తాసంస్థ వెల్లడించింది. అందులోని వారు తప్పించుకునే వీలు లేకుండా భవనానికి ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లను లక్ష్యంగా చేసుకొని.. ఆరు క్షిపణులను ప్రయోగించిందని ఆరోపించింది. దాడులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ అధికారులు ముందుగానే సిద్ధం చేసుకున్న అత్యవసర హాచ్ ద్వారా తప్పించుకోగలిగారని తెలిపింది. అక్కడి నుంచి తప్పించుకుంటున్న సమయంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియార్ సహా పలువురు ఉన్నతాధికారులకు గాయాలు అయినట్లు తెలిపింది. హెజ్‌బొల్లా నాయకుడు నస్రల్లాను హత్య చేయడానికి ఇజ్రాయెల్ ఇదే తరహాలో దాడి చేసిందని.. ఇరాన్ అధ్యక్షుడి విషయంలో మాత్రం విఫలమయ్యిందని పేర్కొంది.

# రేపటి నుంచి యుకెలో ఇ-వీసా అమలు!



**లండన్, జులై 13:** యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ నెల 15 నుంచి సాధారణ వీసాల స్థానంలో ఇ-వీసాలు అమల్లోకి రానున్నాయి. ఇమిగ్రేషన్ వ్యవస్థలో చేపట్టిన విస్తృత మార్పుల్లో భాగంగా వీటిని వాడుకలోకి తీసుకొస్తున్నారు. జులై 15 నుంచి జారీ చేసే అన్ని వీసాలు వాటిని పొందే వారి పాస్‌పోర్టులతో అనుసంధానమై.. డిజిటల్ రూపంలో ఉండనున్నాయి. ఇవి అన్ని రకాల వాటికి వర్తిస్తుంది. యుకెలో విద్యాభ్యాసం చేసే వారిలో భారతీయుల సంఖ్యే ఎక్కువ. ఇమిగ్రేషన్ ప్రాసెస్‌ను గాడిన పెట్టేందుకు ఈ సరికొత్త వీసాలను అమల్లోకి తెస్తోంది. విద్యార్థులు కచ్చితంగా తమ డిజిటల్, ప్రొసీజరల్ అంశాలను ప్రయాణానికి ముందే సరిచూసుకోవాల్సి ఉంటుంది.

సరికొత్త విధానం ప్రకారం.. పాస్‌పోర్టుపై సంప్రదాయ వీసా విగ్నెట్‌ను జారీ చేయరు. దీనికి బదులు ఇ-వీసా జారీ చేస్తారు. ఇది డిజిటల్ ఇమిగ్రేషన్ హోదాను అందిస్తుంది. ఇ-వీసాల్లో కచ్చితంగా విద్యార్థులు అప్‌డేట్ చేసిన పర్సనల్ పాస్‌పోర్టు వివరాలు ఉండాల్సిందే. పాస్‌పోర్టు రెన్యూవల్‌లో మార్పులను కూడా తెలియజేయాల్సి ఉంటుంది. విద్యార్థులు కచ్చితంగా యుకెవిఐ ఖాతాను క్రియేట్ చేసుకొని వారి ఇ-వీసాను మేనేజ్ చేసుకోవాలి. వీసా వివరాలు, అప్‌డేట్ ఇన్ఫర్మేషన్, ఇమిగ్రేషన్ స్టేటస్ సమాచారం ఆయా విద్యా సంస్థలకు, యజమానులకు, కంపెనీలకు తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. దీంతోపాటు విద్యార్థులు లాగిన్ క్రెడెన్షియల్స్, కాంటాక్ట్ డిటైల్స్‌ను సరిగ్గా గుర్తుంచుకోవాలి. విద్యార్థులు యుకెలో బస చేసేందుకు, కోర్సుల్లో రిజిస్టర్ చేసుకునే సమయాల్లో.. ఆయా కంపెనీలు, ల్యాండ్ లార్డ్స్, విశ్వవిద్యాలయాలు యుకెవిఐ ఖాతాను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇ-వీసా జారీ అయినా.. విద్యార్థులు మాత్రం తమ పాస్‌పోర్టును, ప్రింటెడ్ లేదా డిజిటల్ వీసా కాపీలను తమతో ఉంచుకోవాలి. బోర్డర్ ఆఫీసర్లు పాస్‌పోర్టును స్కాన్ చేసి ఇ-వీసాను తనిఖీ చేస్తారు. ఇక వీసా జారీ అయ్యాక.. పాస్ పోర్టును రెన్యూవల్ చేస్తే.. ఆవివరాలను విద్యార్థులు తమ ఇంగ్లాండ్ ప్రయాణానికి ముందే తమ యుకెవిఐ ఖాతాను అప్‌డేట్ చేయాలి.

యుకె ప్రయాణానికి ముందు.. ఇ-వీసా జారీని ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్టు లింకేజీని సరిచూసుకోవాలి. యుకెవిఐ ఖాతా కోసం రిజిస్టర్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ను జాగ్రత్తగా ఉంచుకోవాలి. డిజిటల్ సిస్టమ్‌లో అన్ని పర్సనల్, పోస్‌పోర్టు వివరాలను నమోదు చేయాలి. వీసా డెసిషన్ లెటర్‌ను ప్రింట్ తీసుకోవడమో.. సేవ్ చేసుకోవడమో చేయాలి. వీసా అప్లికేషన్‌లో వాడిన పాస్‌పోర్టును వారి వద్ద ఉంచుకోవాలి. ఇమిగ్రేషన్ వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీ అకామిడేషన్‌కు సంబంధించిన పాలసీలను సరిచూసుకోవాలి.

# సంక్షిప్తంగా..

## కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం, జులై 13:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీసు స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఇ-మెయిల్ పంపారు. క్లిఫ్ హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ-మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇ-మెయిల్‌గా తేల్చారు. 'బాంబు బెదిరింపు తర్వాత సిఎం నివాసాన్ని డాగ్‌స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు'అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సిఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు.

## పాత డ్యామ్‌లను కూల్చివేస్తున్న చైనా

**బీజింగ్,జులై 13:** దేశంలో వేలాదికోట్లతో నిర్మించిన పాత డ్యామ్‌లన్నింటినీ పర్యావరణ ప్రయోజనాలకోసమని చైనా ప్రభుత్వం కూల్చివేస్తోంది. ఇప్పటి వరకు కట్టిన డ్యామ్‌లన్నీ కూల్చేస్తోంది ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఇప్పటి వరకు 300 డ్యామ్‌లు కూల్చేసింది. అంతేకాదు 373 హైడ్రోపవర్ స్టేషన్లలో 342 చిన్నస్థాయి జల విద్యుత్ కేంద్రాల్లో కార్యకలాపాలు ఎక్కడికక్కడ బంద్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా డ్రాగన్ కంట్రీ కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డ్యామ్‌ల కూల్చివేత చర్యలు 2020 నుంచే మొదలు పెట్టినట్లు సమాచారం. ఆసియాలోనే అతి పొడవైన యాంగ్జీ నదిపై చైనా గత కొన్ని దశాబ్దాల కాలంలో భారీస్థాయిలో డ్యామ్‌లు, జల విద్యుత్ కేంద్రాలు నిర్మించింది. దీంతో పర్యావరణాకి పెను ముప్పు వాటిల్లింది. నదిని ఆధారంగా చేసుకుని జీవించే జలచరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

## డీజిల్ లోడ్ గూడ్స్‌రైలులో మంటలు

**తిరువళ్లూరు,జులై 13:** తమిళనాడులోని తిరువల్లూరు సమీపంలో డీజిల్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలులో మంటలు చెలరేగాయి. చెన్నై పోర్టు నుంచి 52 వ్యాగన్లలో బెంగళూరుకు ఇండియన్ ఆయిల్ తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక వ్యాగన్‌లో లేచిన మంటలు వేగంగా ఇతర వ్యాగన్లకు వ్యాపించాయి. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాలేదని రైల్వే అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకొన్న అగ్నిమాపక సిబ్బంది విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. అనంతరం మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాద నేపథ్యంలో పలు లోకల్ రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు.

## హిందీలోనే మాట్లాడతానన్న ఆటోడ్రైవర్‌పై 'సేన' దాడి!

**ముంబయి, జులై 13:** మహారాష్ట్రలో మరో షాకింగ్ ఉదంతం చోటుచేసుకుంది. హిందీలోనే మాట్లాడతానన్న ఓ ఆటో డ్రైవర్‌పై శివసేన యుబిటి, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు బహిరంగంగా దాడికి దిగారు. వారం రోజుల క్రితం ఆ ఆటో డ్రైవర్ తన వాహనంలోని ప్రయాణికుడితో మాట్లాడుతూ తాను హిందీ లేదా భోజ్‌పురిలోనే మాట్లాడతానని స్పష్టం చేశాడు. ఎవరేం చేసినా తనకు భయం లేదని చెప్పారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో శివసేన యుబిటి, ఎమ్ఎన్ఎస్ మద్దతుదారులు ఆ ఆటోడ్రైవర్‌పై దాడి చేశారు. మరాఠీ భాష, సంస్కృతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదంటూ పలుమార్లు అతడి చెంప ఛెళ్లుమనిపించారు. అతడిపై చేయి చేసుకున్న వారిలో మహిళ కూడా ఉన్నారు.

## పాట్నాలో పట్టపగలే న్యాయవాది కాల్చివేత!

**పాట్నా,జులై 13:** బీహార్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాట్నాలోని సుల్తాన్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు కేవలం 300 మీటర్ల దూరంలో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు రెచ్చిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒక లాయర్‌పై కాల్పులు జరపడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో ఆ ప్రాంతవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. రాష్ట్రంలో పెరుగుతున్న గన్ కల్చర్‌పై ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అగంతకుల కాల్పుల్లో మృతిచెందిన వ్యక్తిని జితేందర్ కుమార్‌గా గుర్తించారు పోలీసులు. వృత్తిరీత్యా లాయర్ అయిన జితేందర్ కుమార్ గత రెండేళ్లుగా తన వృత్తిలో చురుకుగా లేరని తెలుస్తోంది. రెగ్యులర్‌గా వచ్చే టీషాపులో టీ తాగి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పరారైనట్టు పాట్నా ఈస్ట్ ఎస్పీ పరిచయ్ కుమార్ తెలిపారు.

14-7Pg6exHMNWJQE.qxd:14-7Pg6exHMNWJQE.qxd 1/1/02 7:35 AM Page 1





చిల్డ్రన్ పార్కు సిల్వర్ జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

# చిల్డ్రన్స్ పార్కు సిల్వర్ జూబ్లీ వేడుకలు

## 25 మొక్కలు నాటిన మంత్రి నారాయణ


**నెల్లూరు, జులై 13, ప్రభాతవార్త -వైద్యం:** చిల్డ్రన్ పార్కు నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 మొక్కలను మంత్రి నారాయణ నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వల చేసిన సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ప్రారంభించారు. పార్కు ఏర్పాటుకు కృషి చేసిన జేఎస్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కు సిల్వర్ జూబ్లీలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్స్‌గా ఉన్న సమయంలో డంపింగ్ యార్డుని తొలగించి కౌన్సిల్‌లో పార్కుకి ఆమోదం తెలిపామని చెప్పారు. జన్మభూమిలో పెట్టి పార్కు అభివృద్ధి రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. సిటీలో 46 పార్కులను అన్ని హంగులతో ఏర్పాటు చేసిన ఘనత మంత్రి నారాయణకే దక్కుతుందన్నారు. నిత్యం అభివృద్ధి గురించి ఆలోచించే మంత్రి చిక్కటం మన అదృష్టం అని తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ గతంలో నెల్లూరులో రెండు పార్కుల గురించే అందరికి తెలుసని, ఇప్పుడు నారాయణ చలువతో 48కి పార్కుల సంఖ్య చేరిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి భాగాలేకున్నా అనుభవంతో అనుకున్నది సాధిస్తున్నారని కొనియాడారు. వీఆర్సీ ఆధునీకరణలో భాగస్వామి ఆయన మంత్రి కుమార్తె పొంగూరు షరణికి కూడా ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ చిల్డ్రన్స్ పార్కుకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అప్పట్లో నెల్లూరులో గాంధీ పార్క్ ఒక్కటే ఉండేదన్నారు. డంపింగ్ యార్డుని 2000 సంవత్సరంలో చిల్డ్రన్స్ పార్కుగా టీడీపీ ప్రభుత్వం మార్చిందన్నారు. జన్మభూమిలో 70-30 నిష్పత్తి కింద జేఎస్ రెడ్డి పార్కును ఏర్పాటు చేశారన్నారు. ఈ పార్కులో 70 మంది పిల్లలు ఒకే సారి ఆడుకొనేలా 28 లక్షలతో ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాయుగుండం వెంకటేశ్వర్లు పార్కు అభివృద్ధికి ముందుకొచ్చారని ఆధునీకరణకు 40 లక్షలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారన్నారు. పార్కు రూపురేఖలు మార్చేందుకు లియో కన్సల్టెంట్‌ని పిలిపిస్తానని హామీ ఇచ్చారు. 46 పార్కులు నెల్లూరు సిటీలో సిద్ధం చేశామని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 స్వచ్ఛ అవార్డులను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్మూర్తి, పెద్ద పంచల ప్రసాద్, ట్రెజరర్ ప్రసాద్ కమిటీ సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే వి.కె.సతీమణి పార్వతమ్మ మృతి

## నేడు అనంతపురంలో అంత్యక్రియలు

### నివాళులర్పించిన నాయకులు, అభిమానులు



వికె పార్వతమ్మకి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు ఇన్‌సెట్‌లో పార్వతమ్మ(ఫైల్)

**అనంతపురం, జులై 13 ప్రభాతవార్త బ్యూరో:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు గుత్తి మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ వి.కె.ఆదినారాయణరెడ్డి సతీమణి వికె పార్వతమ్మ(101) అనంతపురం నగరంలోని మెదటి రోడ్డు స్వగృహములో ఆదివారం తుది శ్వాస విడిచారు. వికె సతీమణి పార్వతమ్మ వికె సమకాలికులు మినహా సిపిఐకి సంబంధించిన ప్రతి ఒక్కరూ అమ్మా అని ఆప్యాయంగా పిలిచేవారు. సిపిఐ సీనియర్ నేత, దివంగత వికే ఆదినారాయణరెడ్డి కోసం సిపిఐకి చెందిన వారైన లేక ఇతరులైన గతంలో ఇంటికి వెళ్లితే అందరిని గౌరవించే సాంప్రదాయం పార్వతమ్మ అమ్మది అని పలువురు నేతలు, కార్యకర్తలు చెబుతున్నారు. వికె ఆదినారాయణ రెడ్డి ఇంటిలో సిపిఐ సమావేశాలు జరిగిన సందర్భంలో హాజరైన వారందరికీ మర్యాదలో ఏ లోటు వుండేది కాదు. పార్వతమ్మ మృతి పట్ల సిపిఐ అగ్రనేత నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జగదీష్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె సేవలను కొనియాడారు. వైసిపి, టిడిపి, సిపిఎం పార్టీల నేతలతోపాటు పలు ప్రజాసంఘాల నేతలు కూడా పార్వతమ్మ సేవలను కొనియాడారు. కాగా వికే ఆదినారాయణరెడ్డి సతీమణి పార్వతమ్మ అమ్మ మృతి చెందారు అన్న విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు వారి ఇంటికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో అనంతపురం సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, సి.మల్లికార్జున, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు జె.రాజారెడ్డి, బి.కేశవరెడ్డి, ఎన్.శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, టి.నారాయణస్వామి, నగర సహాయ కార్యదర్శులు బి.రమణయ్య, వి.కృష్ణుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కుల్లా యిస్వామి, నగర కార్యవర్గ సభ్యులు ఎల్లట్ల నారాయణ స్వామి, చిత్రచేడు రామాంజనేయులు, శ్రీనివాసులు, బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి, స్వామి, సిపిఐ నాయకులు సుందర్రాజు అనేక సిపిఐ కార్యకర్తలు నివాళులర్పించారు. కాగా సిపిఐ అగ్ర నాయకులు కీ.శే.వికె సతీమణి పార్వతమ్మ మృతి భాదాకరం అని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసుల నాయుడు, నీటిపారుదల నిపుణులు టి.లక్ష్మినారాయణ మాట్లాడుతూ వికె ఉన్న కాలంలో ఎంత అభిమానంగా ఉండేవారో, అంతే అభిమానంగా, ఆప్యాయతతో పార్వతమ్మ మాట్లాడేవారు, అతిథి మర్యాదలు చేసేవారు. వద్దని వారించిన వినిపించుకునే వారు కాదు అని అభిప్రాయ పడ్డారు. అమ్మ మితభాషి. గొప్ప సంస్కారవం తురాలు. అనిర్వచనీయమైన అనుబంధం వికె కుటుంబంతో పెనవేసుకుపోయింది. అమ్మ పార్వతమ్మ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నామని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కాగా సోమవారం ఉదయం అనంతపురంలోని హరిచంద్ర ఘాట్‌లో పార్వతమ్మ మృతదే హానికి అంతక్రియలు నిర్వహించనున్నారు.

# ఆర్డిటి సంస్థకు వెంటనే ఎఫ్.సి.ఆర్.ఏ మంజూరు చేయాలి

## మేధావుల డిమాండ్, ప్రజా ప్రతినిధులు స్పందించాలని వినతి



చర్చ వేదికలో ఆర్‌డిటీకి ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్న చేస్తున్న దృశ్యం

**అనంతపురం, జులై 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ (ఆర్డిటి)కి సంబంధించిన ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఏ)ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తగిన చొరవ చూపాలని, ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తీసుకురావాలని అనంతపు రంలో మేధావుల సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆదివారం జరిగిన మేధావుల సమావేశంలో ఆర్డిటికీ ఎఫ్‌సిఆర్‌ఏ మంజూరు సమస్యపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉప్పరపాటి వెంకటేశులు, ఎద్దులపల్లి కుమార్ నిర్వహించగా, రచయిత సంగీత వాణి రాయుడు అధ్యక్షత వహించారు. ఈ చర్చలో వివిధ వర్గాల చెందిన మేధావులు, కవులు, ప్రజా సంఘాల వారు, ఆర్డిటి అభిమానులు, సానుభూతిపరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. చర్చ వేదికలో ప్రముఖ కవి శాంతి నారాయణ, వంకిరెడ్డి రెడ్డప్ప రెడ్డి, హోవాబ్ ఖాన్, తిప్పేస్వామి, హనుమంత రాయుడు, డాక్టర్ వంశీకృష్ణ వంటి ప్రముఖులు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. వక్తలు తమ ప్రసంగాల్లో ఆర్డిటి సంస్థ అనేక దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో పేదల అభ్యున్నతికి చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. వేలాది గ్రామాల్లో విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి అవకాశాలు కల్పించిన ఆర్డిటి సేవలు అమూల్యమని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మేధావులు, కవులు, రచయితలు, ప్రజాస్వామ్యవాదులు సమావేశానికి హాజరై, ఆర్డిటి సేవలను కొనియాడారు. ఆ సంస్థ లక్షల మందికి మేలు చేసిన నేపథ్యంలో చర్చా వేదికలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎఫ్‌సిఆర్‌ఏను పునరుద్ధరించాలన్న డిమాండ్ వినిపించింది. ఆర్డిటిని రక్షించేందుకు తాము మద్దతుగా నిలబడతామని పలువురు అభిప్రాయపడ్డారు. ఆర్డిటి సేవలు ఆగిపోవడం అనేది సామాజికంగా పెద్ద నష్టంగా మిగులుతుంది. అందుకే దాని సేవలు కొనసాగేందుకు అందరం కలిసికట్టుగా నిలవాలి అని వక్తలు పేర్కొన్నారు.

# కోట మృతికి పలువురు మంత్రుల సంతాపం

**విజయవాడ, జులై 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతిపై పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రికందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకొని కోట కట్టుకున్న మహానటుడు కోట శ్రీనివాసరావు అన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపై ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంతాపం:** కోట శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వైవిధ్య భరితమైన నటనతో ప్రతి నాయకుడిగా క్యారెక్టర్ ఆర్టిస్టుగా కమెడియన్‌గా తెలుగు తెరపై ఎన్నో మరపురాని పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. తెలుగు భాష, యాస, మాండలికాలతో వెండితెరపై విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన వ్యక్తి. .

**సంతాపం తెలిపిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్:** వైవిధ్యభరితమైన నటనతో ఎన్నో మరపురాని పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోటా శ్రీనివాసరావు అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతాపం తెలిపారు. 1999లో బిజెపి విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపి సేవలందించిన ప్రజా నాయకుడు కోటా శ్రీనివాసరావు అన్నారు.ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించిన మంత్రి. అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖామాత్యులు ప్రముఖ నటుడు మాజీ ఎమ్మెల్యే కోటా శ్రీనివాసరావు మృతి చెందడం విచారకరం. 40ఏళ్ల పాటు కళా మతల్లికి ఆయన చేసిన సేవలు చిరాస్మరణీయం. 750కి పైగా సినీమాల్లో వివిధ వైవిద్య పాత్ర లను పోషించి సినీ ప్రియులను రంజింప చేశారు. తెలుగు సినిమాలో విలనిజానికి కొత్త వరవడిని సృష్టించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నాను.ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతతతతున్నాను.

# సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి సిపిఐ నారాయణ, కూనంనేని సంతాపం.

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కళామతల్లికి అంకితమై కోట శ్రీనివాసరావు సేవ చేశారని.. విలక్షణమైన వ్యక్తి అని, వారి సహజ నటనను ప్రజలు మరవలేరని నారా యణ కొనియాడారు. ఆయన మరణం కళా రంగానికి తీరనిలోటని ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియ జేశారు. మాజీ శాసనసభ్యుడు కోటా శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కోటా శ్రీని వాసరావు చిత్రపరిశ్రమలో అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరిం చారన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని, కోట శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# ఆయిల్ ట్యాంకర్‌లో చెలరేగిన మంటలు

## తమిళనాడు తిరువళ్లూరు సమీపంలో ఘటన

### చెన్నై-బెంగళూరు-తిరుపతి మార్గాల్లో ఆలస్యంగా నడిచిన రైళ్లు



**కుప్పం, జులై 13 ప్రభాతవార్త :** క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లతో వెళ్తున్న ఓ గూడ్స్ రైలులో ఓ ట్యాంకర్ నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం ఉదయం తమిళనాడులోని తిరువళ్లూరు సమీపంలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న రైల్వే ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపేశారు. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రధానంగా చెన్నై - బెంగళూరు రైలు మార్గంలో తిరిగే రైళ్లు కొంత ఆలస్యంగా నడిచాయి. ఈ సంఘటన జరిగిన సమయంలోబెంగళూరునుంచి చెన్నై వెళ్లే లాల్‌బాగ్ ఎక్స్‌ప్రెస్ రైలును కుప్పం రైలే వ్స్టేషన్‌లో కొంత సమయం నిలిపేశారు. సుమారు 45 క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లతో చెన్నై ఎగ్మోర్ స్టేషన్ నుంచి బయలుదేరిన గూడ్స్ రైలు వాలాజాబాద్ మార్గంలో వస్తుండగా తిరువళ్లూరు సమీపంలోని ఎగట్టూర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైనట్లు సమాచారం. ఒక్కసారిగా మంటలు చెలరేగిన నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారులు ముందస్తు చర్యగా విద్యుత్ సరఫరా నిలిపివేయించడంతో పాటు రైల్వే స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం చెన్నై - బెంగళూరు, తిరుపతి మార్గాల్లో తిరిగే రైళ్లు ఆలస్యంగా నడిచాయి.ఈ సంఘటనతో చెన్నై-అరక్కోణం సెక్షన్ల మధ్య తిరిగే ఇఎంయు లోకల్‌ట్రైన్లను ఆదివారం రద్దు చేశారు.

# జూరాల ఒక గేటు ద్వారా నీరు విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 13, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద స్వల్పంగా స్థిరంగా కొనసాగుతున్నది. ఆదివారం జూరాలకు 65,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.380 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 36035 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 6,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 47068 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

# 883 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యాం

## కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 13, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఒక గేటు ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది, ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులగాను ప్రస్తుతం 883.30 అడుగులకు చేరుకున్నది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 206.0996 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగేకుడిగట్టు జలవిద్యుత్ కేంద్రానికి 33,067 క్యూసెక్కులు, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రానికి 35,315 క్యూసెక్కులు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూరాల నుంచి 36035 క్యూసెక్కులు సుంకేసుల నుంచి 30,728క్యూసె క్కుల నీళ్లు వచ్చిడ్యాంలోకి చేరుతున్నాయి. మొత్తంగా శ్రీశైలం జలాశయం నుంచి 73568 క్యూసెక్కులు దిగువకు నాగార్జున సాగర్‌కు విడుదలయ్యాయి.

# తల్లితండ్రి లేని చిన్నారులకు భరోసా ఏది?

## మిషన్ వాత్సల్య లబ్ధిదారుల ఆవేదన

**పాకాల, జులై 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పాకాల మండల పరిధిలో కొన్ని అనివార్య కారణాల రీత్యా తల్లి తండ్రి పోగొట్టుకున్న పిల్లలు ప్రభుత్వం చేయూత కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి మొండి చెయ్యే మిగులుతోంది. మిషన్ వాత్సల్య పేరుతో తల్లి గాని, తండ్రి గాని, తల్లిదండ్రులు చనిపోయిన పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా పార్లమెంటు సాక్షిగా ప్రకటించిన పథకం మిషన్ వాత్సల్య. ఈ పథకం ద్వారా అనాథ పిల్లలకు వారి పోషణకు చదువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నెలకు 4000 రూపాయలు ఇస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు వేదికగా ప్రకటన చేశారు. ఈ పథకంలో చేరటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారులు గుర్తించే ప్రయత్నంలో రెండున్నర సంవత్సరాల ముందు గ్రామ వార్డు సచివాలయాల లోని డిజిటల్ అసిస్టెంట్ దగ్గర ఇప్పటికే లబ్ధిదారులు తమ అప్లికేషన్ నింపి నమోదు చేసి ఉన్నారు. కానీ ఇప్పటి వరకు కూడా పేద పిల్లలను వారి సంరక్షకులను ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వం నుంచి మొదలు కాకపోవడం పై లబ్ధిదారులను తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భావి భారత పౌరుల కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టక పోవడం దురదృష్టకరమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఓటు బ్యాంకు కోసం వయోవృద్ధులకు 4వేల రూపాయలు ప్రతినెలా పెన్షన్ చెల్లిస్తున్న ప్రభుత్వం భావి భారతదేశ భవిష్యత్తు కాపాడేందుకు తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు ఆర్థిక చేయూత కోసం దయానియంగా ఎదురు చూస్తున్నప్పటికీ నేటి పాలకులు స్పందించకపోవడం సభ్య సమాజానికి సిగ్గుచేటుగా మారిన ఓ పరిణామం. ప్రభుత్వం సొమ్ము మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెట్టే పాలకులు రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలలో తల్లి తండ్రి కోల్పోయిన పిల్లలను ఈ పథకం ద్వారా ఇప్పటికైనా ఆదుకోని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

# 20న 'ప్రణామం' కవి సమ్మేళనం

**విజయవాడ,జులై 13,ప్రభాతవార్త ప్రతినిధి:** మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో జులై 20న ఆదివారం విజయవాడలో ఎంపిక చేయబడిన కవులతో "ప్రణామం" కవి సమ్మేళనం జరుగనుంది. ఆ సంస్థ వ్యవస్థాపకులు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమికొండ సాంబశివరావు(కలిమిశ్రీ) తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో భాష, సామాజిక న్యాయం, దేశభక్తి, శాంతి, పర్యావరణం వంటి వివిధ అంశాలపై కవులు తమ కవితల్ని వినిపించొచ్చు. అనంతరం 18 ఎకరాల విస్తీర్ణంలో అందంగా విహార స్థలంగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం పార్కును చూసి తరించొచ్చు. అరుదైన లొకేషన్స్‌లో తీసుకున్న మీ ఫొటోలను చిరకాలం మీ జ్ఞాపకాలలో భద్రపరచుకోవచ్చు.



# దుర్గమ్మకు విజయవాడ సిపి ఆషాఢం సారె


**ఇంద్రకీలాద్రి, జులై 13, ప్రభాతవార్త:** దుర్గమ్మవారికి విజయవాడ సిపి రాజశేఖర్ బాబు దంపతులు ఆషాడం సారెను ఆదివారం అందించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకుని రాగా అక్కడ ఇఓ వారికి ఘన స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తొడ్కొని వెళ్ళారు. ఆషాడం సారెను అమ్మవారి ముందు పూజలు నిర్వహించి సమర్పించారు.

**భక్తుల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకు పంపిణీ చేసే ఉచిత ప్రసాదానికి రాజస్థాన్‌లోని ఉదయపూర్‌కు చెందిన శాంభవ సోలంకి రు.1,01,000లను, నిత్యాన్నదాన పథకానికి రు.51,000లను విరాళంగా ఆదివారం ఇఓకు అందించారు. రాజమండ్రికి చెందిన భోగవరపు సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు రు.1,01,116లను విరాళంగ అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మకు భక్తిగా కోలాట, నృత్యనీరాజనం:** దుర్గమ్మవారికి ఆదివారం విజయవాడకు చెందిన భక్తబృందం కోలాట ప్రదర్శన తో అలరించారు. విజయవాడకు చెందిన నృత్య కళాకారులు కూచిపూడి నృత్యార్చన సమర్పించారు.

**ఉచిత బిస్కట్లు,వాటర్‌బాటిల్స్ పంపిణీ:** భక్తులకు ఆదివారం ఉచితంగా వాటర్‌బాటిల్స్, మంచినీటి బాటిల్స్‌ను పంపిణీ చేశారు.

# దేశ రాజధానిలో త్రిపుర విద్యార్థిని అదృశ్యం



**న్యూఢిల్లీ, జులై 13:** దేశ రాజధాని ఢిల్లీలో స్నేహ దెబ్‌నాథ్ అనే 19 ఏళ్ల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో అదృశ్యం కావడం సంచలనం రేపుతోంది. త్రిపురకు చెందిన స్నేహ అదృశ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మానిక్ సాహా పోలీసులను ఆదేశించారు. త్రిపుర జిల్లా సబ్రూమ్ నివాసి అయిన స్నేహ ఢిల్లీ యూని వర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆత్మారామ్ సనాతన్ ధర్మ కాలేజీలో చదువుతోంది. చివరి సారిగా తన కుటుంబ సభ్యులతో ఈనెల 7న మాట్లాడింది. తన స్నేహితురాలిని దిం పేందుకు సరాయ్ రోహి ల్లా రైల్వే స్టేషన్‌కు వెళ్తు న్నట్టు తల్లికి తెలిపింది. ఉదయం 5.56 గంట లకు చివరిసారిగా ఫోన్ కాల్ రికార్డయింది. 8.45 గంటలకు ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. అయితే స్నేహ తనను కలుకోలేదని ఆమె ఫ్రెండ్ చెప్పడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. క్యాబ్ డ్రైవర్‌ను కనుక్కోగా సిగ్నేచర్ బ్రిడ్జి దగ్గర దింపినట్టు తెలియడంతో కుటుంబ సభ్యులు మరింత బెంబేలెత్తారు. సిగ్నేచర్ బ్రిడ్జి అంత సేఫ్టీ కాకపోవడమే కాకుండా అక్కడ పరిమితంగానే సీసీటీవీ నిఘా ఉంది. స్నేహ ఆచూకీపై కెమెరా ఫుటేజ్ లేకపోవడంతో ఆమె జాడ తెలుసుకోవడం క్లిష్టంగా మారింది. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఈనెల 9న ఎన్‌డీఆర్ఎఫ్ సాయంతో సిగ్నేచర్ బ్రిడ్జి చుట్టూ ఏడు కిలోమీటర్ల పరిధిలో తీవ్రమైన గాలింపు చర్యలు జరిపారు. అయితే ఇంతవరకూ సరైన ఆధారాలు ఏవీ దొరకలేదు. స్నేహ గత నాలుగు నెలలుగా డబ్బులు డ్రా చేయలేదని, బ్యాంకు అకౌంట్ ముట్టుకోలేదని ఆమె తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో స్నేహ ఆచూకి తెలిస్తేసమాచారం ఇవ్వాలని ప్రజలను పోలీసులు కోరారు.

# వాస్తవ జీవన చిత్రణ 'పగిలిన జీవ కలలు'

## కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎమ్‌డి ఇంతియాజ్

### ఎస్ ఆర్ పృథ్వి రచించిన పగిలిన జీవ కలలు, నానో ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ




**విజయవాడ,జులై 13,ప్రభాతవార్తప్రతినిధి:** మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రతిబింబిస్తూ వాస్తవ జీవన చిత్రణ ఎస్ఆర్ పృధ్వి రచించిన పగిలిన జీవ కలలు పుస్తకంలో మనం చూస్తామని కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ ఎ ఎమ్ డి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, కామ్రేడ్ జిఆర్కెపోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త నిర్వహణలో విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్ లో ప్రముఖ కవి ఎస్ ఆర్ పృధ్వి రచించిన పగిలిన జీవ కలలు, నానో ప్రస్థానం పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. పూర్వపు కలెక్టర్ ఇంతియాజ్ పగిలిన జీవ కలలు(దీర్ఘ కవిత) ఆవిష్కరణ చేసి అనంతరం ప్రసంగిస్తూ సమాజ పరివర్తనకు ఉపకరించే సాహిత్యం రావాలని ఆకాంక్షించారు. మరొక పుస్తకం నానో ప్రస్థానం ఆవిష్కరణ చేసిన డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్ వి రమణ ప్రసంగిస్తూ స్వల్ప అక్షరాలతో అనల్పార్థాన్ని నానో కవితా ప్రక్రియ లో చూస్తామన్నారు. అనేకమంది కవుల రచనాశైలిని కవి ఎస్ఆర్ పృధ్వి చక్కగా వివరించారని ప్రశంసించారు. ఆకాశవాణి పూర్వపు సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, ప్రముఖ కవయిత్రి కావూరి సత్యవతి ఈ పుస్తకాలను సమీక్షిస్తూ పాఠకులను ఆసక్తికరంగా చదివించే రచనలు అన్నారు. ప్రముఖ కవి శ్రీకంఠస్ఫూర్తి, ఎక్స్ రే సాహిత్య కార్యదర్శి సింగంపల్లి అశోక్ కుమార్ చక్కని అభిభాషణతో కవిని అభినందించారు.సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే కొల్లూరి మాట్లా డుతూ సులభశైలిలో, అందరికీ అర్థం అయ్యేలా కవిత్వం ఉండాలన్నారు. కామ్రేడ్ జిఆర్కె పోలవ రపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారా యణ రావు ప్రసంగిస్తూ సమాజాన్ని చైతన్యపరిచే రచనలను మనం స్వాగతించాలని అన్నారు. పుస్తక రచయిత ఎస్ఆర్ పృధ్వి సత్కార అనంతరం ప్రసంగిస్తూ కవిగా తన ఆశయాలను వివరించారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు తొలుత స్వాగ తం పలుకుతూ అధ్యయనం ద్వారా మాత్రమే కవులు మంచి కవిత్వాన్ని సృజన చేయగలరు అన్నారు. ఎక్స్ రే కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కొల్లూరి కనకవల్లి, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్,పురాణం రాజేశ్వర శర్మ, పొత్తూరి సీతారామారావు కార్యక్రమ పర్యవేక్షణ చేసారు.

# హెచ్‌సిఎ గోల్‌మాల్ కేసులో నిందితుల కస్టడీపై నేడు తీర్పు

**హైదరాబాద్, జులై 13, ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో వెలుగుచూసిన గోల్‌మాల్ కేసులో అరెస్టయి జైల్లో వున్న ఐదుగురు నింది తుల కస్టడీపై మల్కాజిగిరి కోర్టులో సోమవారం తీర్పు వెలువడనుంది. ఈ కేసులో హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహా ఐదుగురు అరెస్టవడం తెలిసిందే. మరో నిందితుడు దేవరాజ్ పరారీలో వుండగా అతని కోసం గాలిస్తున్నారు. హెచ్‌సిఎ గోల్‌మాల్‌లో పదుల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినందున నిందితు లను పది రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని సిఐడి అధికారులు మల్కా జిగిరి కోర్టును కోరారు. అయితే ఈ పిటిషన్‌పై డిఫెన్స్ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో నిందితుల తరపున ఆయన బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండింటిపైనా సోమవారం కోర్టు నిర్ణయాన్ని ప్రకటించనుంది.





## పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ

### నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాఖపట్నం జూలై 13 ప్రభాతవార్త

పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం జరుగు తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం 8వ పేజీలో

## అభివృద్ధి.. సంక్షేమం కూటమి పాలనతోనే సాధ్యం

### ఏపీ టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్



గాజువాక,జులై 13,ప్రభాతవార్త:

అభివృద్ధి సంక్షేమాన్ని సమపాలల్లో అందించినప్పుడే ఆశించిన ప్రగతి సాధ్యపడుతుంది, అదికూటమి పాలనలోనే సాధ్యం అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కోలనీ వద్ద వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ఆధ్వర్యంలో రూ.5 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్యలైన ఇళ్ల పట్టాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తన పదవీ కాలంలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వంలో అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు నిత్యం ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని తన దృష్టికి తేవాలాని సూచించారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కష్టించి పని చేస్తున్నారని తెలిపారు. వార్డులో మౌలిక సదుపాయాలతో రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కూటమి నాయకులు కృష్ణ, రెయ్యి రత్నం, స్వరూపారాణి, సుజాత, జగదీష్, మంగ, ఉమ, రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు..

### ఎన్నికలు వరకే పార్టీలు -రాజకీయాలు రామయ్యపట్నం సభలో హెూం మంత్రి అనిత



నక్కపల్లి, జూలై 13, ప్రభాతవార్త

పాయకరావుపేట నియోజకవర్గంలో అర్హులం దరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఎన్నికలు వరకే పార్టీలు-రాజకీయాలు చూడాలని అభివృద్ధి విషయంలో వాటిని అన్నింటిని పక్కనపెట్టి ప్రజా సంక్షేమం కోసం ఆలోచించే అభివృద్ధి చేయాలనే ఆలోచన తో ముందడుగు వేస్తున్నామని రాష్ట్ర హెూం మంత్రి అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా, యస్ రాయవరం మండలంలోని రామయ్యపట్నం గ్రామంలో హెూం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఆమెకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని శ్రీకృష్ణ రామాల యాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సుపరిపాలన 8వ పేజీలో

## మళ్లీ అదే తీరు..

### నియంతృత్వ పోకడలు విడిచిపెట్టని దేశం నాయకులు -అనకాపల్లి 84వ వార్డు సమావేశం రసాభాస -విరుచుకుపడిన తమ్ముళ్లు -అరుపులు కేకలతో దద్దరిల్లిన సమావేశం

అనకాపల్లి, జూలై 13, ప్రభాతవార్త

నేతి బీరకాయ చందంగా ఉంది అనకాపల్లిలో తెలుగు దేశం పార్టీ పరిస్థితి. క్రమశిక్షణ గల పేరున్న పార్టీ కాస్తా  బజారుకు ఈడ్చేసారు. నలుగురు నవ్వి పోతే మాకేంటి అనుకున్నారో ఏమో పార్టీ నియమ నిబంధనలను తుంగలో తొక్కి కమిటీని ఏకపక్షంగా ప్రకటించబోతే అది కాస్తా బెడిసికొట్టింది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన 84వ వార్డు సమావేశం రసాభాస గా మారి అరుపులు కేకలతో దద్దరిల్లింది. గతంలో 84వ వార్డు ఎన్నిక నిర్వహించడం, పార్టీ నియమావళి ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించలేదని, నియోజకవర్గ మహానాడు లో తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం 8వ పేజీలో



## ఆర్థిక పరిస్థితి బాగోలేక కిడ్నీలను అమ్ముకోవడానికి ప్రయత్నించిన వ్యక్తి


8లో

## విశాఖలో భారీ చోరీ

### గాజువాక షీలానగర్‌లోని ఎల్ఐసి ఉద్యోగి ఇంట్లో ఘటన -కేజీ బంగారం, 3 కేజీల వెండి, 20 లక్షల నగదు మాయం






(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖలో వరుస చోరీలతో జనం హడలిపోతున్నారు.. రెక్కి నిర్వహించీ మరీ నేరస్తులు చెలరేగిపోతున్నారు.. తాజాగా విశాఖ గాజువాక షీలానగర్ లో ఓ ఎల్ఐసి ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగిన విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. బీరువాలో ఉంచిన కేజీ బంగారం, 3 కేజీల వెండి,20 లక్షల నగదు, ఇతరు విలువైన వస్తువులను దొంగలు దోచుకుపోయినట్టు స్థానిక రాం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని  షీలా నగర్ లో గల వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 8 వద్ద గ్రూప్ హౌస్ లో ఎస్ శ్రీనివాసరావు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు ఎల్ఐసిలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాసరావు ఇంట్లో కొద్దీ రోజుల్లో పెళ్లి ఉండటంతో ఇంట్లో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ఏడు వాచీలు, పెళ్లికి సంబంధించిన పట్టుచీరలు, 20 లక్షల నగదు, విలువైన వస్తువులను ఉంచారు. ఈ సందర్భంగా ఇంటికి సున్నాలు వెయ్యడం వలన అందరూ రాత్రి ఇంటి బయట పడుకున్నారు. అయితే రాత్రి గ్రిల్స్ కట్ చేసి ఇంట్లోకి దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. తెల్లవారుజామున శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి గ్రీన్స్ కట్ చేసి ఉండడానికి గుర్తించి లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్టు తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించాలి. ఘటన స్థలానికి గాజువాక క్రైమ్ పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పద్ధతి మార్చుకోకపోతే తాట తీస్తాం..!



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

### రౌడీ షీటర్లకు పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్ -చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలే -సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు అన్నీ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

రౌడీ షీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి రౌడీ షీటర్లకు హెచ్చరించారు. జోన్-1 పరిధిలోని లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నార్త్ ఏసిపి అప్పలరాజు, ఈస్ట్ ఏసిపి లక్ష్మణ మూర్తి, ద్వారక ఏసిపి నరసింహమూర్తి వారి వారి పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లలో సంబంధిత అధికారుల చేత రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే జోన్ 2 పరిధిలోని లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు హార్బర్ ఎసిపి కాళిదాసు, సౌత్ ఏసిపి, వెస్ట్ ఎసిపి పృధ్వి రాజు  వారి వారి పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లో సంబంధిత పోలీస్ అధికారుల చేత రౌడీ శీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహింప చేశారు. అలాగే టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో సీఐలు భాస్కరరావు, అప్పలనాయుడు ఆధ్వర్యంలో రెండు జోన్లలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో పోలీస్ 8వ పేజీలో

## వాటర్ లైన్ ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా



గాజువాక, జులై 13, ప్రభాతవార్త

దశాబ్దాల కల పరిశ్రమలకు త్రాగు నీరు నెమ్మదిగా సాకారం అవుతుంది. ఆటోనగర్ బి బ్లాకు పరిశ్రమలకు త్రాగు నీటి కుళాయిలను నగర మేయర్ పీలా శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం బి బ్లాకులో పాత ఎస్ఆర్ఎంటీ వద్ద ప్రారంభించారు. ఈ సంద ర్భంగా టిడీపీ నాయకురాలు అన్నపూర్ణ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యేని కలిసిన తోకాడ మహిళలు స్థానిక సమస్యలు ఆయనకు వివరించారు. వారి సమస్యలు పరిష్కారం చేస్తానని ఎమ్మెల్యే వారికీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## చెడు ప్రవర్తన కొనసాగిస్తే నగర బహిష్కరణే

### సామాజిక బాధ్యతను గుర్తుంచుకోండి -రౌడీ షీటర్లకు నిర్వహించిన కౌన్సిలింగ్‌లో పెందుర్తి సీఐ సతీష్ కుమార్



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

తప్పుల్ని పునరావృతం చేయకుండా, చక్కటి ప్రవర్తనతో జీవించాలనీ రౌడీ షీటర్లకు పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ సూచించారు. విశాఖసిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఉత్తర్వుల మేరకు జోన్-2 డీసిపి మేరీ ప్రశాంతి సూచనలతో, వెస్ట్ సబ్‌డివిజన్ ఏసిపి పృధ్వి రాజు పర్యవేక్షణలో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని, నేరపూరిత ప్రవృత్తిని విడనాడి మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. ప్రవర్తనలో మార్పు రాని వారిపై నగర బహిష్కరణ, పీడీయాక్ట్ వంటి కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అంతేకాక, ఇప్పటికే కొంతమంది రౌడీషీటర్లు మంచి ప్రవర్తన కనబరుస్తున్నట్టు తెలుస్తోందని, అటువంటి వారిపై ఉన్న షీట్లు మూసివేయడానికి పై అధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు.చివరిగా, చెడు ప్రవర్తన కొనసాగిస్తే "ప్రమోషన్" రూపంలో నగర బహిష్కరణ లేదా పీడీయాక్ట్ వంటి చర్యలు తప్పవని కఠినంగా హెచ్చరించారు. రౌడీషీటర్లందరినీ తమ కుటుంబ గౌరవాన్ని కాపాడుకుంటూ సామాజిక బాధ్యతతో కూడిన జీవితం గడపాలని సూచించారు.

## విద్యార్థుల భవిష్యత్తు కాపాడడమే లక్ష్యం

### మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు -'సేఫ్ క్యాంపస్ జోన్' స్పెషల్ డ్రైవ్‌లో వన్ టౌన్ సిఐ జీడీ బాబు

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త )




విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈగల్ అధికారుల "సేఫ్ క్యాంపస్ జోన్" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పె క్టర్ జీ.డి.బాబు నాయకత్వంలో ఈగల్ సిబ్బం ది వరప్రసాద్, వన్ టౌన్ ఎస్ఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థల చుట్టుపక్కల పాన్ షాపులు, ఇతర షాపుల్లో నిషేధిత మత్తు పదార్థాలు వంటి సిగరెట్లు, గంజాయి, మద్యం, పాన్ పరాక్, గుట్కా తదితరాలను విద్యార్థులకు అమ్మ కుండా నిరోధించారు. పలు స్కూల్స్, కాలేజీల పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనుమానాస్పద షాపులపై దాడులు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు నమోదు చేసారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ జీ.డి.బాబు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కాపాడడమే తమ లక్ష్య మని అన్నారు. ఈ విధమైన చర్యలు ప్రతిరోజూ కొనసాగుతాయని తెలిపారు. స్కూల్స్, కాలేజీల సమీపంలో మత్తు పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ డ్రైవ్‌ను ఈగల్ విభాగం సమన్వయంతో విశాఖపట్నం సిటీ పోలీస్ విస్తృతంగా కొనసాగించనుందనీ తెలిపారు. ప్రజలు కూడా సహకరించి తమ పరిసరాల్లో ఉన్న ఇలాంటి అక్రమాలు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## కాట్పా చట్టం -2003 ప్రత్యేక డ్రైవ్

### బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయొద్దు -నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష -50 కాట్పా కేసులు, 15 ఓపెన్ డ్రికింగ్ కేసులు నమోదు : పెందుర్తి సిఐ సతీష్ కుమార్

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖలో పొగాకు నియంత్రణపై సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. బహిరంగ ప్రదేశాలలో పొగ త్రాగుట నిషేధమనీ, ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో పొగ త్రాగితే వారికి కాట్పా 2003 చట్టం కింద రూ.200 వరకు జరిమానా విధిస్తామనీ పోలీసులు ప్రజలకు అవగాహనా కల్పిస్తున్నారు. అలాగే కాలేజీలు, స్కూళ్లు వద్ద 100 మీటర్లు పరిసరాలలో పొగాకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇందులో భాగంగా ఆదివారం పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు జోన్-2 డీసీపీ మేరీ ప్రశాంతి సూచనలతో, వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృధ్వి రాజు పర్యవేక్షణలో పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ నేతృత్వంలో మొత్తం 7 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, కాట్పా చట్టం -2003 నిబంధనల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నాయుడుతోట నుండి మేఘద్రిగెడ్డ వరకు,నాయుడుతోట నుండి శంకర్ ఫౌండేషన్ హాస్పిటల్ గ్రౌండ్ వరకు, వెపగుంట నుండి అప్పన్నపాలెం, సింహపురి కాలనీ గ్రౌండ్ వరకు, కృష్ణరాయ పురం నుండి ఆర్టీసీ కాలనీ వరకు, సుజాతానగర్ జంక్షన్, పాపయ్యరాజుపాలెం, చిన్నముషిడివాడ జంక్షన్, వుడా కాలనీ, మార్కెట్ ఏరియా, పులగనిపాలెం నుండి జుట్టాడ ఓపెన్ ప్లేస్ వరకు, పెందుర్తి జంక్షన్, నరవ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో మొత్తం 50 కాట్పా కేసులు నమోదు చేసి, సంబంధిత వ్యక్తులపై జరిమానాలు విధించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 15 కేసులు నమోదు చేసారు. ఈ సందర్భంగా సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం చట్ట విరుద్ధమని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. విద్యాలయాల వద్ద 100 మీటర్ల వరకు పొగాకు సేవించడం, ఉత్పత్తులను అమ్మడం నిషేధమన్నారు. 18 ఏళ్ల లోపు వారికి పొగాకు వస్తువులను అమ్మరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.



## ప్రారంభానికి మోక్షమెప్పుడో..!

### ప్రారంభానికి నోచుకోని రైతు బజార్ -అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న వైనం -అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్న రైతు బజార్



ఆరిలోవ, జులై 13, ప్రభాతవార్త

ఎన్ని ప్రభుత్వాలు మారినా... ఎంతమంది ప్రజాప్రతినిధులు మారిన ఆరిలోవ ప్రాంత ప్రజలు కష్టాలు మాత్రం తీర్చే నాధుడే లేరు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాల మారుతున్న మా బ్రతుకులు మాత్రం మారడం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. అసలు విషయానికి వస్తే... సుమారు రెండు లక్షలు జనాభా కలిగిన ఆరిలోవ ప్రాంతంలో రైతు బజార్ లేక దూర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేస్తూ నానా అవస్థలు పడుతున్నారు ఆరిలోవ ప్రజలు. గత ప్రభుత్వంలో మాజీ మేయర్ చొరవతో రైతు బజార్ నిర్మాణం కొరకు లక్షల రూపాయల వెచ్చించి విమ్స్ ఆసుపత్రి స్థలానికి ఆనుకొని సుమారు ఎకరం స్థలంలో రైతు బజార్ నిర్మించేందుకు నిర్మాణ పనులు చేపట్టారు. అప్పటి ప్రభుత్వం సరి వేగంగా రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసి ఆరిలోవ ప్రజలకు అందుబాటులో తీసుకురావాలనే ఆలోచన దిశగా పనులు వేగవంతం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ప్రారంభానికి నోచుకోక ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. అయితే ప్రభుత్వం మారి ఏడాది దాటినా స్థానిక ఎమ్మెల్యే మాత్రం అటువైపు చూసే దాకాలే లేవని, ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా దర్శనమిస్తుందని ఆ ప్రాంత ప్రజలు నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వంలో పూర్తి చెయ్యరా... అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక అధికార పార్టీ నాయకులకు కూడా ఈ విషయంపై నోరు విప్పకపోవడం గమనార్థం. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని ప్రారంభానికి నోచుకోని రైతు బజార్ను ప్రారంభించి ఆరిలోవ ప్రజల కోరికను నెరవేరుస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

### చీకటి పడితే మందుబాబులు చిందులు...

రైతు బజారు నిర్మాణం పూర్తి అయినా.. ఖాళీగా ఉండడంతో చీకటి పడితే రైతు బజార్ షెడ్డుల్లో అసాంఘిక కార్యకలాపాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. చీకటి పడితే మందుబాబులు చిందులు వేస్తూ మద్యం సేవించి సీసాలు వదిలి వెళ్ళడంతో పదుల సంఖ్యలో మద్యం బాటిల్లో దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాంత మంతా మందుబాబులకు అడ్డాగా మారుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మంచి ప్రవర్తనతో జీవించండి

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలే -రౌడీ షీటర్ల కౌన్సిలింగ్‌లో వన్ టౌన్ సీఐ జీడీ బాబు



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

తెలుసుకోకో.. తెలియకో చేసిన తప్పులు మీ జీవితాన్ని నాశనం చేయకూడదనీ, ఇక మీదట మంచి ప్రవర్తనతో జీవించా లనీ రౌడీ షీటర్లకు వన్ టౌన్ సిఐ జీడీ బాబు సూచించారు. ఆదివారం వన్ టౌన్ పీఎస్‌లో ఆయన రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాలు దూరంగా పెట్టాలన్నారు. మీ కుటుంబ సభ్యుల నమ్మకాన్ని పోగొట్టకుండా, సమాజంలో మంచిపౌరులుగా మారాలని రౌడీ షీటర్లకు హితవు పలికారు. ఇకపై చట్ట వ్యతిరేక కార్యక్రమాలలో ఎవరైనా పాల్గొంటే పీడీ యాక్ట్ నమోదు చేసి, అవసరమైతే ఫిట్ ఎన్డీపీఎస్ యాక్ట్ ను నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రౌడీషీట్ల చేత ప్రమాణ స్వీకారం చేయించి, మనోవృత్తిలో మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. "ఎవరైనా గొడవలు, కొట్లాటలు చేస్తే తాట తీస్తాం" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, హెచ్సి శ్రీనివాస్, కానిస్టేబుల్ రెడ్డి తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి

### 7 గురు జూదరులు అరెస్ట్ -రూ.25 వేలు నగదు స్వాధీనం

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ నగరంలో అసాంఘిక కార్యాలపాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. డ్రగ్స్, జూదం, వ్యభిచార నేరాలకు పాల్పడు తున్న వారిపై నిఘా వేసి కొరడా ఝుళిపిస్తున్నారు. తాజాగా పేకాట స్థావరం దాడి చేసి జూద రులు అరెస్ట్ చేసారు. టాస్క్ ఫోర్స్ సీఐ భాస్కర రావుకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి జ్ఞానాపురంలో ఓ పేకాట స్థావరం పై ఆదివారం దాడి చేసారు. ఈ మేరకు అక్కడ జూద ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 25 వేలు స్వాధీనం చేసుకొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను సంబంధిత పోలీసులకు అప్పగించారు.

## హెల్మెట్ ధరించకపోతే ఉపేక్షించం

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే -శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్షణ -పిఎంపాలెం ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణంతో తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని పిఎంపాలెం ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ సూచించారు. ఆదివారం ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు ఆయన హెల్మెట్ వినియోగంపై ద్విచక్రవాహనదారులకు అవగా హనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించేటపుడు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. బైక్ నడిపే వ్యక్తిగానీ, వెనుక కూర్చున్న వ్యక్తిగానీ, ఇద్దరిలో ఏ ఒక్కరు హెల్మెట్ ధరించకపోయినా రూ.1035 చలానా విధించబడునని అన్నారు. హెల్మెట్ ధరించకుండా బైక్ నడిపి, ప్రమాదానికి కారణమైనట్లయితే డ్రైవింగ్ లైసెన్స్, మూడు నెలల పాటు సస్పెండ్ చేయబడునని అన్నారు.

## పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు..

7వ తరువాయి ..

ఆయన 6వ జోన్ 65, 71, 86 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాజువాక శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్లు బొడ్డు నరసింహ పాత్రుడు, రాజాన రామారావు, లేళ్ల కోటేశ్వరరావు, తెలుగుదేశం డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన గాజువాక అభివృద్ధికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. 65 వార్డు ప్రియదర్శిని కాలనీ, విశాఖ నగర్ సంజీవయ్య గిరి కాలనీ, అశోక్ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ.5.55 కోట్ల వ్యయంతో విఆర్‌సిసి డ్రైన్లు, రిటర్నింగ్ వాల్స్, తాగునీటి పైపులైన్లు పలుచోట్ల నిర్మాణ పనులకు, 71వ వార్డు ఆటోనగర్‌లో సుమారు రూ.49.60 లక్షల వ్యయంతో తాగునీటి పైప్లైన్‌లకు, 86వ వార్డు పరిధిలో పలుచోట్ల సుమారు రూ.1.54 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, ఆర్‌సిసి డ్రైన్, సీసీ కల్వర్టులు, విఆర్‌సిసి బాక్స్ కల్వర్టులు నిర్మాణానికి జీవీఎంసీ నిధులతో శంకుస్థాపన చేసా మని తెలిపారు. గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ అభివృద్ధిలో గాజువాక నియోజక వర్గం రాష్ట్రం లోనే మొదటి స్థానం ఉండేలా నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. గాజువాక లోని ప్రతి వార్డును అంచెలంచెలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టడం జరుగుతుం దని తెలి పారు. 65, 71, 86 వార్డులలో సుమారు రూ.7.59 కోట్ల వ్యయంతో రోడ్లు ,కాలువలు, కల్వర్టు, రిట ర్నింగ్ వాల్స్, తాగునీటి పైప్లైన్‌లకు నగర మేయర్‌తో కలిసి శంకుస్థాపన చేసామని, రాష్ట్ర ముఖ్యమంత్రి అనునిత్యం రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆయన పాలనలో అభివృద్ధి, సంక్షేమము రెండు సమదృష్టితో పరిపాలన చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. జీవీఎంసీ 6వ జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రి, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు ఎమ్.ఆర్.ఎస్ ప్రసాద్, సహాయక ఇంజనీరు కేదార్ నాథ్, పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులందరికి పార్టీలకతీతంగా..

7వ తరువాయి ..

తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ముందుగా రామయ్యపట్నంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, వారి సమస్యలు నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఇప్పుడు ఎన్నికల సమయం కాదని, ప్రజల యోగక్షేమాలు తెలుసు కోవడానికే వచ్చానని చెప్పారు. ప్రజలు నన్ను మంచి మెజారిటీతో గెలిపించి మంత్రిగా చేశారని,మరింత బాధ్యత పెరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని, అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఎలాంటి కష్టాలు ఎదురైనా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమవుతుందని, కొద్ది రోజుల్లో ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించనున్నట్టు తెలిపారు. రామయ్య పట్నంలో సర్పంచ్ తీర్మానాలు ఇవ్వకపోవడం వలన గ్రామం అభివృద్ధిలో వెనుకంజలో ఉందని, గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి ముందుకు రావాలని,నేను పూర్తిగా సహకరిస్తానని మంత్రి చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో టాయ్ పరిశ్రమ వస్తే, 25 వేల మంది మహిళలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ లాంటి పరిశ్రమల వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకా శాలు ఏర్పడనున్నాయని మంత్రి అనిత వివరించారు. మండల పార్టీ అధ్యక్షులు అమల కంటి అబద్దం ఆధ్వర్యంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగులు కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ గడ్డం బుజ్జి, జిల్లా మండల పార్టీ నాయకులు వి. వినోద్ రాజు, అల్లు నరసింహమూర్తి ,గుర్రం రామకృష్ణ, నల్లల వెంకటరాజు, కోన అప్పలరాజు ,నాయుడు, చంద్రావు, రమా కుమారి తదితరులు ఉన్నారు.

## ఆర్థిక పరిస్థితి బాగోలేక ..

విశాఖ క్రైమ్ -ప్రభాతవార్త

ఆర్థిక పరిస్థితి బాగోలేక కిడ్నీలను అమ్ముకోవడానికి సాహసించిన ఇద్దరిని నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గత నెల 30న ఉదయం 9 గంటలకు అక్కయ్య పాలెంలోని బేకన్ హోటల్ నుండి ఎవరో ఇద్దరు వ్యక్తులు కిడ్నీ అమ్ముకోవడానికి చర్చించుకుంటారని తెలిసి స్థానిక పోలీసుల కు సమాచారం అందజేశారు. దీంతో వారిద్దరని పోలీస్ స్టేషన్కు తీసుకొని వచ్చి పోలీసులు మాట్లాడారు. ఏలూరు జిల్లాకు చెందిన కట్టా రంగబాబు, సిహెచ్ యేసు రాజు ఇద్దరు స్నేహితులు. వైజాగ్‌లో ఒక వ్యాన్ ఉం దని తీసుకొని రావాలని రంగ బాబు, ఏసుబాబుతో చెప్పి విశాఖకు వచ్చారు. యేసు రాజుకు అనుమా నం వచ్చి రంగబాబును వాన్ కోసం అని చెప్పి హొటల్‌కి ఎందుకు తీసుకొచ్చావని అడగగా, తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని తన కిడ్నీలు అమ్మేద్దామని బదులిచ్చాడు. ఈ విషయం ఇంట్లోవారికి చెప్పావా అని అడగగా అతను చెప్పలేదని చెప్పాడు. వెంటనే రంగబాబు భార్యకు యేసు రాజు ఫోన్ చేయగా విషయం తెలిసి ఆమె అతనిని మందలించింది. వీరిద్దరి సంభాషణలు విని, హొటల్ వారు పోలీస్‌కు సమాచారం అందజేయడంతో పోలీ సులు వారిద్దరినీ స్టేషన్లో విచారించి పంపించి వేశారు. దీనిపై విచారణ చేస్తున్నట్టు పోలీసులు చెప్తున్నారు.

## మళ్లీ అదే తీరు..

7వ తరువాయి ..

చేయడంతో ఆ కమిటీని రద్దు చేసి మరోసారి నిర్వహిస్తామని అప్పటికి ప్రకటించి వివాదాన్ని తాత్కాలికంగా సద్దు మణిగేలా చేసారు. వాయిదా పడిన ఆ సమావేశం ఆదివారం సాయంత్రం కోట్నివీధి రామాలయంలో నిర్వహించారు. నాయకుల్లో ఏమైనా మార్పు వచ్చిందేమో, పార్టీ నియమావళి మేరకు సమావేశం జరుగుతుం దని పార్టీ శ్రేణులు భావించారు. కానీ మళ్లీ అదే తీరుగా ఏకపక్షంగా కమిటీ ఎన్నిక జరుగుతుండడంతో పార్టీ శ్రేణులు నిలదీశారు. పార్టీలో కీలక నాయకులు దాడి వీరభద్రరావు, బుద్ద నాగ జగదీశ్, దాడి రత్నాకర్ లేకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. కమిటీ ఎన్నిక పార్టీ నియమావళి ప్రకారం ప్రజాస్వామ్య యుతంగా నిర్వహించండి....అంతేకాని కమిటీని ప్రకటించడం ఏమిటి? పార్టీ పరిశీలకుడు అచ్చం నాయుడు వార్డులోని 18 బూత్‌ల ఇన్చార్జిలు, నాయకులను సంప్రదించకుండా కమిటీ ప్రకటన ఏమిటని నిలదీశారు. ఏకపక్షంగా జరుపుతున్న ఈ ఎన్నికను తాము అంగీకరించేది లేదని, సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహంతో వెనుదిరిగారు. విచిత్రం అయిన విషయం ఏమిటంటే పార్టీలో గ్రూపులను, వర్గాలను రూపుమాపాల్సిన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పీలా గోవింద, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు లు ఒక వర్గానికి కొమ్ము కాయడం, పార్టీ నిబంధనలు తుంగలో తొక్కారని బాహాటంగానే పార్టీ శ్రేణులు విమర్శించారు. ఒక నెలరోజులలో పార్టీ పదవులు ఎలానూ పోతాయి కనుక తమ వర్గీయులను అందలం ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారని, విషయం పార్టీ అధినేత దృష్టికి తీసుకువెడతామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ లో సభ్యత్వం లేనివారిని కూడా తమకు మద్దతుగా తీసుకువచ్చి కొత్త సంప్రదాయానికి తెర తీస్తారని పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పద్ధతి మార్చుకోకపోతే ..

7వ తరువాయి ..

అధికారులు మాట్లాడుతూ నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించేవారిపై గట్టి నిఘా ఉంటుందని హెచ్చరించారు.. సరైన నడవడికతో ఉండాలని ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు చేయుద్దని హెచ్చరించారు. నేరాలు, దౌర్జన్యాలు, అక్రమాలు, బెదిరింపులకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రౌడీషీటర్లంతా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండేలా ప్రతీ ఒక్కరూ ఆదివారం పోలీస్ స్టేషన్లో సంతకాలు చేసి వెళ్లాలని సూచించారు. జీవించడానికి సదరు వ్యక్తులంతా ఏయే వృత్తుల్లో ఉన్నారు అనే విషయాలను నమోదు చేసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. రౌడీ షీటర్లు ఎటువంటి శాంతి భద్రతల సమస్య సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని సూచించారు. సత్ప్రవర్తన కలిగినవారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేది స్తామని వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. అలాగే, మంచి ప్రవర్తన చూపిస్తూ చట్టాన్ని గౌరవించే రౌడీషీటర్లకు ప్రోత్సాహం అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. అవసరమైతే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు..

### రౌడీ షీటర్లకు టాస్క్ ఫోర్స్ పోలీసుల కౌన్సిలింగ్..

సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు టాస్క్ ఫోర్స్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షింది లేదని ఈ సందర్భంగా రౌడీ షీట ర్లకు హెచ్చరిం చారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆదేశాలు, సూచన లను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తా మని హెచ్చరించారు. అనుమానితుల కదలిక లను పోలీస్ శాఖ గమ నిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందన్నారు. విశాఖను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు పాత నేరస్థులు, సస్పెక్ట్ షీటర్లకు,రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చినట్టు టాస్క్ ఫోర్స్ సీఐలు భాస్కరరావు, అప్పలనాయుడు ప్రభాత వార్తకు తెలిపారు.

CLASSIFIEDS
వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I Ambavaram Subbaranamma (Old Name) w/o Ambavaram Sivakesava Reddy R/o Flat 302, Yaksha Square, Boyapalem, VSKP, A.P., 531163, I have changed my name as Ambavaram Subbaratnam (New Name).Hereafter my name is known as **Ambavaram Subbaratnam** (New Name).
(Ro.No.14045)

★ I, DASARI SUBRAHMANYAM S/O DASARI SUBBARAO, previously called MOHAMMAD IBRAHIM AHMED R/O 1-189, RANGA VEEDHI, TYAJAMPUDI, DEVARAPALLI, EAST GODAVARI, now changed my name from MOHAMMAD IBRAHIM AHMED to DASARI SUBRAHMANYAM. Henceforth I will be called as **DASARI SUBRAHMANYAM** for all purposes.
(Ro.No.14170)

★ I, VENKATA NAVEEN KUMAR S/O GURALA VENKATA RAO previously called GURALA NAVEEN KUMAR R/O DU 50, NAVAL OFFICERS MESS, SCINDIA JUNCTION, VIZAG now changed my name from GURALA NAVEEN KUMAR to VENKATA NAVEEN KUMAR. Henceforth I will be called as **VENKATA NAVEEN KUMAR** for all purposes.
(Ro.No.14167)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## బెల్ట్ షాపులపై దాడి.. వ్యక్తి అరెస్ట్.!



నక్కపల్లి, జూలై 13 ప్రభాతవార్త

మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక ఇంటిపై ఆదివారం ఎస్సై సన్నిబాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. దూళి అనంత రావు ఇంటిలో అక్రమంగా 31 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై సన్నీ బాబు తెలిపారు. ఆయనతోపాటు కానిస్టేబుల్ బంగారి ,హోంగార్డ్ రాజు ఉన్నారు.

## చిక్కాల శ్రీనును సత్కరించిన రైతులు..

పాయకరావుపేట, జూలై 13 ప్రభాతవార్త



పాయకరావుపేట పిఏసిఎస్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన చిక్కాల శ్రీను మండలంలోని మాసావ్ పేట గ్రామానికి చెందిన రైతులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి ఘనంగా సత్కరించారు. రైతులకు అండగా ఉంటారని శ్రీను హామీ ఇచ్చారు.

## మీగడ సత్తిబాబును పరామర్శించిన గంటా శ్రీనివాసరావు



నక్కపల్లి,జూలై 13 ప్రభాతవార్త

టిడిపి యువ నాయకుడు, ఉత్తరాంధ్ర మెగా ఫ్యామిలీ సభ్యులు మీగడ సత్యనారాయణ మూర్తిని మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు ఘంటా శ్రీనివాసరావు పరామర్శించారు. మీగడ సత్తిబాబు రెండు రోజుల క్రితం ఇంటి వద్ద కాలుజారి కింది పడిన సందర్భంలో తొడ ఎముక విరిగి విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో సర్జరీ అయిన విషయం తెలిసినదే.! ఈ విషయం తెలుసుకున్న గంటా శ్రీనివాసరావు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి జరిగిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు సత్తిబాబును పరామర్శించిన వారిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మేడేటి శంకర్, వీసం శ్రీనుతో పాటు పలువురు పరామర్శించారు.

## పోలిమేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, జూలై 13, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధిలోని రామారాయుడుపాలెం గ్రామానికి వెళ్లే దారిలో గల పోలిమేరమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే సుందర విజయకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులతో ఆశీర్వాదం స్వీకరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఊటా కూటి రమేష్, నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రి రూప్సీ తదితరులు పాల్గొన్నారు.

## యానాద్రి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



ఎలమంచిలి, జూలై 13, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని అల్లూరి సీతారామ రాజు కాలనీలో వెలసిన యానాద్రి అమ్మ జాతర మహోత్సవం ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుండే భక్తులు బారులు తీరి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, రవిక సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక క్యూలైన్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రి రూప్సీ, సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ

ఎలమంచిలి, జూలై 13, ప్రభాతవార్త




నియోజకవర్గంలో అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామంలో సుపరి పాలన తొలి ఇంటింటికి తెలుగుదేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు సారధ్యంలో కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలం పాటు సుపరిపాలన అందించిందని, అనకాపల్లి నుండి అచ్యుతాపురం వరకు రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రహదారి నిర్వాసితులకు న్యాయం చేస్తామని, హరిపాలెం గ్రామానికి చెందిన పలమరశెట్టి కిరణ్ కు సీఎం సహాయనిధి 1,79,000 చెక్కును అందజేశారు. రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి ఏంటో ఈ ఒక్క సంవత్సరం కాలంలోనే అర్థమైందని, గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని, ఈ ప్రభుత్వంలో వికాసం వైపు అడుగులు పడుతున్నాయని, తల్లికి వందనం పథకం కింద చదువుకునే ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు అందించడం జరిగిందని, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, ఈ మాట ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని, నెలరోజుల పాటు సుపరిపాలన కార్యక్రమంపై ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబునాయుడు చేయుచున్న కార్యక్రమాలపై ప్రచారం చేస్తామని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు పీలా తులసిరాం , మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, సీనియర్ నాయకులు కాండ్రేగుల సూర్యనారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు దేశం శెట్టి వెంకటరమణ, నియోజవర్గ ఐటీడీపీ ఇన్చార్జ్ పతివాడ చిన్నయ్య నాయుడు ,కాండ్రేగుల జోగినాయుడు, గ్రామ శాఖ అధ్యక్షులు కాండ్రేగుల అప్పారావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, యూనిట్ ఇన్చార్జులు రాంప్రసాద్, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

### సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి

## 85వ వార్డు పరిశీలకులుగా కల్లిపల్లి శ్రీనివాస వర్మ

### అభినందించిన 85 వార్డు టిడిపి నాయకులు

అగనంపూడి, జూలై 13 ప్రభాతవార్త



జీవీఎంసీ 85 వార్డ్ టిడిపి నాయకులు విస్తృత కార్యకర్తల సమావేశం పెదమడక శ్రీ పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో 85 వార్డుకి సుపరిపాలన తొలిగొడుగు కార్యక్రమానికి పరిశీలకులుగా వచ్చిన సీనియర్ టిడిపి నాయకులు మాజీ విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కల్లిపల్లి శ్రీనివాస వర్మని ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్ వార్డు టిడిపి అధ్యక్షులు కర్రీ దశంద్ర ఏడిని చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, వార్డు ముఖ్య నాయకులు ఘనంగా సన్మానించిరి. కల్లిపల్లి శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలనకు వచ్చి సంవత్సరం అయిన సందర్భంగా సూపర్ పరిపాలన తోలిగడుగు కార్యక్రమములో టిడిపి శ్రేణులంతా పాల్గొని ఈ సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేసినా కార్యక్రమాలు భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలు ప్రజలకు డోర్ టు డోర్ వెళ్లి తెలియజేయాలని అన్నారు స్థానిక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు 85 వార్డు అధ్యక్షులు ఆప్త నమ్మకం ఉంచి 85 వార్డుకు నన్ను పరిశీలకులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ వార్డు కమిటీ కార్పొరేటర్ సమన్వయంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచనల మేరకు 85 వార్డు అభివృద్ధికి సిబ్బందిగా కార్యక్రమాలు నిర్వహణకు పని చేస్తామని అన్నారు. 85 వార్డు కమిటీ అధ్యక్షులు కర్రి దశంద్ర సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడిని చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి పిందుల రాజు వార్డు తెలుగు యువత అధ్యక్షులు బందారు చంద రమేష్, వార్డు తెలుగు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం నూకరాజు కనిపల్లి శ్రీనివాసరావు కొర్రాయి జగదీష్ కడవల రమణ గొద్దు గురుమూర్తి మొల్లి కోటేశ్వరరావు వడ్డాది శ్రీనివాసరావు డొక్కా రమేష్ మేడిశెట్టి వెంకటేశ్వరరావు గంతకోరు సత్యవతి గోపిశెట్టి పద్మ మరియు టిడిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం..

నక్కపల్లి, జూలై 13, ప్రభాతవార్త

మండలంలోని వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గొడిచెర్ల ఫీడర్ నందు పలు అభివృద్ధి పనుల నిమిత్తం పలు గ్రామాలకు వెళ్లే ప్రదేశాల్లో మరమ్మతులు కారణంగా విద్యుత్తు సరఫరాకు కొంత స్వల్ప అంతరాయం ఏర్పడుతుందని డిఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏఈ శనివారం సాయంత్రం తెలిపారు. ఆ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలు ఉద్దండపురం, జి.జగన్నాధపురం, చేరుకొత్తూరు, యు. జానకయ్యపేట, వేంపాడు, కొత్తూరు, గుల్లిపాడు దైర్య స్టేషన్, చిన్న రామభద్రపురం గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 5:00 గంటలు వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

## పిఏసిఎస్ అధ్యక్షులను సత్కరించిన హోం మంత్రి 'అనిత'



నక్కపల్లి, జూలై 13 ప్రభాతవార్త

పాయకరావుపేట మండలం నామవరం, ఎస్. రాయవరం మండలం పెనుగొల్లు పిఏసిఎస్ అధ్యక్షులు ఎన్నికైన గెద్దం కన్నబాబు, రెడ్డి నవీన్‌లను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత జనసేన పార్టీ పాయకరావుపేట నియోజక వర్గం కన్వీనర్ గెద్దం బుజ్జి నాయకత్వంలో సత్కరించారు. టిడిపి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసి నాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఉన్నారు.

## కేశవ స్వామి ఆలయంలో ఘనంగా అన్న సమారాధన

చోడవరం, జులై 13, ప్రభాతవార్త:



చోడవరం శ్రీ కేశవస్వామి ఆలయంలో ఉపాలయంగా కొలువై యున్న బలభద్ర సుభద్ర సమేత శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం గుడిలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.సుమారు 1500మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సుదర్శనం సీతారామాచార్యులు, శివాలయం చైర్మన్ గూనూరు సురేష్, తెలుగుదేశం, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, బ్యాంకు రాము, కృష్ణారావు, తాతాజీ, కోనేటి రాజు, వీరభద్రరావు మాస్టారు, సుధాకర్, బుజ్జి, సత్యారావు, ప్రసాదరావు మాస్టారు, భూలక్ష్మి, వసంత, వందన, లక్ష్మి, సత్యమణి, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి దేవిగా దర్శనమిచ్చిన వాసవి మాత



చోడవరం, జూలై 13, ప్రభాతవార్త

చోడవరం వాసవి మాత ఆలయంలో వేంచేసియున్న ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆషాడ బహుళ విద్య పరచుకరించుకొని ఆదివారం శాఖంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు పళ్ళు ఆకుకూరలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అన్నికి మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం దంపతులచే ఒడిబియ్యం సమర్పించి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు

## సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేసిన హోం మంత్రి అనిత



నక్కపల్లి, జూలై 13, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన చెక్కును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా నక్కపల్లి క్యాంప్ కార్యాలయం వద్ద నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన దేవవరపు గోవిందురావుకు (12,43,188) (పన్నెండు లక్షల నలభై మూడు వేల నూట ఎనభై ఎనిమిది రూపాయల) చెక్కును పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో ఆదివారం పంపిణీ చేశారు.ఆపదలో ఉన్న వారిని ఆదుకోనేందుకే సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతోందని మంత్రి అనిత అన్నారు. దేవరపు గోవిందరావు గత ప్రభుత్వ హయాంలో యశోద హాస్పిటల్ హైదరాబాద్ నందు చికిత్స పొంది ఉన్నారని, అప్పట్లో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసినప్పటికీ అవకాసం లేకుండా పోయిందని, ఈ విషయాన్ని వెంకటేష్ దృష్టికి తీసుకురావడంతో మంజూరుకు ముఖ్యమంత్రికి కోరడం జరిగిందని, స్పందించిన ముఖ్యమంత్రి ఇంత పెద్ద మొత్తంలో అందజేశారని చెప్పారు. సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి గోవిందు కుటుంబాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత చేసిన కృషి మరిచిపోలేమని, అందుకు అన్ని విధాలుగా సహకరించిన కొప్పిశెట్టి వెంకటేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, కూటమి నాయకులు అడపా గణేశ్వరరావు, గుండు పిల్లి గోవిందు, డి.ఉమామహేశ్వరరావు, సకుర్తి సత్తిబాబు, కొప్పిశెట్టి అప్పారావు, పోతంశెట్టి గణేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## అదాని స్మార్ట్ మీటర్లు వద్దు.. పెంచిన విద్యుత్తు చార్జీలు రద్దు

రాంబిల్లి, జూలై 13, ప్రభాతవార్త



రాంబిల్లి మండలంలో అదాని ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు తమ ఇళ్లకు బిగించకుండా తిరస్కరించాలని అనకాపల్లి జిల్లా సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శంకర్రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు, స్మార్ట్ మీటర్లు వద్దు పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని పత్రికలను ప్రచురించి గోడలకు అంటించారు, ప్రజలు తాము వినియోగించిన విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు, విద్యుత్ సంస్థ తాము బిగించిన మీటర్ల రీడింగ్ సిబ్బంది ద్వారా తీయిస్తూ బిల్లులు వసూలు చేస్తుంది, ఎటువంటి ఆటంకము లేకుండా జరుగుతున్న ఈ ప్రక్రియను అదాని ప్రయోజనాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం మారుస్తుందని దుయ్యబట్టారు, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఇప్పటికే పరిశ్రమలకు వాణిజ్యసముదాయాలకు బిగించారు, ఇప్పుడు సామాన్య ప్రజల ఇళ్లకు బిగించడానికి సిద్ధమయ్యారు, ఈ మీటర్ల తయారీ కూడా అదాని కంపెనీ చేస్తుంది అని అన్నారు, ఈ మీటర్లు కనుక ఇళ్లకు బిగిస్తే సింగిల్ ఫేజ్ కు రూ 8900లు త్రీ ఫేజ్ కు రూ 17200లు 93 నెలల్లో మనకు తెలియకుండానే బిల్లుల్లో యాడ్ చేసి తీసుకుంటారు, స్మార్ట్ మీటర్ల వలన సుమారుగా 25వేల కోట్ల రూపాయలు భారం రాష్ట్ర ప్రజలపై పడుతుంది, ఇంతవరకు విద్యుత్ బిల్లు వచ్చాక 15 రోజులు గడువు ఉండేది ఇప్పుడు మొబైల్ ఫోన్ రీచార్జ్ చేసుకున్నట్టు కరెంటు మీటర్ కు కూడా రీఛార్జ్ చేసుకొని ఉంచుకోవాలి. బ్యాలెన్స్ ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి, లేకుంటే బ్యాలెన్స్ అయిపోయిన మరుక్షణం మన ఇల్లు చీకటి అవుతుంది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి, జనసేన, బిజెపి విద్యుత్ బారాలను వ్యతిరేకించాయి, గతంలో మంత్రి నారా లోకేష్ కూడా అదాని స్మార్ట్ మీటర్లు బిగిస్తే బద్దలు కొట్టమని ప్రజలకు పిలుపునిచ్చారు అని గుర్తు చేశారు. సిపిఎం మండల కార్యదర్శి జి. దేవుడు నాయుడు, చందక రామకృష్ణ, ఎన్ నారాయణరావు, రుత్తల రాంబాబు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



## ట్రిబుల్ ఐటీకి తాళ్లపాలెం గాయత్రి స్కూల్ విద్యార్థిని ఎంపిక

కసింకోట, జూలై 13, ప్రభాతవార్త

మండలంలోని తాళ్లపాలెం శ్రీ గాయత్రీ హైస్కూల్ 2024-25 పదవ తరగతి విద్యార్థిని కోన బేబీ భవిష్య ఏపీ ఆర్‌జియు కేటి ట్రిబుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదివారం తెలిపారు. విద్యార్థిని బేబీ భవిష్యను ఉపాధ్యాయులు అభినందించారు.

## చాపరాయిలో పర్యాటకుల తాకిడి

డుంబ్రిగుడ రూరల్, జూలై 13, ప్రభాతవార్త



ప్రముఖ పర్యాకట కేంద్రం చాపరాయి జపాతం వద్ద ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యటకులు తరలిరావడంతో జలపాతం వద్ద సందడి నెలకొంది. చాపరాయి జలపాతంవద్ద కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ ఎంతో సందడి చేస్తూ జలపాతం వద్ద ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ కుటుంబ సమేతంగా ఎంతో ఉల్లాసంగా గడపారు. అంజోడా ప్లీనరీ వద్ద ఎంతో సందడి చేస్తున్నారు. ఇక్కడ వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారాలకు ఆర్థికంగా ఎంతో లాభాలు వస్తున్నాయని చిరు వ్యాపారాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పాడేరు శాసనసభ సభ్యులు, అరకు పార్లమెంట్ సభ్యులు నేడు చింతపల్లికి రాక

చింతపల్లి, జూలై 13, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా వైయస్సార్ పార్టీ గౌరవ అధ్యక్షులు మరియు శాసనసభ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు మరియు అరకు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గుమ్మ తనుజరాణి నేడు చింతపల్లి రానున్నారని ఎంపీపీ కోరాబు అనుష దేవి,జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ్యులు మరియు పార్లమెంటు సభ్యులు ఉదయం 11 గంటలకు చింతపల్లి చేరుకుంటారన్నారు. ఎంపీపీ నిధులతో మంజూరైన వీధి దీపాలు పంపిణీ మరియు 40 లక్షల రూపాయలు తో కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని ఎంపీటీసీలు ,సర్పంచులు ,సీనియర్ నాయకులు ,వార్డు సభ్యులు, వివిధ అనుభంద సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్యా పుష్పలత, కో ఆప్షన్ నెంబర్ నాజర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాలు దిద్దవలిసిన పసివయసులో ఆవులు కాస్తున్నారు..

### దిగజనభ గ్రామంలో ఉపాధ్యాయుని నియమించండి.. అధికారులకు గ్రామస్తుల వేడుకోలు

చింతపల్లి, జూలై 13, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం, బలపం పంచాయితీ లోని దిగజనాబా గ్రామంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో బలపం పట్టి అక్షరాలు దిద్దవలసిన వయసులో ఉన్న చిన్నారులు ఆవులు కాస్తున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలలో చక్కగా విద్యనభ్యసిస్తూ ఉండవలసిన పిల్లలు రోడ్ల చుట్టూ పొలాల చుట్టూ తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నప్పటికీ పిల్లలు ఇప్పటికీ పాఠశాల ముఖం చూడలేదన్నారు. తమ పిల్లలను ఇలాగే వదిలేస్తే ఎందుకు పనికిరాని వారిగా తయారవుతారని వారు వాపోయారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే తమ గ్రామమైన దిగజనుబ లో ఉపాధ్యాయుని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పేద విద్యార్థుల సేంద్రీయ వ్యవసాయ కళాశాల విద్య, పేద విద్యార్థులకు అందని ద్రాక్ష అయ్యింది..

### చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత



చింతపల్లి, జూలై 13, ప్రభాతవార్త

చింతపల్లిలోని ఆచార్య రంగా విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ పేద గిరిజన విద్యార్థులకు అందని ద్రాక్షగా అయ్యిందని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2011వ సంవత్సరంలో ప్రారంభించబడిన వ్యవసాయ పాలిటెక్నిక్ అనేకమంది పేద విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్తును ఇచ్చిందన్నారు. ప్రారంభం తొలినాటి నుంచి కడప తిరుపతి ఖమ్మం వంటి సుధీర ప్రాంతాల నుంచి అనేకమంది పేద విద్యార్థులు వ్యవసాయ విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలలో ఉన్నారని ఆమె అన్నారు. ప్రస్తుత రోజులలో పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందని పుల్లని ద్రాక్షగా ఉందని, సేంద్రీయ వ్యవసాయ పై మక్కువతో పాలిటెక్నిక్ లో ప్రవేశం పొంది ఆ విద్యను పూర్తి చేసుకొని తల్లిదండ్రులకు ఆసరాగా నిలబడే పరిస్థితి ఉండేదన్నారు. నిరుపేద తల్లిదండ్రులకు ఇటువంటి ఆర్గానిక్ పాలిటెక్నిక్ విద్య ఎంతో సహాయపడుతుందని ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న పాలిటెక్నిక్ ను ఎత్తివేస్తే నిరుపేద విద్యార్థులు ఎలా చదువుకోగలరు అని ఆమె ప్రశ్నించారు. గిరిజన మరియు పేద విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపకరించే సేంద్రీయ వ్యవసాయ విద్య అందుబాటులో ఉండే విధంగా, యధావిధిగా వ్యవసాయ పాలిటెక్నిక్ ను కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు హేమంత్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## శ్రీఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి వెండి నామాలు, తాడు వితరణ

పాడేరు, జూలై13, ప్రభాతవార్త



విశాఖపట్నంకు చెందిన సిహెచ్.వి.వి కుమార్ స్వాతి (బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి) దంపతులు వెండి నామాలు, వెండి తాడు వితరణగా శ్రీ ఉమానీలకంటేశ్వర స్వామి ఆలయానికి వితరణగా ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఆలయ అర్చకులు రామంకు ఆదివారం ఆలయంలో అందజేశారు. ఆదివారం ఉదయం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి గిరి కైలాస్ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి విచ్చేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగల్లి సింహాచలం నాయుడు,రమేష్ నాయుడు,రామారావు,ప్రభాకర్, కరుణ, సిద్ధనాతి కొండలరావు,శివరాత్రి శ్రీనివాస్ కుమార్,కారం దేముడు, కటారి శ్రీనివాస్,బాబురావు, శివాలయం మహిళలు,శివ తదితరులు పాల్గొన్నారు.

### కేజీహెచ్ ట్రైబల్ సెల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన

## అల్లూరి జిల్లా డీఎంఅండ్ హెచ్ఓ డా.విశ్వేశ్వర నాయుడు

పాడేరు, జూలై13, ప్రభాతవార్త



విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కె.జి. హెచ్)లో ఉన్న ట్రైబల్ సెల్‌ను అల్లూరి సీతారామ రాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.టి. విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధి రిఫరల్ సేవలు ద్వార గిరిజన రోగులకు మెరుగైన వైద్య సహాయం అందించే దిశగా కె.జి.హెచ్‌లో చేర్పించి ప్రత్యేక వైద్యుల ఆద్వర్యంలో వైద్య పరీక్షలు, చికిత్సలు మరియు ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు.గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో పూర్వ పాడేరు ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి, నాగులపల్లి శ్రీకాంత్ ప్రత్యేక చొరవతో అప్పటి పాడేరు డివిజన్ పరిధి వైద్యాధికారులు డా.టి.విశ్వేశ్వర నాయుడు, డా. ఏ.ఎస్.ఎల్.వి.శాస్త్రి, డా.సి.యం ప్రసాద్ ద్వారా ప్రణాళికను సిద్ధం చేసి అప్పటి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మరియు కె.జి.హెచ్ సూపరింటెండెంట్ సహకారంతో జులై-2005 సం.లో (కె.జి.హెచ్) ఆవరణలో ట్రైబల్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. కె.జి.హెచ్ సూపరింటెండెంట్, ట్రైబల్ సెల్ వైద్యాధికారితో బ్యాంకు జాయింట్ ఎకౌంట్ తీసుకొని తక్షణమే 5 లక్షల నగదును అకౌంట్‌లో జమ చేశామన్నారు. రిఫరల్ సేవలకై కె.జె.హెచ్‌కు అధిక సంఖ్యలో వస్తున్న గిరిజనులకు టైబల్ సెల్ ద్వారా మెరుగైన వైద్య సేవలు, సూచనలు, సలహాలు అందిస్తూ ఇప్పటికి 20 వసంతాలు పూర్తిచేసుకున్నట్టు తెలుపుతూ టైబల్ సెల్ వైద్యాధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. విశాఖపట్నం కె.జి.హెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌కు విశాఖపట్నం, విజయ నగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల పరిధి ఐ.టి.డి.ఏల ప్రాజెక్టు అధికారులు అధిక నిధులను వెచ్చిస్తూ గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలతో పాటు వైద్యాధికారుల సలహా మేరకు అందుబాటులో లేని అతి ముఖ్యమైన పరీక్షలు ప్రైవేటు ల్యాబ్‌లలో జరుపుట, అందుబాటులో లేని మందులను కొనుగోలు చేసి అందించడం జరుగుతుందన్నారు. కె.జి.హెచ్‌లో వైద్య సేవలు పొందుతూ మరణించిన రోగులకు వారి స్వగ్రామానికి మృతదేహాలను తక్షణమే చేర్చుట కొరకు అల్లూరి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 3 అంబులెన్స్‌లను ఏర్పాటుచేయడం జరిగిందని ఇద్దరు డ్రైవర్లు విధులను నిర్వహించడం జరుగుచున్నదని మరొకరిని భర్తీ చేయవలసి ఉందన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది అన్నీ వేళల అందుబాటులో ఉంటూ విధులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గిరిజన రిఫరల్ రోగుల వివరాలను రికార్డులలో నమోదు చేయడం జరుగుతున్నందున అల్లూరి జిల్లా కలెక్టర్, కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.శివానంద్ ఆద్వర్యంలో ట్రైబల్ సెల్‌ను ఆధునీకరణ జరుపుతూ రోగుల వివరాలు నమోదు కొరకు కంప్యూటర్, ఫర్నిచర్ మున్నగునవి సిబ్బందికి అందించనున్నట్లు అయన తెలిపారు. రిఫరల్ చికిత్సల కొరకు కె.జి.హెచ్ ట్రైబల్ సెల్‌కు వచ్చే గిరిజన రోగులు వైద్య సలహాల కొరకు ఈ క్రింది తెలిపిన ఫోన్ నంబర్ 6303921375ను సంప్రదించాలని డీఎం అండ్ హెచ్ఓ డా.విశ్వేశ్వరనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతా రామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.టి.విశ్వేశ్వర నాయుడు, విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కె.జి.హెచ్) ట్రైబల్ సెల్ వైద్యాధికారి డా.సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

## రంపచోడవరంలో నేటికి పూర్తికాని సచివాలయ భవనాలు



రంపచోడవరం, జులై 13, ప్రభాతవార్త

ఏజెన్సీ ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో నేటికీ ప్రారంభానికి నోచుకొని సచివాలయ భవనాలు. గత ప్రభుత్వం ప్రజలకు అన్ని సేవలు అందుబాటులో తీసు కురావాలనే ఉద్దేశంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో సచివాలయ వ్యవస్థ ఒకటి. అలాంటిది అధికారులు నిర్లక్ష్యం వలన నేటికి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. మారుమూల గ్రామాల్లో సైతం నూతన భవనాలలో సచివాలయలు సేవలు అందిస్తుంటే రంపచోడవరం ప్రధాన కేంద్రంలో మాత్రం నేటికీ సచివాలయ భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో అటు సచివాలయ ఉద్యోగస్తులు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని భవనాలు పూర్తయిన ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని నిర్మాణం పూర్తి కాలేదు. సచివాలయ భవనాల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించిన అధికారి అంతరంగంలో కదలిక లేదు. సగం పూర్తయిన ప్రారంభం కానీ భవనాలు అలంకారప్రాయంగా మిగిలాయి.

## వృద్ధులకు నిత్యావసర వస్తువులు... విద్యార్థినులకు విద్యా సామాగ్రి పంపిణీ

రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త



కొండపల్లి గ్రామంలో ఆదివారం యేసుక్రీస్తు ప్రార్ధనా మందిరంలో యెహోవా ఈరే పౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు డా. ఎం.విజయ భాస్కర్ వారిచే పాస్టర్ పరిశిక చిన్నాలుదొర, పార్వతి సహకారంతో 10 మంది వృద్ధులకు ఒకొక్కరికి రూ.1200లు విలువైన నిత్యావసర వస్తువులు, 15 మంది అనాథ పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, స్టీల్ వాటర్ బాటిల్, లంచ్ బాక్స్, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం సర్పంచ్ కుంజం జగన్నాదం చేతులు మీదుగా జరిగింది. ఒకొక్క విద్యార్థికి రూ.500లు అందించారు. ప్రతీ నెలా రూ.500లు ఇవ్వడం జరుగుతుందని చిన్నాలుదొర అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజం జగన్నాదం, స్థానికులు పాల్గొన్నారు.

## ఆక్రమణలతో కనుమరుగవుతున్న హిందూ స్మశాన వాటిక

### అంత్యక్రియలు నిర్వహించే స్థలాన్ని సైతం ఆక్రమిస్తున్న కబ్జాదారులు



రంపచోడవరం, జూలై 13, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో ఉన్నటువంటి ఒక్క గాన ఒక్క హిందూ స్మశాన వాటిక ఆక్రమణలతో కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంతో పోలిస్తే ఇప్పటికీ సగం పైన ఆక్రమణలతో కనుమరుగవగా మిగతా సగం తుప్పలతో మూసుకు పోయింది. రంపచోడవరంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కరణలు చేయడానికి కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న కొద్దిపాటి స్థలంలో మలవిసర్జనలు చేయడం తుప్పలు పెరిగిపోవడంతో కొద్దిపాటి చిన్న స్థలంలో అనేక ఇబ్బందులు పడుతూ దహన సంస్కరణలు పూర్తి చేస్తున్నారు. హిందూ స్మశాన వాటికలో కనీసం తుప్పలు నరికించే నాథుడు కూడా కరువయ్యారు. మరికొద్ది రోజులు ఇలానే వదిలేస్తే హిందూ స్మశాన వాటిక పూర్తిగా కనుమరుగ అయ్యే పరిస్థితి కనపడుతుంది. తుప్పలు పెరగడం మల విసర్జన చేయడంతో పక్కనే కాలువ ఉన్నప్పటికీ దహన సంస్కరణలకు నీళు తెచ్చుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు గ్రామస్తులు ముందుకు వచ్చి హిందూ స్మశాన వాటిక పై దృష్టి పెట్టాలని చెత్తాచెదారం పిచ్చి మొక్కలతో నిండిపోయిన స్మశాన వాటికను జెసిబితో శుభ్రం చేసి పక్కనే ఉన్న కాలువకు చిన్నపాటి రహదారి నిర్మించాలి అని కోరుతున్నారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం సరిహద్దులు నిర్ణయించి స్మశానం చుట్టూ స్థలానికి రక్షణ చర్యలు చేపట్టి ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ప్రస్తుతం స్మశానలో అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లిన వారికి ఎటువంటి షెల్టర్ లేదు. కనీసం రేకుల షెడ్ అయినా వేసి అక్కడ నాలుగు సిమెంట్ బల్లలు వేయాలి. అక్కడి కార్యక్రమాలు నిమిత్తం వెళ్లినవారు కనీసం ఒక గంట సేపు వేచి ఉండేందుకు ఈ ఏర్పాట్లు పనిచేస్తాయి. గ్రామంలోని అందరూ పూనుకుంటే హిందూ స్మశాన వాటిక పరిశుభ్రం అవుతుంది. ఇందుకు గ్రామంలో ఎవరో ఒకరు భారం తమ భుజాలపై వేసుకొని పని ప్రారంభించాల్సి ఉంది అని స్థానికులు కోరుతున్నారు.

## చింతపల్లిలో ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను పునరుద్ధరించండి..

### అఖిలపక్షం డిమాండ్



చింతపల్లి జూలై 13, ప్రభాతవార్త

చింతపల్లిలోని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అనుబంధంగా నడుస్తున్న ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ యధా విధంగా కొనసాగించాలని అఖిలపక్షం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుండి ఎంతో ఘన చరిత్ర కలిగిన చింతపల్లి ప్రాంతం నుండి ప్రభుత్వ రంగ సంస్థలు ఒక్కొక్కటిగా తరలిపోతున్నాయి అన్నారు. చరిత్ర కలిగిన చింతపల్లి ప్రాంతాన్ని పాలక నాయకులు విస్మరించడం బాధాకరమన్నారు. అల్లూరి జిల్లా చింతపల్లి ప్రాంతానికి ఎంతో ఘన చరిత్ర ఉందని బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు నడియాడిన ప్రాంతం ఇదేనే వారు తెలిపారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న చింతపల్లి ప్రాంతం నుండి మొదటగా ఐటిడిఏ పోయిందని తర్వాత కాలంలో అసెంబ్లీ నియోజకవర్గం, ఆర్ వి నగర్ నుంచి కాఫీ పరిశోధనా సంస్థ, చింతపల్లి డైరీ ఫార్మ్, సిల్క్ పరిశ్రమ వంటి అనేక ప్రభుత్వ సంస్థలు ఒక్కొక్కటిగా వేరే ప్రాంతాలకు తరలిపోయాయి అన్నారు. ప్రస్తుతం ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయంతో ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల రద్దుకు సిద్ధం చేశారన్నారు. భవిష్యత్తులో మరిన్ని తరలిపోనున్నాయోనని వారి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్త వాటిని మంజూరు చేయకపోగా ఉన్న వాటిని తొలగిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నిటిపై పూర్తి కార్యాచరణ సిద్ధం చేశామని ఆర్గానిక్ వ్యవసాయ కళాశాలను మరల పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోకపోతే పోరాటం చేయాలని నిర్ణయించినట్లు అఖిలపక్షం తెలిపింది. ఎంతోమంది గిరిజన పేద విద్యార్థులకు భవిష్యత్తుని ఇస్తున్నటువంటి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తక్షణమే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జల్లి సుధాకర్, మండల వైసిపి నాయకుడు మోరి రవి,మాజీ వైస్ ఎంపీపీ కూడా కృష్ణారావు, జనసేన పార్టీ నాయకులు గొర్లె వీర వెంకట్, సుర్లవీరేంద్ర, టిడిపి మండల నాయకుడు రీమల ఆనంద్, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎంవి రమణ, లోచలి రామకృష్ణ, గెమ్మెలి మోహన్రావు, పలువురు ప్రతిపక్ష నాయకులు పాల్గొన్నారు.

## బీరు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులతో అధ్వానంగా గణేష్ వైన్ షాప్ ప్రాంగణం

### భయందోనలు వ్యక్తం చేస్తున్న గిరిజనులు



అరకులోయ, జూలై 13, ప్రభాతవార్త

పర్యాట కేంద్రమైన అరకులోయలో గణేష్ వైన్ షాపు సమీపంలోని ప్రాంగణం ఖాళీ బీరు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులతో అధ్వానంగా మారింది. దీనికి తోడు ఎదురు గా తహసీల్దార్ కార్యాలయం ఉండడం గమనార్హం. గత కొద్ది రోజులుగా గణేష్ వైన్‌షాప్ సమీపంలోని ప్రాంగణం ఎక్కడపడితే అక్కడ బీరు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులతో దర్శనం ఇస్తుండడంతో తహసీల్దార్ కార్యాల యానికి వచ్చిపోయే గిరిజనులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే గణేష్ పాన్ నిర్వాహకులు ఇవేవీ పట్టించుకోకపోవడంతో స్థానికులు మండిపడుతున్నారు. కొంతమంది ఆకతాయిలు రాత్రి సమయంలో అక్కడ బీరు సీసాలను కూడా పగలు గొట్టిన సందర్భాలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో అటుగా వెళ్లాలంటే భయపడాల్సి వస్తుందని అరకు లోయ వాసులు పేర్కొంటున్నారు. కాగా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అధ్వానంగా బీరు సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు ఉన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. ఇదిలా ఉండగా పర్యాటక కేంద్రమైన అరకలోయలో ప్లాస్టిక్ నిషేధాన్ని శాత శాతం అమలపరుస్తున్నామని ఒకపక్క అధికారులు మరోపక్క నాయకులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లోకి వెళితే భిన్నంగా కనిపి స్తుంది. వైన్ షాప్‌లో మందు తో పాటు, ప్లాస్టిక్ గ్లాసులను విపరీతంగా అమ్మకాలు సాగిస్తున్నారని, దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ గ్లాస్ లే దర్శనమిస్తున్నాయని అరకులోయ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా గణేష్ వైన్ షాప్ తీరుపై అధికారులు పట్టించుకోవాలని స్థానికుల విజ్ఞప్తి చేస్తున్నారు.

## చింతపల్లి సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించేలా ప్రభుత్వానికి సిఫార్సు

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావు


పాడేరు,జూలై13, ప్రభాతవార్త




అల్లూరి జిల్లా చింతపల్లి సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మూసి వేయాలనే ప్రభుత్వ ప్రతిపాదన విరమించుకునేలా చూడాలని స్థానికులు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డి.వి.జి.శంకరరావుకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యాలకు ఇప్పటికే ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. చింతపల్లి ప్రాంతంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తే స్థానిక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించి, 2011లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేశారనీ,ఎంతోమంది విద్యనేర్చుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు.బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల ప్రస్తుత పరిస్థితి వచ్చిం దని తెలిపారు. చైర్మన్ డాక్టర్ శంకరరావు స్పందిస్తూ ఏజన్సీ ప్రాంతంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వుండాల్సిన అవసరం వుందని, ఈ మేరకు కమిషన్ కూడా తమ సిఫార్సులను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని అయన తెలిపారు. చింతపల్లి ప్రాంతంలో వ్యవసాయ కళాశాల అవసరాన్ని గుర్తించే అప్పట్లో కళాశాల ఏర్పాటు జరిగిందని, ప్రస్తుతం స్థానికులు తీసుకు వచ్చిన అంశానికి సంబంధించి అంశాలను పరిశీలించి, కళాశాల కొనసాగేలా చూడాలని కమిషన్ ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుందని చైర్మన్ శంకరరావు పేర్కొన్నారు.

## దశపర్ని పిచికారీతో చీడపీడలు నివారణ : ఎం.సి.ఆర్. పి.అప్పలరాజు

రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త



దశపర్ని కషాయం పిచికారీతో చీడపీడలను పూర్తిగా నివారణ జరిగి పంట అధిక దిగుబడి సాధ్యమని యం.సి.ఆర్. పి.కోసూరి అప్పల రాజు తెలిపారు. కొమరాపురం గ్రామంలో రైతులకు కషాయం తయారీ చేసే పద్ధతిని ఆదివారం అప్పలరాజు చేసి చూపించారు. 10 రకాలు ఆకులు వేపాకు, సీతాఫలం, జిల్లేడు, కానుగ, బొప్పాయి, జామ, ఆముదం మారేదు, మునిడి, వావిలాకు ఇవి ఒక్కోటి రెండు కేజీలు వేయాలన్నారు. అలాగే పచ్చి మిర్చి, కేజీ సొంటి పొడి, కేజీ పొగాకు, కేజీ వెల్లుల్లి, కేజీ పసుపు, ఆర కేజీ లవంగాలు, 125 గ్రాములు మిరియాలు, 125 గ్రాములు దేశీ ఆవు పేడ రెండు కేజీలు నర దేశీ ఆవు మూత్రం 70 లీటర్లు నీరు 10 లీటర్లు కలపాలని తెలిపారు. ఇలా కలిపిన తరువాత రోజు ఉదయం, సాయంత్రం ప్రతి రోజూ సొవ్య దిశగా తిప్పాలన్నారు. ఈ కషాయం 45 రోజులో తయారు అవుతుందన్నారు. రైతులు పండించే అన్ని పంటలకు వాడుకోవచ్చునని వివరించారు. పూత పిందె దశలో వాడరాదన్నారు. 100 లీటర్లు నీటికు 3 లీటర్లు కషాయం కలిపి పిచికారి చేయాలన్నారు. సాయంత్రం వేళల్లో పిచ్చి కారి చేయటం వల్ల రసం పిల్చి పురుగుకాయ తొలుచ పురుగు, కాండం తొలుచు పురుగు, లద్దెపురుగు నివారణగా ఉపయోగ పడుతుందన్నారు. ఐసిఆర్పిలు లోవరెడ్డి, పాపారావు, సత్యనారాయణ, వసంతం రైతులు మనుగుల దేవరాజు, రాజకుమారి, బోనెం రాంబాబు చింతల దేవుడు, సిద్ధా రాజులమ్మ, కోసూరి పెదబాబు, చింతల వెంకటరమణ, కోఫూరి అంజి పాల్గొన్నారు.

## సారాబట్టీ పై దాడి..100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.. ఒకరు అరెస్ట్ రిమాండ్

రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త

బడదనాంపల్లి పంచాయితీ చినరెల్లంగి పాడు అటవీ ప్రాంతంలో ఆదివారం రాజవొమ్మంగి ఎస్.ఐ. నరసింహామూర్తి తన సిబ్బందితో కలిసి సారాబట్టీపై దాడులను నిర్వహించారు. 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఆరు లీటర్ల సారాతో ఒకరిని పట్టుకొని కేసు నమోదు చేసి అడ్డతీగల కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించిన్నట్లు ఎస్.ఐ నరసింహామూర్తి తెలిపారు. సారా తయారీ, రవాణా, అమ్మడం చేస్తే చట్టపరంగా చర్యలను తీసుకొంటామని ఎస్.ఐ హెచ్చరిస్తున్నారు.

## రూ.10 లక్షలతో నిర్మించిన ఆర్.ఓ ప్లాంట్ ప్రారంభం



రాజవొమ్మంగి, జూలై 13, ప్రభాతవార్త

రాజవొమ్మంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రాజమండ్రి ఓ.ఎన్.జి.సి స్వచ్ఛత పక్వాడ 2025.సం. సి.ఎస్.ఆర్ నిధులు రూ.10 లక్షలుతో నిర్మించిన సురక్షత త్రాగునీటి పథకాన్ని ప్రధానోపాధ్యాయులు ఆదిలక్ష్మి అధ్యక్షతన 12 తేదీన ఇ.డి సంతూన్ దాస్ ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. బాలికల మంచినీటి కొళాయిలను హెడ్‌హెచ్. ఆర్.సి.జి.యం ఆర్.ఎస్ రామారావు, కొమ్ము సత్యనారాయణ, సర్పంచ్ గొల్లపూడి రమణిలు సంయుక్తంగా బాలురు మంచినీటి కొళాయిలను ప్రారంభించారు. 500 మంది విద్యార్థులకు త్రాగునీటి సమస్య పరిస్కారానికి సహకారం అందించిన ఓ.ఎన్.జి సి. వారికి హెచ్. యం, ఉపాధ్యాయులు. కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గొల్లపూడి రమణి, విద్యాకమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్, ఓఎన్‌జి. సిజి.యం రునా మంజుంధర్, సంజుక్త దాస్, ప్రధానోపాధ్యాయులు ఆదిలక్ష్మి, మండల విద్యాధికారి టి.సూరయ్యరెడ్డి, గివింగ్ హెండ్స్ పౌండేషన్ చైర్మన్ డా.బి. కిరణ్ బాబు, ఉపాధ్యాయులు శివకృష్ణ , బొజ్జియ్య, ప్రశాంతి, రేష్మ, పాలు బాబు, ఉదయ్, సత్తిబాబు, హరిశ్చంద్రప్రసాద్, అప్పారావు, శాంతి ప్రియ, పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రద్ధతో చదవండి ఉజ్వల భవిష్యత్‌ను పొందండి

### హెచ్ఆర్‌సిప రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి

అరకులోయ, జూలై 13, ప్రభాతవార్త



అల్లూరి జిల్లాలో విస్తృత సేవా కార్యక్రమాలు చేపడు తున్న మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి తన సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మండలంలోని గన్నెల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా విద్య, బాల్యం, మహిళల సమస్యలపై అవగాహన కల్పించారు. శ్రద్ధతో విద్య నభ్యసించి ఉన్నత శిఖరాలను అందు కోవాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో కూడిన చదువును చదువుకొని పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అవగాహన సదస్సులో బాల్యవివాహాలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షుణ్ణంగా వివరించారు.

## రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ నూతన కార్యవర్గం

### ప్రతి ఒక్కరూ సేవే లక్ష్యంగా పనిచేయాలి - రోటరీ గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి

విశాఖపట్నం, జూలై 13, ప్రభాతవార్త




డాల్ఫిన్ హోటల్లో రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ 2025-26కి గాను నూతన కార్య వర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులు గా ఎస్.కామేశ్వరరావు, కార్యదర్శిగా కె.మారుతి, కోశాధికారిగా ఏఎన్ గోపాల్ ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా,ఎన్నికల అధికారిగా విచ్చేసిన డా.కళ్యాణ్ చక్రవర్తి వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన ప్రసంగిస్తూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు అందరూ చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహించి సేవే లక్ష్యంగా సంస్థ ఉన్నికి కృషి చేయాలన్నారు. గౌరవ అతిథిగా పి.శోభన్ ప్రకాశ్, ప్రత్యేక ఆహ్వానితులుగా అసిస్టెంట్ గవర్నర్ ఎన్.గాయత్రి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎస్ కామేశ్వరరావు వారి బృందం ముందుగా తమ ఆమోదాన్ని తెలిపి తదుపరి వారి స్పందనలో రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థ ఉన్నతికి దోహదపడటమే కాకుండా శక్తివంచన లేకుండా సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, అర్ నీరజ, కామేశ్వరరావు సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వం అప్పులకోసం విశాఖ ఆస్తులను తాకట్టు పెట్టారు..

### ప్రజల జీవితాలతో ఆడుకుంది : నగర మేయర్ పీలా శ్రీనివాస్

గాజువాక, జూలై 13, ప్రభాతవార్త



అభివృద్ధి ముసుగులో అప్పులకోసం విశాఖ ఆస్తులను తాకట్టు పెట్టి,ప్రజల జీవితాలతో వైకాపా ప్రభుత్వం ఆడుకుందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాస్ గత వైకాపా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గాజువాక జీవీఎంసీ 65వ వార్డులో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ఆదివారం జీవీఎంసీ మేయర్ పీలా శ్రీను విచ్చేసారు. శంకు స్థాపన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతు బిడ్డ అయిన వైకాపా నేత బొత్స ప్రజల మధ్యకు వచ్చారా? వాళ్ల నాయకుడు వై ఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు పరదాలమాటున పయనించాడే తప్ప జనం మధ్యకు వచ్చాడా..? ఎనాడైనా ప్రజల కష్టాలను పట్టించు కున్నాడా అని విమర్శన బాణాలు సంధించారు. రైతుల ముసుగులో రాజకీయంచేస్తే కూటమిప్రభుత్వం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రినారాచంద్రబాబు నాయుడు ఒకవిజన్‌ఉన్ననాయకుడు అని సంపదను ఎలాసృష్టించాలో తద్వారా సంక్షేమాన్ని ఎలా పరుగులు పెట్టించాలో తెలిసిన ప్రజా నాయకుడు అని అన్నారు. పరిశ్రమల ద్వారా యువతకు బంగారు బాట వేసే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నేడు ప్రజల మధ్యలోకి కిరాయి గుండాలను తీసుకొని వెళ్లి రాధంతాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీను చంద్రబాబు నాయుడు నెరవేరు స్తున్నారని, ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పేరుతో 15వేల రూపాయలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో వేసి,అన్నాకాంటీన్ లద్వారా పేదవాడికిపట్టెడు అన్నం అందించిన ఘనత చంద్రబాబు నాయుడేనని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఏడాదికి 500 రూపాయలు పెంచుకుంటూ ఐదేళ్లు కాలం తరువాత 3000 పెన్షన్ ఇచ్చాడని,కూటమి ప్రభుత్వం అన్నమాట ప్రకారంగా 4000 పేదలకు పెన్షన్ రూపంలో ప్రతీ నెల అందిస్తుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లాలో చేసిన అరాచకాన్ని రాష్ట్ర రైతులందరూ కూడా చూశారని అన్నారు. వైసీపీ నాయకులు రాక్షసుల మారి,అరాచకాలు స్రష్టిస్తున్నా రని మండి పడ్డారు. వైసీపీ ఖేల్ ఖతం అని 2029లో కూడా ప్రజల దీవెనలతో కూటమి ప్రభుత్వం ఎర్పుడు తుందని అన్నారు. మళ్ళీ అధికారంలోకి వైకాపా ప్రభుత్వం వస్తుందనే పగటి కల మానుకోవాలని వైకాపా శ్రేణులకు మేయర్ పీలా హితవు పలికారు. ఈ మీడియా సమావేశంలో 65వ వార్డ్ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు,జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాస్,జనసేన నాయకురాలు రెయ్యి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగురాలైన మహిళ అదృశ్యం

### - పెందుర్తి పీఎస్‌లో కేసు నమోదు



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక దివ్యంగురాలైన మహిళ అదృశ్యం అవ్వడంతో కేసు నమోదు చేసారు. పోలీసుల సమాచారం మేరకు పెందుర్తి, బృందావన్ కాలనీకి చెందిన లావేటి అరుణ(34) ఈ నెల 11 తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు కన పడకుండా పోయింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు శని వారం రాత్రి 9:30 గంటలకు కేసు నమోదు చేసారు. బాధితురాలిని గమనించినవారు లేదా ఎటువంటి సమాచారం కలిగినవారు వెంటనే 9985543514, 9440796039, 9676797314 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పెందుర్తి సీఐ సతీష్ కుమార్ తెలిపారు. మానవతా దృక్పథంతో స్పందించి, బాధితురాలిని గుర్తించేందుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యంతో ముంపుకు గురైన జ్ఞానాపురం

### 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ..



విశాఖపట్నం, జూలై 14, ప్రభాతవార్త

జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం ఎర్రిగడ్డ ప్రాంతం చిన్నపాటి వర్షానికి మురికి నీరు ఇళ్లల్లోకి చేరి ఆ ప్రాంతమంతా నీట మునిగిందని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం కేవలం కూటమి ప్రభుత్వం వైఫల్యమైన అని మండిపడ్డారు. గత జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో జ్ఞానాపురం ఎర్రగడ్డ సమస్యపై గళం ఎత్తినప్పటికీ కూటమి మేయర్ గెడ్డ పూడికలు వేరు చేసి, మురికి నీరు ప్రవహించేలా చేసే ప్రక్రియ టెండర్ను కొనసాగించలేదు. గత వైసిపి ప్రభుత్వంలో ఈ ప్రాంతం తుఫాన్లు కూడా వచ్చినప్పటికీ ఎప్పటికప్పుడు గెడ్డ పూడికలు తీసి మురికి నీరు అంతా సముద్రంలో కలిసేలా చేయడం వల్ల ఎటువంటి సమస్యలు ఇక్కడి ప్రజలకు తలెత్తకుండా చూడడం జరిగిందన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వ వైఫల్యం కారణంగా, స్థానిక కూటమి నేతలు కేవలం ప్రజల నుండి అవినీతి సొమ్మును జలగల్లే పేదవారి రక్తం పీల్చడము తప్ప స్థానికుల సమస్యలు పట్టవని కార్పొరేటర్ పూర్ణిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా బాధ్యతగల కార్పొరేటర్‌గా తాను పోరాడుతున్నప్పటికీ టెండర్లు నిధులు మంజూరు చేయకుండా అడ్డుకట్టకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తమను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు న్యాయం జరిగేలా ఎంతటి వరకు వెళ్లడానికైనా తాము సిద్ధమని వెల్లడించారు.



ఇటువంటి చిన్నపాటి వర్షానికే ఇలా జరిగితే, భారీ వర్షపాతం కానీ తుఫాన్లు గాని వస్తే ఇక్కడ ఎర్రగడ్డ పొంగి ప్రవహిస్తే చాలా కుటుంబాలు నీట మునిగి అనేక సమస్యలు తలెత్తితే దానికి బాధ్యత కూటమి ప్రభుత్వమే వహించాలని కోడిగుడ్ల పూర్ణిమ హెచ్చరించారు. ఇప్పటికైనా 41వ వార్డు ఎర్రగడ్డ టెండర్ను కొనసాగించి డ్రైనేజీలు కాలువలు పొంగిపొర్లకుండా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కాకి గోవింద రెడ్డి ఆధ్వర్యంలో హిందువు స్మశాన వాటికలో స్వచ్ఛభారత్



గాజువాక, జులై13, ప్రభాతవార్త

జీవీఎంసీ 69వ వార్డ్ కాపు తుంగ్లాం హిందువు స్మశాన వాటికలో ఆదివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. వార్డ్ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 40మంది యువకులు, గ్రామ పెద్దలు పాల్గొని స్మశానంలో పేరుకుపోయిన చెత్తను,పిచ్చి మొక్కలను తొలగించి, శుభ్ర పరిచారు. ఈ సందర్భంగా కాకి గోవింద రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం అని అన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలాది అచ్చిబాబు, గుండు రామారావు, విరోతు అప్పారావు, గంటకోరు ప్రసాదు, విరోతు వరహాలు, విరోతు భవాని, శంకర్ విరోతు, దుర్గాప్రసాద్ విరోతు, శ్రీనివాసరావు, రాజు, కంచిపట్టి తేజ కర్ణం శ్యామ్ సలాది యశ్వంత్, గుమ్మడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు రానున్నాయి..

జగదాంబ, జూలై 13, ప్రభాతవార్త



రాష్ట్రంలో రోజురోజుకు బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయని ఇదేవిధంగా దాడులు కొనసాగితే రానున్న రాజుల్లో బీసీలు అందరూ ఏకతాటిపై వచ్చి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు రానున్నాయని దక్షిణ నియోజకవర్గంలో ఏర్పాటు చేసినటువంటి పత్రిక సమావేశంలో విశాఖ జిల్లా వైఎస్ఆర్సిపి బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న శ్రీకాకుళం జిల్లాలో బీసీ నేత ఉప సర్పంచ్ సత్తారు గోపిని హత్య చేసిన ఘటన, నిన్న బీసీ మహిళ కృష్ణాజిల్లా జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక పై దాడి వంటి ఘటనలుతో బీసీలును కూటమి ప్రభుత్వం ఏ రకంగా చూస్తుందో రాష్ట్రంలో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బీసీల మీద దాడులు వంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



గాజువాక, జులై 13,ప్రభాతవార్త

నియోజకవర్గం లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ టీడీపీ అధ్యక్షులు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గాజువాక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ప్రజా దర్బార్ నిర్వహించారు. మధ్యాహ్నం 1 వరకు నిర్వహించిన ప్రజాదర్బార్లో సుమారు 200మంది వరకు తమ సమస్యలను పల్లా దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా హౌస్ కమిటీలోని స్థలాలలో నిర్మాణాల సమస్యలను, మౌలికసదుపాయాల కల్పన తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విన్న ఎమ్మెల్యే పల్లా పరిష్కరించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద సంస్థలో ఉచిత కంటి వైద్య శిబిరం

జగదాంబ, జూలై 13, ప్రభాతవార్త



శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సంస్థ, హైటెక్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సౌజన్యంతో 39వ వార్డు, పాత పోస్ట్ ఆఫీస్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మంది హాజరు కాగా, 60 మంది కంటి పరీక్ష నిమిత్తం ఎన్నికయ్యారు. ఈ కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా దక్షిణ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ వైద్య శిబిరంలో పాల్గొని పర్యవేక్షించారు. యాసిన్ బాబ్జి, కోట వీధి మసీదు ప్రెసిడెంట్ ముషరత్ అలీ ఖాన్, కోట వీధి జాలారి కుల పెద్ద కదిరి అప్పారావు, పెదబాబు, ఆవాజె కమిటీ ప్రెసిడెంట్ ఎం.డి.అహ్మద్, 39వ వార్డు వైఎస్ఆర్ సిపి ప్రెసిడెంట్ ముజీద్ ఖాన్, టి.కృష్ణ, అఫ్సర్, శంకర్ ఫౌండేషన్ డా.గౌతమి, సిబ్బంది దీపిక, గిరిజ క్యాంపుకోనిటర్ వై పైడి రాజు, 39 వార్డు నాయకులు పాల్గొన్నారు.

## సోమవారం జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

### విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు -జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్





విశాఖపట్నం, జులై 13 ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 జులై 14వ తేదీ సోమవారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాస రావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు, హారికల్చర్, రెవిన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జులై 14వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

## యువకుడు ఆత్మహత్య

గాజువాక,జులై 13,ప్రభాతవార్త

కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాపురం పోలిస్టేషన్ పరిధి రామకృష్ణాపురం వెంకన్న పాలెం ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. తమ్మిన వరుణ్ కుమార్ స్థానికంగా లైటింగ్, డ్రైవింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. 22సం క్రితం భవానిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాలు కారణంగా 18సం నుంచి భార్య భర్తలు విడివిడిగా జీవిస్తున్నారు. శనివారం మద్యం సేవించిన వరుణ్ తల్లితో విభేదించాడు. దీంతో తల్లి సోదరుని ఇంటికి వెళ్ళింది. దీంతో మనస్థాపానికి గురైన వరుణ్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మ చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించామని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని మల్కాపురం పోలీసులు తెలిపారు. కుటుంబం విడిపోవడం వలన, మద్యానికి బానిసై ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## డొంకాడకు కళాభిషేకం పురస్కారం



గరివిడి జూలై,13 ప్రభాతవార్త

పౌరాణిక నాటకాల్లో విభిన్న పాత్రల్లో అద్భుతంగా నటించి అనేక పురస్కారాలు,ఉత్తమ కళాకారులుగా మరెన్నో అవార్డులు అందుకున్న గరివిడి కి చెందిన ప్రముఖ రంగ స్థల కళారులు డొంకాడ రామచంద్రరావు కి శ్రీ సత్య సాయి జిల్లా గంగిరెడ్డిపల్లికి చెందిన తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ కళాభిషేకం పురస్కారాన్ని అందించింది. ప్రశంసాపత్రం ప్రధానం చేసిన సంస్థ రామచంద్రరావుకి దుస్సాలువతో సత్కరించి సముచిత గౌరవాన్ని అందించింది. రంగస్థలంపై తనదైన శైలిలో అనేక పాత్రల్లో నటించిన డొంకాడ కు కళాభిషేకం పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యస్.అంజనప్ప, గౌరవాధ్యక్షులు డాక్టర్ సామవేదం బాల సుబ్రహ్మణ్యం,డైరెక్టర్ పెద్దరికం సాయిలు ప్రధానం చేశారు.కాగా రామచంద్ర రావుకి అభినందనలు తెలిపారు.

## చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా విస్తృత స్థాయి సమావేశం జయప్రదం చేయండి



గరివిడి జూలై,13 ప్రభాతవార్త

గరివిడి వి గ్రాండ్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించే చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా విస్తృత స్థాయి సమావేశం జయప్రదం చేయాలని గరివిడి మండల వైకాపా అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వర రావు కోరారు. శాసన మండలి విపక్ష నేత,మాజీమంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనే విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకు జరిగే సమావేశంలో నియోజకవర్గ నాయకులు,సర్పంచ్, ప్రాదేశిక సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెక్కు సంఖ్యలో పాల్గొనాలని మీసాల కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### తల్లడిల్లిపోయిన యువకుడు తల్లి తండ్రులు..



శృంగవరపుకోట, జూలై,13 ప్రభాతవార్త

మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ నవోదయ స్కూల్ సమీపంలో శని వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బొడ్డవర పంచాయతీ లచ్చొందరపాలెం గ్రామానికి చెందిన కండెపల్లి సుధీర్(18)తన స్నేహి తులతో కలిసి అదే పంచాయతీ అంబదాసుపాలెం గ్రామానికి చెందిన నిఖిల్ ఆటోలో ముషిడిపల్లి బయలు దేరారు. అయితే నవోదయ సమీపంలో ఎదురుగా వస్తున్న టాటా ఏఎస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న సుధీర్ ప్రమాద స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందాడు.ఇక స్నేహితులు గణేష్,జగదీష్,నిఖిల్ గాయ పడ్డారు.వీరిని ఎస్.కోట ప్రభుత్వ ఆశుపత్రికి తరలించగా ఇందులో గణేష్ పరిస్థితి విషమించడంతో వెంటనే విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.మృతి చెందిన సుధీర్ ఎస్.కోటలో ఐటీఐ చదువుతున్నాడు.ఒక్కగానే ఒక్క కొడుకు మృతి చెందడంతో సుధీర్ తల్లి తండ్రులు ప్రమాద స్థలం వద్ద తల్లడిల్లిపోయి బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నక్యాంటీన్ గుంతల్ చూస్తే గుండెల్ గల్లంతే ....!



సాలూరు, జూలై 13 ప్రభాతవార్త

సాలూరు పట్టణ తహిశీల్దార్ కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ కొత్త భవనం స్లాబ్ వరకు వచ్చి సగం నిర్మాణం జరిగినిలిచి పోయింది. మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో అన్నక్యాంటీన్ వస్తుందని పేదవాడి ఆకలి తీరుతుందని అందరూ ఎక్స్పెక్ట్ చేశారు. కాని ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యి బిల్లులు పడక ఆ కాంట్రాక్టర్ తన రెండు చేతులు రెండు జేబుల్లో పెట్టుకొని శూన్యంలోకి చూస్తున్నట్లుగా టౌన్ లో టాక్.ఈవిషయం పక్కన పెడితే అన్నక్యాంటీన్ ముందు నిర్వహణ కోసం రెండు పెద్దగుంతలు తవ్వి వాటిని అలాగే వదిలేయడంతో నిత్యం ఎమ్మార్వో ఆఫీస్ కు పనులుపై వచ్చే వారు సడన్ గా వాటిని చూస్తే గుండ జారిపోతుంది. ఇందుమూలంగా చెప్పేదేంటంటే అన్నక్యాంటీన్ అటుంచి ముందు ఆ కాంట్రాక్టర్ ఈ గుంతలపై ఏదైన పలకలాంటిది ఏర్పాటు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

## సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసగించిన చంద్రబాబు

### మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ విమర్శ



నెల్లిమర్ల,జూలై 13, ప్రభాతవార్త

టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల పేరుతో మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత బడ్డు కొండ అప్పలనాయుడు విమర్శించారు. చంద్రబాబు షూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నగర పంచాయతీలోని జరజాపుపేట లో ఆదివారం జరిగింది. నగర పంచాయతీ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారంటూ వైసిపి పార్టీ అధిష్టానం ముద్రించిన కరపత్రాలను బడ్డు కొండ, పార్టీ నాయకులు లాంచనంగా ఆవిష్కరించారు. బడ్డుకొండ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజల నిలువునా మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమై ఏడాది గడుస్తున్న ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోయారని ఆయన ఎద్దేవా చేశారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతోపాటు నగర పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, జెడ్పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు మత్స సత్యనారాయణ,ఎస్సీ సెల్ నాయకుడు రేగాన శ్రీనివాసరావు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మద్దిల వాసు, శ్రీనివాసరావు,పార్టీ నాయకులు నల్లి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, కనకల హైమావతి, చిక్కాల సంతోష్ కుమార్ర,వి, మజ్జి గణేష్ ,కోట్ల పైడినాయుడు, మహంతి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చీపురుపల్లిలో కరెంటు కష్టాలు.. గాలిలో కలిసిన కూటమి పాలకుల హామీలు..



చీపురుపల్లి జూలై 13, ప్రభాతవార్త

గత పాలకులు చేసిన తప్పులనే ప్రస్తుత పాలకులు కూడా చేస్తూ ప్రజల దృష్టిలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారంటూ పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఎన్నికల హామీలలో భాగంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలవకుండా చూస్తామని హామీలు నిచ్చిన కూటమి పాలకులు ప్రస్తుతం హామీలను గాలికి వదిలేసి కనీస పర్యవేక్షణ లేకపోవడం వలన చీపురుపల్లి ప్రాంతంలో ప్రజలు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారు అంటూ పలురూ బహిరంగంగా పాలకుల పనితీరును తోయబడుతున్నారు. వేలపాల లేని విద్యుత్ కోతలతో వినియోగదారులతో పాటు నిత్యం విద్యుత్ పై ఆధారపడి వ్యాపారాలు కొనసాగిస్తున్న పరువు సైతం పాలకుల పనితీరును అధికారుల పర్యవేక్షణను దుమ్మెత్తి పోస్తున్నారు. గతంలో కరెంటు కోతలు ఉన్నప్పటికీ ఇంత విచ్చలవిడిగా ఉండేవి కాదంటూ పలువురు జ్ఞాపకం చేస్తున్నారు. ఈ సంఘటనపై వినియోగ దారులు ఇప్పటికే పాలకుల పనితీరును తీయబడుతూ నిత్య అవసరమైన విద్యుత్తును విచ్చలవిడిగా అదుపు చేయడం పట్ల ప్రజలకు వివరణ ఇవ్వాలని ఇప్పటికైనా పాలకులు అధికారులు చీపురుపల్లి ప్రాంతంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ కష్టాల పైన దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే జగదేశ్వరి



కురుపాం, జులై13, ప్రభాతవార్త

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు ఆదివారం కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీపురం మండలం చెముడుగూడ, అడ్డంగూడ, తాటిశీల, గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిదిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ముందుగా టీడీపీ నాయకులు, గ్రామస్తులు పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేశామన్నారు. పింఛన్ రూ.1000 పెంచడానికి జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్ల పడితే చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో పింఛను రూ.4000 వేలకు పెంచారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నాం. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కూడా అందజేస్తాం అని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్పర్సన్ కద్రక కళావతి, మాజీ సర్పంచ్ రామారావు, కొండలరావు, భాస్కర్ రావు, సదానంద్, రవి, శ్రీను, ఈశ్వర్, మంగయ్య, ప్రకాష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అపరిచిత వాహనం ఢీకొని స్కూటరిస్ట్ మృతి



సాలూరు, జూలై 13, ప్రభాతవార్త

సాలూరు బైపాస్ రోడ్‌లో తండ్రి కొడుకులు స్కూటీపై వెళ్తుండగా అపరిచిత వాహనం ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా కొడుకు త్రుటిలో తప్పించు కొని ప్రాణాలు దక్కించుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణ గొర్లెవీధికి చెందిన గొర్లె ధర్మా రావు బైపాస్ రోడ్‌లో ఉన్న తన పొలం దగ్గర కళ్లం నుండి ఆదివారం ఉదయం స్కూటీపై వస్తుండగా వెనక నుండి గుర్తు తెలియని వాహనం స్పీడుగా ఢీకొట్టడంతో ధర్మారావు రోడ్డు మీదపడి తలకు తీవ్రగాయం అయ్యింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందగా తన కొడుకు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచా రంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలా నికి చేరుకొని కేసు నమోదు చేసుకుని వివరాల సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే సీసీ ఫుటేజీలు పరిశీలించి అపరిచిత వాహనాన్ని గుర్తుపట్టేందుకు దర్యాప్తు చేస్తున్నామని స్థానిక విలేకరులకు తెలిపారు.

## గ్రామాల వారీగా జనసేన బలోపేతం కావాలి : నియోజకవర్గ ఇన్చార్జ్ విసనగిరి శ్రీనివాసరావు



చీపురుపలి, జూలై 13, ప్రభాతవార్త

చీపురుపల్లి నియోజకవర్గం పరిధిలోని గ్రామాల వారీగా జనసేన పార్టీ బలోపేతం కావాలని చీపురుపల్లి నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు చీపురుపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.జనసేన పార్టీ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించిన విసనగిరి భవిష్యత్తులో జనసేన పార్టీ మరింత బలోపేతం కావాలని పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ప్రతి ఒక్కరు కృషి జరపాలని ఆయన కోరారు. జనసేన పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు చీపురుపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశాన్ని స్థానిక ఇన్చార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు ఏర్పాటుచేశారు. ప్రతి గ్రామపంచాయతీ నుండి క్రియాశీలక జనసేన నాయకులు హాజరవడం జరిగింది వారందరి అభిప్రాయాలు తీసుకున్నానంతరం, ఇకపై జనసేన పార్టీనీ గ్రామస్థాయిలో ఏ విధంగా బలోపేతం చేయాలన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. గ్రామ స్థాయిలో ప్రతి ఒక్క జనసేన నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని విసనగిరి పిలుపునిచ్చారు.

## కూటమి పార్టీ దుండగులను వెంటనే అరెస్టు చేయాలి : చీపురుపల్లి జడ్పిటిసి శిరీష



చీపురుపల్లి, జూలై 13, ప్రభాతవార్త

కృష్ణ జిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పల హారిక పై దౌర్జన్యం చేసిన తెలుగుదేశం,కూటమి పార్టీ దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి అని చీపురుపల్లి జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష డిమాండ్ చేసారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని చీపురుపల్లి జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు, గుడివాడలో క్రిష్ణజిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పల హారిక ఒక బిసి మహిళ అన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి 50% మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించడం వలన బీసీ మహిళగా జడ్పీ చైర్ పర్సన్‌గా ఎంపిక అయ్యారు అన్నారు. జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వ లేక రెడ్ బుక్ గుండాలు అతి దారుణంగా ఆమే కారును ధ్వంసం చేయటం అసభ్యకరంగా బూతులు తిడుతూ దౌర్జన్యం చేసి కార్ అద్దాలు బద్దలు కొట్టడం సభ్య సమాజం తల దించుకునే విధంగా ఆమెను అవమాన పరిచారు అన్నారు. రాష్ట్ర హోమ్ మంత్రి ఒక మహిళ అయి ఉండికూడా ఇలా మహిళా ప్రజాప్రతినిధులు మీద దాడి జరిగిన ఆమె ఏమి మాట్లాడకుండా మౌనంగా ఉండటం చూస్తే ఆశ్చర్యంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రంలో మహిళల మీద ఎవడు అయిన దాడి చేసిన, దౌర్జన్యం చేసిన వాడి తాట తీస్తాను అని సినిమా డైలాగులు స్టేజ్ మీద చెప్తారు తప్ప నిజమైన పరిపాలన కొనసాగించడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న దాడులు, హత్యాచారాలు, హత్యల మీద ప్రజా సంఘాలు, మానవహక్కులసంఘాలు, విజ్ఞాన వంతులు ప్రతి ఒక్కరు దీన్ని ఖండించవలసిందిగా జడ్పీటీసీ శిరీష కోరారు.

## దళారులతో నలిగిపోతున్న జిందాల్ రైతులు



శృంగవరపుకోట, జూలై 13, ప్రభాతవార్త

జిందాల్ సంస్థ మోసాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయి. దళారులతో రైతులకు మోసం జరుగుతుంది. మండలంలోని జిందాల్ భూనిర్వాసితులు గత 24 రోజులుగా జరుగుతున్న పోరాటంలో పలు రకాలైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. జిందాల్ కంపెనీ వస్తుందని గత 2008లో భూములు ఇచ్చిన రైతులకు వెంటనే కొంత మొత్తం వేశారు.గత 18 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి మొత్తం డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తూ వచ్చారు.జిందాల్ యాజమాన్యం ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని ప్రతిపాదన వచ్చిన దగ్గరనుంచి జిందాల్ యాజమాన్యం నుంచి రైతులకి షేర్లు డబ్బులు అని ఒక పేపర్ మీద వెనుముద్రాలు వేయించి వారి అకౌంట్లో నేరుగా డబ్బులు వేస్తున్నారు.డబ్బులు వేసిన తరువాత కొంతమంది దళారులు తిరిగి రైతులు వద్ద నుంచి సగం డబ్బులు గుంజడానికి పన్నాగాలు పన్నుతున్నారని సమాచారం. కొంతమంది అమాయకులైన గిరిజన రైతులు మధ్యవర్తులకి డబ్బులు ఇచ్చారని తెలుస్తోంది. కొంతమంది రైతులు తిరగబడడంతో వారిని పలు రకాలుగా వేధిస్తున్నారు.ఇందులో భాగంగా ముషిడిపల్లి పంచాయతీ చీడిపాలెం గ్రామస్థుడు అప్పలరాజు అనే వ్యక్తి నేడు మీడియా ముందుకు వచ్చి తన ఆవేదనను వ్యక్తం చేశాడు.తమకు 18 సంవత్సరాలు గడిచిన తరువాత నాకు వుండే భూమికి సంభందించి ఎనిమిది లక్షలు డబ్బుకు వేసి తిరిగి మూడు లక్షలు లంచంగా ఇవ్వాలని కొందరు స్టానిక నాయకులు అడుగుతున్నారని తెలిపారు.నాభూమి పోయి తిరిగి డబ్బులు అడగడం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇలా చాలా మంది రైతులను ఇటు జిందాల్ సంస్థ అటు దళారులు మోసం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

## చదువును మించిన ఆస్తి లేదు : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

### జ్యోతి బా పూలే విద్యార్థినీలకు తన సొంత నిధులతో 100 పరుపులను అందించిన ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపుకోట, జూలై 13, ప్రభాతవార్త

సమాజంలో విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఉపాధ్యాయలకు తల్లిదండ్రులకు సూచించారు.ఆదివారం జమ్మదేవి పేట కేంద్రంగా పని చేస్తున్న కొత్తవలస మహాత్మా జ్యోతి బా పూలే బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ యూ విజయ కుమార్ పాత్రో అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు తన సొంత నిధులు రూ.1,30,000 లతో 100 పరుపులను విద్యార్థులకు అందించడం జరిగిందిఆలాగే కూటమి ప్రభుత్వం ద్వారా వచ్చిన సర్వే పల్లి రాధాకృష్ణ విద్యా కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ" గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు వారసత్వంగా ఎక్కువ మొత్తంలో ఆస్తినిచ్చేవారని ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తికన్నా విద్యే గొప్పదని అభిప్రాయ పడ్డారు. ప్రస్తుతం పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామన్నది ముఖ్యం కాదని ఉన్నత చదు వులు చదివించి వారిని జీవితంలో స్థిరపడేలా చేయటమే ముఖ్యమని పేర్కొన్నారు. డబ్బు ఆస్తులు శాశ్వతం కాదని విద్యే శాశ్వతమని ఆమె తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆస్తిపాస్తులు అన్ని ఒకరోజులో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కానీ ఉన్నత విద్యను అభ్యసించడం వలన అది జీవితాంతం తోడుగా ఉండటంతోపాటు జీవితంలో స్థిరపడేలా చేస్తుందన్నారు. కొత్తవలస ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, మాజీ జెడ్పిటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ ఈశ్వరరావు,గొంప దుర్గా ఉమేష్, పోతు నాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాణ స్వీకారం చేస్తున్న విజేతలు వీరే



రామభద్రపురం, జూలై 13, ప్రభాతవార్త

ఈ నెల 13న ఎంపిడిఓ కార్యాలయం, రామభద్రపురం నందు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లు జరిగాయి, ఇందులో రామభద్రపురం, సాలూరు, పాచిపెంట, మక్కువకు సంబందించిన జిల్లా పరిషత్ ఉద్యోగులకు పాల్గొంటారు. ఇందులో యునానిమస్ అధ్యక్షులుగా చొక్కాపు శ్రీరాములు నాయుడు, ఎస్.ఎ.ఎండిఓ ఆఫీసు రామభద్రపురం సెక్రటరిగా కె.రమణమ్మ, జె.ఎ.ఆర్‌డబ్ల్యుఎస్ ఆఫీస్ సాలూరు, జిల్లా కౌన్సిల్ మెంబర్–1గా బి.సంతోష్ కుమార్, టైపిస్ట్, ఎండిఓ ఆఫీసు రామభద్రపురం జిల్లా కౌన్సిల్ మెంబర్–2గా బి.గౌరునాయుడు, ఆర్‌వి వేదసమాజం స్కూల్, సాలూరు వైస్ ప్రెసిడెంట్‌గా బిఆర్‌కెబికె నాయుడు, ఎస్.ఎ ఎండిఓ ఆఫీసు మక్కువ ట్రెసారర్‌గా ఎన్.హరికృష్ణ, జెఎ ఎండిఓ ఆఫీసు సాలూరు ఆర్గనైసింగ్ సెక్రటరీగా ఎన్.నాగేశ్వరరావు, టైపిస్ట్, ఎండిఓ ఆఫీస్, పాచిపెంట వారు ఎన్నికైయారు.

## సూర్యపేరంలో స్వర్ణ కమలార్చన, సహతలింగార్చన



పార్వతిపురం, జులై13, ప్రభాతవార్త

శ్రీ సూర్య పీఠంలో భానువార ప్రయుక్త సౌర దీక్షలో సూర్య నమస్కారములు, సౌరారుణ పారాయణ సహిత హోమము, రుద్రమన్యుసూక్త మంత్ర హవనము, సుదర్శన హోమము, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, మిత్ర రవి సూర్య భాను ఖగ పూష హిరణ్యగర్భ మరీచి ఆదిత్య సావిత్రు అర్క భాస్కర దేవతలకు పూజలు జరిగాయి. నవనాగ అర్చన నవగ్రహ హోమములు, విశ్వశాంతి మంత్ర హోమములు, ఆదిత్య పంచాయతన మూర్తులకు స్వర్ణ కమలార్చనలు, కపిల గోపూజ, మహామృత్యుంజయ దీక్ష, సహస్ర లింగార్చనలు బ్రహ్మశ్రీ శ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, వేమకోటి శివ శర్మ, వేమకోటి బద్రి శర్మ, డి.ఉమాశర్మ, టి.ఆర్.కృష్ణ శర్మ, కేశవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వరుణుడు కొరకు నిరీక్షిస్తున్న పత్తి రైతులు

పాచిపెంట, జూలై 13, ప్రభాతవార్త



వాణిజ్య పంటల్లో ఒకటైన పత్తి పంట రైతులు వరుణుడు కొరకు నిరీక్షిస్తున్నారు. మండలంలో అధిక విస్తీర్ణంలో వాణిజ్య పంట కావడంతో మూడు దశాబ్దాలుగా రైతులు పత్తి పంట విస్తీర్ణంగా నాటారు. ఇటీవల గత రెండు మూడు వారాల నుండి తరచు తుఫాను మాదిరిగే చినుకు చినుకు పడుతూ కొంతమేరకు పత్తి రైతులకు నష్టం కలిగే విధంగా వాతావరణం అనుకూలించకపోవడంతో పత్తి పంట ఇవ్వక తో పాటు గడ్డి పుట్టి పత్తి మొక్కను పెరగడానికి ఆటంకం కలిగించడంతో పత్తి రైతులు ఆందోళన లో పడ్డారు. ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరగడంతో పత్తి పంటలు బీటలు వాలి ఎండిపోతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. ఏడాది ఖరీఫ్ సీజన్లో పత్తిమొక్కజొన్న, విత్తనాలు నాటినప్పటి నుండి తరచు వర్షాలు కురియడం వలన అంత ఎదుగుదలకు కొంతమేర నష్టం వాటి పలు రైతులు తెలిపారు. అయితే అనావృష్టి అతివృష్టి కావడంతో మొక్క జొన్న పత్తి పంటలకు ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులుపెట్టిన రైతన్నలకు కష్టాలు తప్పడం లేదని బాహాటంగా రైతన్నలు వాపోతున్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

25

## సమ్మె విరమించిన పారిశుధ్య కార్మికులు

గరివిడి జూలై, 13 ప్రభాత వార్త

కొండపాలెం(గరివిడి)మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించారు. ఈ మాసాంతం లోగా వేతనాలు చెల్లించేందుకు పంచాయతీ పాలకులు హామీ ఇవ్వడంతో కార్మికులు అంగీకరించి సమ్మె విరమించారు. కొండపాలెం సర్పంచ్ ప్రతినిధి పి.కుమార్,ఉప సర్పంచ్ బమ్మిడి కార్తీక్, మాజీ ఉప సర్పంచ్ బమ్మిడి అప్పలస్వామి, మాజీ ఎంపిపి పైల బలరాం, టీడీపీ అధ్యక్షుడు సారేపాక సురేష్,గొట్టిముక్కల సత్తిరాజు, ఈఓ ఎస్.నాగమణి కార్మికులతో జరిపిన చర్చల్లో పాల్గొన్నారు. పాలకులు హామీతో ఐదు రోజులుగా చేసిన కార్మికుల సమ్మెకు తెరపడింది.

## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు



గజపతినగరం, జూలై 13, ప్రభాతవార్త

రాష్ట్రంలోని తమ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఏఎంసీ చైర్మన్ పీ.వి.వి గోపాల రాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన ఎం వెంకటాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ, ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సుపరి పాలన దిశగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకువెళ్తున్నారు అన్నారు. ఆర్థికంగా సంక్షోభంలో కురుకుపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో శ్రమిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బూడి మన్మధరావు, అభిరామ్, ఆక్కు నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వ్యాస మహర్షి పురస్కారం అందుకున్న 'చంద్రరావు'



గజపతినగరం, జూలై 13, ప్రభాతవార్త

వ్యాస మహర్షి పురస్కారం నకు ఎంపికైన ఉపాధ్యాయుడు కనకల చంద్రరావు ఆ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. గుంటూరు జిల్లా బాపట్లలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జాతీయ హిందూ ఉపాధ్యాయు సమితి నిర్వాహకులు ఈ అవార్డును అందజేశారు.శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు చంద్రరావు విలేకరులకు తెలిపారు. చంద్రరావు ప్రస్తుతం మండలం లోని మర్రివలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

## అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు : ఎమ్మెల్యే కిమిడి



చీపురుపల్లి, జూలై 13, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళని చీపురుపల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి తెలుగు దేశం పార్టీ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పాత గవిడి వీధిలో నిర్మించిన సిసి రహదారులను ఆయన ప్రారంభించారు. అనంతరం కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో పాత గౌడ్ వీధిలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా అర్హులైన అందరికీ డబ్బులు జమ అయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తుందని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు తెలుగుదేశం పార్టీ చీపురుపల్లి మండల అధ్యక్షుడు రౌతు కామ నాయుడు, చీపురుపల్లి టౌన్ ప్రెసిడెంట్ గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, రాంబాబు, వలి రెడ్డి శ్రీరాములు నాయుడు, మీసాల శ్రీధర్, మన్నే ప్రకాష్ రావు, మీసాల కాశీ, బొంగ మహేష్, ముల్లు రమణ, సబ్బి సోనియా కలిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నోరు లేక చేతకాక కాదు: మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర



మక్కువ, జులై 13 ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం మరియు పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు పీడిక రాజన్న దొర పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు గడుస్తున్న ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని ప్రజలకు ఇవ్వటం లేదని తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేశారని ఆయన అన్నారు. ప్రతినెల పెన్షన్లు ఇవ్వటానికి కోసమే మంత్రులు ఉన్నట్లు పెన్షన్లు పంచుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీల వలన ప్రజలు విరక్తి చెందుతున్నారని ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఎదుటివారిపైన బురద జల్లడం సమంజసం కాదన్నారు. కొంతమంది నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని తమకు నోరు లేక చేతగాక కాదని సంయమనం పాటిస్తున్నామే తప్ప చేతగాక కాదని ఆయన కూటమి నాయకులకు హెచ్చరించారు. జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, సాలూరు మండల వైసిపి అధ్యక్షులు దండి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన్మ దేవి పేట వద్ద రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి



లక్కవరపుకోట, జులై 13 ప్రభాతవార్త

మండలంలోని జమ్మదేవి పేట గ్రామం విశాఖ అరకు ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు కారు బైక్ డి కొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అధిక రక్త శ్రావం కావడంతో ప్రమాదం జరిగిన వెంటనే మృతి చెందాడు దీనితో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ అంత రాయం ఏర్పడింది విషయం తెలుసు కున్నా ఎల్ కోట పోలీసులు సంఘటన గురించి సమాచారం తెలుసు కుని ట్రాఫిక్ ని క్లియర్ చేసి కేసు నమోదు చేసి బాడీని పోస్ట్ మార్టం నిమిత్తం ఎస్ కోట ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

## రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా బమ్మిడి



దత్తిరాజేరు, జులై 13, ప్రభాతవార్త

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష నియామక జాబితాలో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన బమ్మిడి అప్పలనాయుడుకు రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పార్టీ పెద్దలు నియమించారు. ఈయన ప్రస్తుతం దత్తిరాజేరు మండల వైస్ ఎంపీపీ కొనసాగుతున్నారు. నాకు బాధ్యత అప్పజెప్పిన శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొత్స అప్పల నర్సయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. నాకు నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికీ పార్టీకి ఎల్లప్పుడు కష్టపడిపని చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య నివాసంలో కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్ననన్నారు.

## కలివరంలో సుపరిపాలనలో తొలి అడుగు

### -కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన



ఆమదాలవలస, జూలై 13, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్య పడుతుందని పియుసి చైర్మన్ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కలివరం పంచాయతీ లో పీర్ సాహెబ్ పేటలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులు పొందుతున్న సేవలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నియోజవర్గం పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, రాష్ట్ర కాలింగా కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులు నూకరాజు, సనపల ఢిల్లీ శ్వరరావు, మండల యువత అధ్యక్షుడు తమ్మినేని నాని, తమ్మినేని అమర్నాథ్, హనుమంతు బాలకృష్ణ, బుడుమూరు సీతారాం, గురుగుబెల్లి రాజశేఖర్, తీర్లంగి శ్రీను, తమ్మినేని రాజేంద్ర, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

## నారాయణవలస సంతకు పూర్వపు వైభవం తీసుకు వస్తా : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి– ప్రభాతవార్త

నారాయణవలస సంతకు పూర్వపు వైభవం తీసుకువస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన ఆదివారం మండలం నారాయణవలస సంత పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళల్లో నారాయణ వలస సంతలో ఉలాంటి పనులు చేయకుండ సర్పంచ్ రూ.1.50 కోట్లు బుక్కేశాని ఇవిషయం విజిలెన్సు ఎంక్వరీలో తేలిందని ఆయన తెలిపారు. అయితే మింగిన ప్రతి రూపాయికూడా కక్కిస్తానని ఆయన తెలిపారు. రూ.600 కోట్లుతో హిరమండలం రిజర్వాయర్ నుంచి పైపు లైన్లు ద్వారా నీటిని తెచ్చి నియోజకవర్గంల మొత్తం ఇంటింటికి త్రాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. టెక్కలి ఆర్‌డీవో ఎన్.క్రిష్ణమూర్తి, స్థానిక ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, టీడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్ర రామక్రిష్ణ, పూజారి శ్కెలజ, రోణంకి లీలామోహన్, కర్రి అప్పరావు, జి రఘు, పాల్గొన్నారు.

14-7pg10exV.qxd:14-7pg10exV.qxd 1/1/02 8:14 AM Page 1






## షూటింగ్ ప్రపంచ కప్‌లో..
# తొలిసారి ఫైనల్‌కు నీరు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్ షాట్‌గన్ స్టేజ్ చివరి రోజున జాతీయ క్రీడల ఛాంపియన్ భారత్ షూటర్ నీరు దండా మహిళల ట్రాప్‌లో తొలిసారిగా ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుని నాల్గవ స్థానంలో నిలిచింది. ఇటలీలోని లోనాటోలో జరుగుతున్న నాల్గవ, చివరి అంతర్జాతీయ స్పోట్స్ టోర్నీలో 50 షాట్‌ల ఫైనల్‌లో ఆమె తన మొదటి 35 లక్ష్యాలలో 30 వాటిల్లో అధిక్యం కనపరచింది. గత సంవత్సరం న్యూఢిల్లీ ప్రపంచ కప్ ఫైనల్ విజేత అలెస్సియా ఇజ్జీ (ఇటలీ)పై షూట్ ఆఫ్‌లో (21) గెలిచి ఆరవ మరియు చివరి అర్హత స్థానాన్ని పొందిన నీరు, ఆ ఎలిమినేషన్ దశలో ప్రపంచ కప్ స్టేజ్ విజేత, పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత సిల్వానా మరియా స్టాంకో (ఇటలీ)తో సమంగా నిలిచిన తర్వాత, అధిక బిబ్ సంఖ్య కారణంగా చివరికి నిష్క్రమించింది.

ట్రాప్ కాన్కావర్డే శ్రేణిలో, నీరు 25 మరియు 24 రౌండ్లు షాట్ చేసి తన 66 (21,23,22) పాయింట్లకు జోడించింది, ఇజ్జీ సాధించిన స్కోరుకు సమానమైన 115 స్కోరును సాధించింది. ప్రీతి రాజక్ (114) కూడా ఆ రోజు 23 మరియు 25 రౌండ్లతో బాగా కోలుకుని 66 (20, 24, 22) పాయింట్లను జోడించింది, కానీ ఒకటి తక్కువ చేసి ఎనిమిదో స్థానంలో నిలిచింది. ప్రగతి దూబే (18, 18, 21, 19, 24) సరిగ్గా 100 పాయింట్లతో వెనక్కి తగ్గింది.

ఇక పురుషుల ట్రాప్‌లో జోరావర్ సింగ్ సంధు (24, 25, 24, 24, 24) తన చివరి రెండు అర్హత రౌండ్లలో ఒక్కొక్కటి పడగొట్టాడు, 121 పాయింట్లతో, చివరి రెండు స్లాట్‌ల కోసం ఇద్దరు మాజీ ఒలింపిక్ ఛాంపియన్‌లతో ఐదుమార్గాల షూట్‌ఆఫ్‌లో తన రెండవ షాట్‌ను కోల్పోయి ఔట్ అయ్యాడు. జోరావర్ సహచరులు లక్షయ్ షెరాన్ (24, 22, 24, 23, 23) మరియు జస్ప్రీందర్ సింగ్ (23, 24, 22, 23, 24) ఒక్కొక్కరు 116 పాయింట్లు సాధించి లీడర్‌బోర్డ్‌లో మరింత వెనుకబడిపోయారు.




## వన్డే కెప్టెన్ నుండి
# రోహిత్ ఔట్!
### గిల్‌కు అప్పగించే యత్నాలు
### రేస్‌లో శ్రేయాస్ అయ్యర్




**న్యూఢిల్లీ:** భారత్ స్టార్ క్రికెటర్, ట్రబుల్ షూటర్ రోహిత్ శర్మకు మరో బిగ్ షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. భారత్ కెప్టెన్ రోహిత్ టెస్టులకు ఇప్పటికే గుడ్ బై చెప్పాడు. దీంతో టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు యువ ఆటగాడు శుభమన్ గిల్‌కు అప్పగించారు. అయితే వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. కాని ఇప్పుడు వన్డే కెప్టెన్‌గా రోహిత్‌ను తప్పించి ఆ బాధ్యతలు కూడా గిల్‌కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతుండటం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. టెస్ట్ కెప్టెన్‌గా సాధించిన అద్భుతమైన విజయం, రోహిత్ స్థానంలో భారత వన్డే కెప్టెన్‌గా గిల్ పగ్గాలు తీసుకునే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2027 ప్రపంచ కప్, రాబోయే వన్డేలకు గిల్ నాయకత్వం వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వరల్డ్‌కప్‌కు ముందు భారత జట్టులో మరో పెద్ద మార్పు జరగబోతుందని ఇప్పటికే భారత్ క్రికెట్ బోర్డు సంకేతాలు ఇచ్చింది. దీని పర్యవసానమే ప్రపంచ కప్‌తో పాటు, తదుపరి ఆడే వన్డేలకు గిల్ నాయకత్వం తెర ముందుకొచ్చింది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇది జరగొచ్చని అంటున్నారు. కాగా 2024లో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఐదవ టెస్ట్‌లో రోహిత్ టెస్ట్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత టెస్టులకు గుడ్ బై చెప్పాడు. అప్పటి నుంచి వన్డే కెప్టెన్ గా రోహిత్‌ను తప్పిస్తారనే ప్రచారం మొదలైంది. అయితే 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టుకు నాయకత్వం వహించేందుకు, భారత్ తరపున వన్డే, టెస్టులు ఆడటానికి రోహిత్ సంసిద్ధతను తెలిపాడు. కానీ ఇంగ్లాండ్‌తో టెస్ట్‌లకు జట్టును ప్రకటించడానికి ముందే సెలెక్టర్లు రోహిత్‌ను టెస్ట్ కెప్టెన్సీ నుండి తొలగించాలని నిర్ణయించినట్లు నివేదికలు ఉన్నాయి. దాంతో టెస్ట్ ఫార్మాట్ నుండి రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్ట్‌లకు ముందు వన్డేల్లో గిల్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. 2023, 2024లో ఓపెనర్‌గా అద్భుతంగా రాణించి పరుగుల వరద పారించాడు. ఇక ఇంగ్లాండ్‌లో వ్యూహాత్మక నిర్ణయాలతో అతని కెప్టెన్సీ ఆకట్టుకునేలా ఉంది. సహచరులను కలుపుకుని ముందుకెళ్తున్నాడు. కాగా వన్డే కెప్టెన్ రేసులో వినిపిస్తున్న మరో పేరు శ్రేయాస్ అయ్యర్. అతను కూడా నాల్గవ స్థానంలో స్థిరపడ్డాడు. మరోవైపు ఇండియన్ ప్రీమియర్‌లో కెప్టెన్ గా అయ్యర్ చూపిన టాలెంట్ తో ఉత్తమ వైట్‌బాల్ కెప్టెన్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో వన్డే సిరీస్‌లకు భారత్ కెప్టెన్‌గా శ్రేయస్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు వెల్లడవుతోంది.



# యూరప్ టూర్‌లో ఇండియా మూడో విక్టరీ

**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్‌ను ఓడించి, యూరప్ టూర్‌లో వరుసగా ఇండియా పురుషుల హాకీ జట్టు మూడో మ్యాచ్‌ను గెలిచింది. ఐండ్‌హోవెన్‌లోని హాకీ క్లబ్ ఆరంజేరూడ్‌లో జరిగిన పర్యటనలోని మూడో మ్యాచ్‌లో ఫ్రాన్స్‌ను 3–2 తేడాతో ఓడించింది. ఇండియా హాకీ జట్టు తరపున ఆదిత్య అర్జున్ లాల్గే, బాబీ సింగ్ ధామి గోల్స్ చేశారు. ఆదిత్య అర్జున్ లాల్గే రెండు గోల్స్ సాధించగా, అతని సహచరుడు బాబీ కూడా స్కోరు షీట్‌లోకి ప్రవేశించాడు.

ఆదిత్య అర్జున్ లాల్గే మొదటి గోల్ చేశాడు, ఆ తర్వాత అతను పిసిని కూడా గోల్‌గా మార్చాడు. బాబీ సింగ్ ధామి భారతదేశం తరపున మూడవ గోల్ సాధించగా తద్వారా విజయం సాధించారు. ఇంతలో,




ఫ్రాన్స్ తరపున, రెండు గోల్స్‌ను క్లెమెంట్ సాధించాడు. ఈ యూరప్ పర్యటనలో ఇండియా పురుషుల హాకీ జట్టు ఇంకా మొత్తం ఐదు ఆటలు ఆడాల్సి ఉంది. కెప్టెన్ సంజయ్ మరియు వైస్‌కెప్టెన్ మోయిరంగ్థెమ్ రబీచంద్ర సింగ్ నేతృత్వంలో, ఇండియా యూరప్‌లోని మూడు నగరాల్లో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడనుంది. ఇండియా ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్)లో ఐర్లాండ్, ఫ్రాన్స్ మరియు నెదర్లాండ్స్‌తో చెరో రెండు మ్యాచ్‌లు ఆడనుండగా, వారు వరుసగా ఆమ్స్టెల్వీన్ (నెదర్లాండ్స్) మరియు ఆంట్వెర్ప్ (బెల్జియం)లో ఇంగ్లాండ్ మరియు బెల్జియంతో చెరో మ్యాచ్ ఆడనున్నారు.

జాతీయ సెటప్ భారత సీనియర్ జట్టు కోసం బలమైన ప్రతిభ గల బృందాన్ని నిర్మించాలని చూస్తున్నందున ఈ మ్యాచ్‌లు ఆటగాళ్ల లోతు మరియు సంసిద్ధతను పరీక్షిస్తాయని భావిస్తున్నారు.

# భారత్‌కే మహిళల టి20 సిరీస్
## చివరి మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ విక్టరీ

**న్యూఢిల్లీ:** అతిధ్య ఇంగ్లంతో జరిగిన ఐదవ మరియు చివరి మహిళల టీ20 లో భారత్ ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఓడిపోవడంతో ఓపెనర్ షఫాలి వర్మ దూకుడు అర్ధ సెంచరీ వృధా అయింది. దీంతో 3–2 తేడాతో టీమిండియా టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ షఫాలి 41 బంతుల్లో 75 పరుగులు చేసి మహిళల జట్టును ఆదుకుంది. దీంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 167 పరుగులకు పరిమితమైంది.. వర్మ ఇన్నింగ్స్ 14వ ఓవర్లో చార్లీ డీన్ బౌలింగ్‌కు బలైపోయే ముందు 13 బౌండరీలు, ఒక సిక్స్‌తో తన ఇన్నింగ్స్‌ను ముగించింది, దీంతో భారత్ 111/5 వద్ద నిలిచింది. మిగిలిన భారత బ్యాట్స్‌మెన్లు పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్,. రాధా యాదవ్ మాత్రమే ఇన్నింగ్స్‌లో రెండంకెల మార్కును చేరుకున్నారు. వారిలో కూడా, ఘోష్ మాత్రమే మధ్యలో ఒకింత రాణించింది ఆమె 16 బంతుల్లో మూడు బౌండరీలతో 24 పరుగులు చేసింది, ఇంగ్లాండ్ బౌలర్లు భారత్ ప్లేయర్ల పరుగుల ప్రవాహాన్ని అద్భుతంగా తగ్గించారు. ఇంగ్లాండ్ తరఫున డీన్ 3/23 ప్రదర్శనలో స్టార్‌గా నిలిచింది. సోఫీ ఎక్లెస్టోన్ కూడా 2/28తో ముగించింది. ఫలితంగా భారత్ 167 పరుగులు చేసింది. ఇక 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య ఇంగ్లండ్‌కు మరోసారి అద్భుతమైన ఆరంభం లభించింది, ఓపెనర్లు సోఫియా డంక్లీ మరియు డేనియల్ వ్యాట్‌హాడ్జ్ తొలి వికెట్‌కు 11 ఓవర్లలోపు 101 పరుగులు జోడించారు. డంక్లీ 30 బంతుల్లో 46 పరుగులు చేసి మూడు బౌండరీలు, ఒక సిక్సర్ తో రాణించి యాదవ్ ఎడమచేతి వాటం బౌలింగ్ లో ఔటైంది. వ్యాట్‌హాడ్జ్ 37 బంతుల్లో 56 పరుగులు చేసి తొమ్మిది బౌండరీలు సాధించింది. ఆ తర్వాత దీప్తి శర్మ ఆ ధాటికి వెంటనే వికెట్ కోల్పోయి ఇంగ్లాండ్ స్కోరు 107/2 వద్ద నిలిచింది. మైయా బౌచర్ (16), టామీ బ్యూమాంట్ (30), మరియు అమీ జోన్స్ (10) ఆతిథ్య జట్టు తమ మార్గాన్ని కోల్పోకుండా చూసుకుని ఔటయ్యారు. తదుపరి పైజ్ స్కోఫీల్డ్ మరియు ఎక్లెస్టోన్ ఇన్నింగ్స్ చివరి బంతికి ఇంగ్లాండ్ చివరికి లక్ష్యాన్ని చేరుకునేలా చేశారు. ఫలితంగా భారత్ ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనా 3 -2 తేడాతో సిరీస్‌ను దక్కించుకుంది.

# ఐదేళ్లలో 20 లక్షల టన్నులకు రబ్బర్ టర్నోవర్

**న్యూఢిల్లీ, జులై 13:** భారతదేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం చైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. 2025లో, దేశీయ ఎన్ఆర్ ఉత్పత్తి 8.7 లక్షల టన్నులుగా ఉంది, అయితే వినియోగం 14.1 లక్షల టన్నులు, ఫలితంగా 5



లక్షల టన్నులకు పైగా లోటు ఏర్పడింది అని ఆయన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. భారత దేశంలో సహజ రబ్బరు (ఎన్ఆర్) వినియోగం 2030 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంటుందని అంచనా వేయబడింది మరియు దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆటోమోటివ్ టైర్ తయారీదారుల సంఘం చైర్మన్ అరుణ్ మామెన్ అన్నారు. బహుళ రంగాలకు, ముఖ్యంగా టైర్ పరిశ్రమకు ఎన్ఆర్ యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, దేశీయ సహజ రబ్బరు (ఎన్ఆర్) ఉత్పత్తిని వేగవంతం చేయడం జాతీయ ప్రాధాన్యత. రబ్బరు సాగు కింద అదనపు ప్రాంతాన్ని తీసుకురావడం ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాలు వంటి సాంప్రదాయేతర ప్రాంతాలలో కీలకం. అనేక ఈశాన్య రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఎజెండాకు ముందస్తుగా మద్దతు ఇస్తున్నా యని ఆయన అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో తొలిసారిగా ఐఎన్ఆర్ఓఎడి (ఇండియన్ నేచురల్ రబ్బరు ఆపరేషన్స్ ఫర్ అసిస్టెడ్ డెవలప్‌మెంట్) ప్రాజెక్టును ఎటిఎంఎ సభ్య కంపెనీలు (అపోలో, సియోట్, జెకె టైర్, మరియు ఎంఆర్ఎఫ్) రబ్బరు బోర్డు ఆఫ్ ఇండియా సహకారంతో ప్రారంభించాయని శ్రీ మామెన్ ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు ఈశాన్య మరియు పశ్చిమ బెంగాల్ అంతటా రెండు లక్షల హెక్టార్లలో కొత్త రబ్బరు తోటలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి నాలుగు సంవత్స రాలలో 1.25 లక్షల హెక్టార్ల కు పైగా సాగులోకి వచ్చాయి. ఎటిఎంఎ సభ్య కంపెనీలు ఈ ప్రాజెక్టుకు రూ.1,100 కోట్లు కేటాయించాయని ఆయన అన్నారు. కేరళలో మాత్రమే 1 లక్ష హెక్టార్ల తో సహా దాదాపు 2 లక్షల హెక్టార్లలో ఉపయోగించని రబ్బరు తోటలను నొక్కడం ద్వారా ఉత్పత్తిని మెరుగుపరచడంలో ఒక ముఖ్యమైన అవకాశంఉంది. కేంద్ర వాణిజ్య అండ్ పరిశ్రమల మంత్రి ఇటీవల కేరళలో వాటాదారుల సంప్రదింపుల సందర్భంగా ఈ అవకాశాన్ని నొక్కి చెప్పారని శ్రీ మామెన్ అన్నారు. రబ్బరు చెట్లు నాటడం నుండి నొక్కడం వరకు దాదాపు ఆరు నుండి ఏడు సంవత్సరాలు పడుతుందని శ్రీ మామెన్ అన్నారు.

# బంగారం కొనాలా, నిఫ్టీలో ఇన్వెస్ట్ చేయాలా?

**ముంబై, జులై 13:** ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు పెడితే బంగారం కొనుంటేనా, లేక నిఫ్టీ 50లో పెట్టుబడి పెట్టి ఉంటేనా.. ఏది అధిక లాభాన్ని ఇచ్చి ఉండేది? ద్రవ్యోల్బణానికి రక్షణగా బంగారాన్ని చూస్తారు. కానీ, ఈక్విటీ దీర్ఘకాలంలో అద్భుత వృద్ధిని నమోదు చేసింది. ఈ రెండింటిలో ఏది ఇన్వెస్టర్ల సొమ్మును వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల కాలంలో భౌతిక బంగారం, నిఫ్టీ 50 సూచీ రెండూ 90 శాతానికి పైగా అబ్సల్యూట్ రిటర్న్ ఇచ్చాయి. ఈక్విటీలో పెట్టుబడి ఐదేళ్లలో ఎంతో మందికి సంపదను పెంచింది. ఇది ఐదేళ్ల కాలంలో స్థిరమైన వృద్ధిని సాధించింది. మీరు ఐదేళ్ల కిందట రూ.5 లక్షలు ఈ రెండింటిలో ఏది పెట్టుబడిగా పెట్టి ఉంటే అధిక లాభం వచ్చేది? పోలికల ద్వారా, ఐదేళ్లలో ఏది ఇన్వెస్టర్ల సంపదను వేగంగా పెంచిందో తెలుసుకోండి. ఐదేళ్ల క్రితం, ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధరలను తీసుకుంటున్నాం. 2020 జులై 7న ముంబైలో బంగారం ధర గ్రాముకు రూ.4,626. నేడు అదే నగరంలో అదే నాణ్యత గల బంగారం ధర గ్రాముకు రూ.8,861. శాతంలో చెప్పాలంటే, ఐదేళ్ల ధరల పెరు గుదల 91.54 శాతం.



సామాన్యుడిని కోటీశ్వరుడిగా చేసింది. బంగారం, నిఫ్టీ 50లో పెట్టుబడులు పెట్టిన వారు అధిక రాబడిని కోరుకుంటారు. ఈ రెండు పెట్టుబడులు ఒకదానికొకటి సంబంధం లేనివి. స్వల్ప, దీర్ఘకాలంలో విభిన్న ఫలితాలు ఇవ్వగలవు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచ అనిశ్చితి మధ్య బంగారం విలువ పెరిగింది. మరోవైపు, భారత్‌లో మార్కెట్ కేపిటలైజేషన్ అధికంగా గల 50 అతిపెద్ద కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ 50, ఒక సంవత్సరంలో కేవలం 4.68 శాతం రాబడిని ఇచ్చింది. కానీ 91.54 శాతం. బంగారంపై రూ.5 లక్షల పెట్టు బడి విలువ నేడు ఐదేళ్ల కిందట భౌతిక బంగారంపై పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి అంచనా విలువ నేడు రూ. 9,57,700. నిఫ్టీ 50 సూచీ పనితీరు 5ఏళ్లలో నిఫ్టీ 50 సూచీ 25,461.30 వద్ద ముగిసింది. ఐదేళ్లలో సూచీ వృద్ధి 135.76 శాతం. నిఫ్టీలో రూ. 5 లక్షల పెట్టుబడి విలువ ఐదేళ్ల కాలంలో 135.76 శాతం అబ్సల్యూట్ రిటర్న్ తో, నిఫ్టీ 50 సూచీలో పెట్టిన రూ. 5 లక్షల పెట్టుబడి రూ.11,78,800గా మారింది. ఒక సంవత్సర కాలంలో నిఫ్టీ 50 సూచీని బంగారం అధిగమించినప్పటికీ, ఐదేళ్ల కాలంలో మాత్రం నిఫ్టీ50 రాబడి కంటే బంగారం బాగా వెనుకబడి ఉందని ఇది చూపిస్తుంది.

# వాణిజ్యం

# ఆర్థిక భద్రతకు వెండి ఆసరా..

**ముంబై, జులై 13:** మీరు నాణేలు, కడ్డీలు లేదా ఆభరణాల రూపంలో వెండిని కొనుగోలు చేయవచ్చు. వెండి నాణేలు విస్తృతంగా లభిస్తాయి, సులభంగా నిల్వ చేయవచ్చు లేదా విక్రయించవచ్చు. వెండి కడ్డీలు వివిధ పరిమాణాల్లో వస్తాయి, గ్రాముకు మెరుగైన విలువను అందిస్తాయి. మీరు చాలా సంవత్సరాలు వెండిని కొని దాచుకోవాలని అనుకుంటే దానిని సురక్షితమైన లాకర్ లేదా బ్యాంకు వాల్ట్‌లో నిల్వ చేయడం మంచిది. సిల్వర్ ఇటిఎఫ్‌లు అంటే వెండిని భౌతికంగా సొంతం చేసుకోకుండానే పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ఫండ్స్ వెండి మార్కెట్ ధరను ట్రాక్ చేస్తాయి. సాధారణ షేర్ల వలె స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో వర్తకం అవుతాయి. భారతదేశంలో, అనేక మ్యూచువల్ ఫండ్ సంస్థలు సిల్వర్ ఇటిఎఫ్‌లను అందిస్తున్నాయి. ఇది చిన్న మొత్తాలతో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టడాన్ని సులభతరం చేస్తుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో, మీరు ఇప్పుడు ఆన్‌లైన్‌లో చిన్న మొత్తాల్లో (ఒక గ్రాము కూడా) వెండిని కొనవచ్చు. మీ వెండిని విక్రేత సురక్షితంగా నిల్వ చేస్తారు. మీరు తర్వాత విక్రయించడానికి లేదా భౌతిక డెలివరీ అడగడానికి ఎంచుకోవచ్చు. ఇది సౌకర్యవంతంగా ఉంటుంది, కాగిత రహిత పెట్టుబడిని ఇష్టపడేవారికి అనుకూలంగా ఉంటుంది. వెండిని తవ్వే కంపెనీలలో పెట్టుబడి పెట్టడం అధిక రాబడిని ఇవ్వగలదు, కానీ అధిక నష్టాలు ఉంటాయి. ఈ స్టాక్స్ వెండి ధరలు మాత్రమేకాకుండా, కంపెనీ పనితీరు, మార్కెట్ పోకడలు, నిర్వహణ సమస్యల వల్ల ప్రభావితమవుతాయి. అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లకు, సిల్వర్ ఫ్యూచర్స్ మరో ఎంపిక. ఇవి నిర్ణీత ధరకు తర్వాత తేదీలో వెండిని కొనడానికి లేదా విక్రయించడానికి ఒప్పందాలు. అయితే, వీటికి లోతైన మార్కెట్ అవగాహన, అధిక స్థాయి నష్టం ఉంటాయి.




కరెన్సీ విలువ తగ్గినప్పుడు వెండి మీ సంపదను రక్షిస్తుంది. బంగారం కన్నా వెండి చౌక. ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెల్స్ వంటి పరిశ్రమల్లో దీనిని ఉపయో గిస్తారు. ఇది దీర్ఘకాల డిమాండ్‌ను పెంచుతుంది. స్టాక్స్, బాండ్లు లేదా రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోకు వెండిని చేర్చడం సమతుల్యతను ఇస్తుంది. సులభంగా వెండిని ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సులభంగా కొనవచ్చు, అమ్మవచ్చు. వెండిలో పెట్టుబడి పెట్టడం దీర్ఘకాలం పాటు మీ సంపదను

# ఐఐఎఫ్‌ఎల్ హోంఫైనాన్స్‌కు రూ.858 కోట్ల రుణం

**న్యూఢిల్లీ, జులై 13:** ఐఐఎఫ్‌ఎల్ హోం ఫైనాన్స్ కంపెనీ తాజాగా 100 మిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్‌బ్యాంకు (ఎఐఐబి)నుంచి భారత కరెన్సీలోసుమారు 858 కోట్లమేర రుణసాయం సేకరించింది. అందుబాటుధరల్లో హౌసింగ్‌ఫైనాన్స్‌చేసే సంస్థ ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, అల్పాదాయ వర్గాలకు ఇళ్లను నిర్మించి అందిస్తోంది. గ్రీన్‌బిల్డింగ్ ప్రమాణాలను అనుసరించి హౌసింగ్‌రంగంలో కంపెనీ మరింత ముందుకువెళుతోంది. ఇడబ్ల్యుఎస్, ఎల్ఐజి సెగ్మెంట్లలో ఇళ్లను నిర్మించి విక్రయిస్తుంది. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో కూడా ఈ ఇళ్లనిర్మాణం చేపడుతోంది. సుస్థిర వాతావరణ పరిరక్షణ లక్ష్యాలు చేరుకుంటూనే భారత్‌లో ఒకమోస్తరు పట్టణాలు, అర్బన్‌ప్రాంతాల్లో మరింత విస్తరించేందుకు ఈ నిధులు వినియోగిస్తామని కంపెనీ ప్రకటించింది. ఎఐఐబి డైరెక్టర్ జనరల్ గ్రెగ్ లియూ మాట్లాడుతూ, ఐఐఎఫ్‌ఎల్, హెచ్‌ఎఫ్‌ఎల్, ఎఐఐబిలు భాగస్వామ్యంతో అందుబాటు ధరల్లో అందరికీ పక్కాగృహాలు అందించేందుకు మరింత వీలు కలుగుతుందని, అలాగే అల్పాదాయ వర్గాలకు పక్కాఇళ్లను కూడా అందుబాటు లోకి తెచ్చేవిధంగా ఐఐఎఫ్‌ఎల్ ముందుకు వెళుతుందని ధీమా వ్యక్తంచేసారు. భారత్‌లోని 18 రాష్ట్రాల్లో 376 శాఖలు పనిచేస్తున్నాయి. ఐఐఎఫ్‌ఎల్, హెచ్‌ఎఫ్‌ఎల్ సంస్థలు ఇప్పటి వరకూ అందుబాటులోకి రాని కేంద్రాలు, పట్టణాలు సెమీ అర్బన్‌ప్రాంతాలపై ఫోకస్ పెంచింది.



# రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ చర్యలు!

**ముంబై, జులై 12:** దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకు అయిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. రూ.4.88 లక్షలు జరిమానా విధించినట్లు ప్రకటించింది. తన క్లయింట్‌కు టర్మ్ లోన్ మంజూరు చేసేటప్పుడు 'మాస్టర్ డైరెక్షన్-ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ ఇండియా' నిబంధనలను విస్మరించిందని, అందుకు గానూ విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) సెక్షన్ 11 నిబంధనల ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుపై జరిమానా విధించినట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ఉల్లంఘనలపై ఆర్‌బిఐ షోకాజ్ నోటీసు జారీ చేయగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిందని, మౌఖిక సమర్పణలో కూడా చేసిందని రిజర్వ్ బ్యాంకు తెలిపింది. కేసు వాస్తవాలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు స్పందనను పరిగణనలోకి తీసుకుని జరిమానా విధించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది.

**శ్రీరామ్ ఫైనాన్స్‌కూ పెనాల్టీ** డిజిటల్ లెండింగ్ సంబంధిత నిబంధనలను పాటించ నందుకు బ్యాంకింగేతర ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్‌బిఎఫ్‌సి) అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పైనా రిజర్వ్ బ్యాంకు జరిమానా విధించింది. ఆర్‌బిఐ జారీ చేసిన రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (డిజిటల్ లెండింగ్) ఆదేశాలు, 2025 లోని కొన్ని నిబంధనలను పాటించనందుకు ఆర్‌బిఐ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై రూ.2.70 లక్షల జరిమానా విధించింది.




2024 మార్చి 31 నాటికి శ్రీరామ్ ఫైనాన్స్ ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఆర్‌బిఐ చట్టబద్ధమైన తనిఖీని నిర్వహించింది. ఆర్‌బిఐ ఆదేశాలను పాటించకపోవడం, సంబంధిత ఉత్తరప్రత్యుత్తరాల ఆధారంగా, ఆ ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు జరిమానా ఎందుకు విధించకూడదో కారణం చూపాలని కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు బ్యాంకు తెలిపింది. రుణగ్రహీతలు నేరుగా రుణ చెల్లింపులను కంపెనీ ఖాతాలో జమ చేయడానికి బదులుగా థర్డ్ పార్టీ ఖాతా ద్వారా రుణ చెల్లింపులను కంపెనీ మళ్లించిందని ఆర్‌బిఐ తన తనిఖీలో గుర్తించింది. దీంతో శ్రీరామ్ ఫైనాన్స్‌కు జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు రిజర్వ్ బ్యాంకు తెలిపింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.